ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



ప్రఖర ప్రజ్ఞ

# యుగశక్తి  గాయత్రి

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః



సజల శ్రద్ధ


**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం

**డా॥ మారెళ్ల శ్రీరామకృష్ణ**

**డా॥ తుమ్మూరి కందర్ప రామచంద్ర రావు**

**కె.బి.సోమయాజులు**

**జి.సత్యవాణి**

**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 5 సంచిక 12**

**మార్చ్ 2005**

**తారణ : మాఘం - ఫాల్గుణం**

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**


## ఆదర్శ పథం

ఆదర్శం లేని జీవితం అంతం లేని తిరుగుడు. ఆ తిరుగుడుకు ఒక గమ్యమూ ఉండదు. ఒక దారీ ఉండదు. ఆ యాత్రికుడు స్పృహ కోల్పోయి ఉంటాడు. ఒళ్లు తెలియని స్థితిలో ఉంటాడు. అలాంటి జీవితం సరంగు లేని నావ. నిద్రలో మునిగిన సరంగు ఉన్న నావ. జీవన సాగరంలో తుపానులు ఎప్పుడూ వస్తూనే ఉంటాయన్నది అనుభవంలో ఉన్న విషయం. ఆదర్శం లోపిస్తే జీవిత నౌకకు మునిగిపోవడం తప్ప మరో దారి ఉండదు.

స్వామి వివేకానంద బోధన ఇది-"ఆదర్శాల శక్తి కంటికి కనబడదు. అయినా ఆ శక్తి సాటిలేనిది. నీటిబొట్టును చూస్తే దానిలో బలం ఉన్నట్లు కనిపించదు. కానీ, ఏదో ఒక రాతి పగులులో పడి మంచుగడ్డగా మారే అవకాశం దానికి వస్తే - అది ఆ రాతిని ముక్కలు చేస్తుంది. ఈ కొద్దిపాటి మార్పువల్ల నీటిబొట్టుకు ఏదో అయిపోతుంది. దానిలో దాగి ఉన్న బలం క్రియాశీలం అవుతుంది. మార్పు తెచ్చే బలం దానికి కలుగుతుంది. ఆదర్శాలు సరిగా ఈ పనే చేస్తాయి. ఆదర్శాలు ఆలోచనలుగా ఉన్నంతవరకు వాటి శక్తి ఫలితాలను సాధించదు. కానీ, ఆదర్శాలు ఒక వ్యక్తి వ్యక్తిత్వంలో, ఆచరణలో స్పష్టమైన రూపం ధరిస్తే - వాటి నుండి విరాట్ శక్తి ఉత్పన్నం అవుతుంది. వాటి నుండి మహత్తర ఫలితాలు జనిస్తాయి."

కారు చీకటి నుండి మహాసూర్యునివైపు ఉదయించాలనే ఆకాంక్ష - ఆదర్శం. ఈ ఆకాంక్ష మనిషిని వ్యాకులం చేయకపోతే, అతడిని విశ్రాంతిరహితుడుగా చేయకపోతే - అతడు ఎల్లకాలం కారుచీకటిలోనే ఉండిపోతాడు. కానీ-ఆదర్శం కేవలం ఆకాంక్ష మాత్రమే కాదని గుర్తుంచుకోవాలి. ఆదర్శం సాహసంతో నిండిన సంకల్పం కూడా. ఎందుకంటే - సాహస పూర్వకమైన సంకల్ప బలం లోపిస్తే, ఆదర్శం ఉన్నా ఒకటే, లేకున్నా ఒకటే. ఆ ఆదర్శం ఎల్లకాలం నిర్జీవంగా పడి ఉంటుంది. ప్రాణరహితంగా పడి ఉంటుంది.

సాహసవంతమైన సంకల్పంతో పాటు ఆదర్శం శ్రమతో కూడిన కఠోర తపోసాధన కూడా. ఎందుకంటే, నిర్విరామమైన శ్రమ-సాధన లోపిస్తే, ఏ విత్తనమూ ఎన్నడూ మహావృక్షం కాదు. ఆదర్శాల బాటలో పయనించిన మహనీయులంతా ఒకే ఒక నిర్ణయానికి వచ్చారు. ఆచరించే ప్రయత్నంతో కలియని ఆదర్శం నిరర్థకమైనది, ఆదర్శం నుండి ప్రేరణ పొందని ఆచరణ భయావహమైనది.

H H H

**జీవితానికి మూలస్తంభాలు - సాధన, స్వాధ్యాయం, సంయమనం, సేవ.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : సద్గురు సాక్షాత్కారం**

1. **సంపాదకీయం :**
   ఆదర్శ పథం 1
2. **విషయ సూచిక** 2
3. **వేద మంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం - 1:**
   సౌభాగ్య సూర్యోదయం 4
5. **ముఖచిత్ర కథనం - 2 :**
   గురుసత్తా సందేశం - సాధనామయ జీవనం 8
6. **మఖచిత్ర కథనం - 3 :**
   పరమపూజ్య గురుదేవులు - ఒక అవతార శక్తి
   అయిదు అభినవ సంస్థలకు జన్మదాత 11
7. **బోధ కథ :**
   నమ్రత ధర్మ లక్షణం 15
8. **దేవ సంస్కృతి సౌరభం :**
   వైదిక సాహిత్యంలో మానవ ధర్మ దర్శనం 17
9. **సాధు సంత్‌ల జీవితాలు :**
   క్రియాశీల అనుష్ఠాన వేదాంతి
   సద్గురు మహర్షి మలయాళస్వామి 19
10. **వ్యక్తి నిర్మాణం**
    లోపలి మనిషిలో మార్పు 24
11. **బోధ కథ :**
    మహిమల ప్రదర్శన తగదు 25
12. **సాధన విజ్ఞానం :**
    మనిషి నుదిటిలో మూడవ కన్ను 28
13. **ఆదిశక్తి గాయత్రి సాధన - 2 :**
    తొమ్మిది గుణాల వికాసమే గాయత్రీ సిద్ధి 30
14. **కృష్ణావతారం - 27 :**
    అసలు తీర్థం ఆత్మయే 34
15. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 14**
    సద్గురువు సాక్షాత్కరించిన సుముహూర్తం - 1 37
16. **నావారితో నా మాట :**
    **మహోద్యమం సాగిస్తున్న విరాట్ యాత్ర-3**
    స్వరాజ్య ఉద్యమం కన్న మహత్తర ఉద్యమం 41
17. **తత్వ చింతన :**
    భగవత్‌శక్తిలో ఇమిడి ఉన్నాయి రహస్యాలన్నీ 44
18. **వార్తలు :**
    కొత్తపేటలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం 48

## ముఖ్య గమనిక

1. యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాలు ప్రతి నెలా 15వ తేదీలోగా అందితే, చందాదారులకు ఆ నెల నుండి పత్రికలు పంపగలము. ఆతర్వాత పంపితే, మరుసటి నెలనుండి పత్రికలు పంపగలము.
2. పత్రికకు పంపే మనియార్డరు కౌంటర్ ఫాయిల్‌లో ఆ పైకం ఎందుకోసం పంపుతున్నదీ తప్పక వ్రాయాలి. పంపేవారు తమ చిరునామాను బ్లాక్ లెటర్స్‌లో స్పష్టంగా వ్రాయాలి.

## ఫిబ్రవరి, మార్చి నెలలలో పర్వదినాలు

ఫిబ్రవరి :

13. వసంత పంచమి.
15. రథ సప్తమి.
19. భీష్మ ఏకాదశి.

మార్చి :

8. మహాశివరాత్రి.
12. రామకృష్ణ పరమహంస జయంతి.
25. హోలీ.

### హైదరాబాద్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో

## గాయత్రీ పరివార్ సాహిత్య స్టాల్

**హైదరాబాదు నాంపల్లిలో నడుస్తున్న ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో గాయత్రీ పరివార్ సాహిత్య స్టాల్ జనవరి 6న ప్రారంభించబడింది. ఆ స్టాల్ ప్రయోజనాన్ని పొందవలసిందిగా సత్‌సాహిత్య అభిమానులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.**

**కర్తవ్యాన్ని మరచిన వ్యక్తి హక్కుల పోరాటానికి అనర్హుడు.**

# వేద మంత్రం

శ్రద్ధాం దేవా యజమానా వాయుగోపా ఉపాసతే ।
శ్రద్ధా హృదయ్య యాకూత్యా శ్రద్ధయా విందతే వసు ॥

-(ఋగేవ్వర 10/15/4)

**భావార్థం** : శ్రద్ధ హృదయ ఔన్నత్యానికి ప్రతీక. దీనితో మనుష్యుని ఆధ్యాత్మిక జీవనం సఫల మవుతుంది. అతడు ధనాన్ని పొంది సుఖిస్తాడు,.

**సందేశం** : శ్రద్ధ మన జీవితంలో అన్నింటి కంటే కోమలము, మధురము, సర్వ శ్రేష్ఠమైన అనుభూతి. జీవితంలో ఉన్నతికి మూడు సోపానాలు - శ్రద్ధ, విశ్వాసము, ప్రేమ. శ్రద్ధ వలన అన్నీ సంభవమే. విశ్వాసం వలన కఠిన కార్యాలు కూడా సరళమవుతాయి. ప్రేమ వలన అవి మరింత సరళమవుతాయి. జీవితంలో ఈ మూడు సద్గుణాలను ధరించి, ఆచరణను అభ్యసిస్తూ ఉంటే మార్గంలోని అన్ని కష్టాలు, విపత్తుల నుండి విముక్తమవుతాము. శ్రద్ధావంతుడైన వ్యక్తి ప్రతి పనిలో సఫలు డవుతాడు.

'శ్రద్ధా విశ్వాస రూపిణౌ' అని తులసీదాసు తన ఇష్టదేవతా ప్రార్థన చేసి, రామచరిత మానస్ వంటి గొప్ప ప్రజోపయోగకరమైన గ్రంథాన్ని వ్రాయుటలో సఫలమైనాడు. మీరాబాయి శ్రద్ధాబలంతోనే రాతిలో భగవంతుణ్ణి దర్శించి తనవంతు విషపానం ఆయనచేత చేయించింది. రామకృష్ణ పరమహంస తన శ్రద్ధచేతనే కాళీమాతతో నైవేద్యం తినిపించగలిగాడు. శ్రద్ధతో నిండిన మనుష్యుడు జీవితంలో ఏ పని చేసినా అది తప్పక సఫలమవుతుంది. శ్రద్ధ యొక్క తోడు మనుష్య జీవనంలో గొప్ప తోడు. తల్లి దండ్రులపట్ల, గురువు పట్ల శ్రద్ధ, ధర్మ సదాచారాల పట్ల శ్రద్ధ, తన పని పట్ల శ్రద్ధ జీవితంలో ప్రగతికి ముఖ్య ఆధారాలు. దీనితో మనుష్యుని ఆత్మవిశ్వాసం వికసిస్తుంది. సంకల్పం ధృఢమవుతుంది. సోమరితనం, నిర్లక్ష్యం పారిపోతాయి. సంపూర్ణ మనోయోగంతో సంకల్ప పూర్తికి మార్గం సుగమమవుతుంది. దాని ముందు బలం, సంపదల దంభం ముక్కలు ముక్కలైపోతుంది. ఎంత విపత్తు వచ్చినా ఎన్ని విషమ పరిస్థితులు ఎదురైనా ఏ విధమైన బాధా కలుగదు.

శ్రద్ధా విశ్వాసముల సంయోగం వలన మనస్సులో ప్రసన్నత కలుగుతుంది. ప్రసన్న హృదయుడైన మనుష్యుడు, అనేక మంది హృదయాలలో తన కిరణాలను ప్రసరించి శోకరూపమైన అంధకారాన్ని పారద్రోలి, వారిని ప్రసన్నుల్ని చేసే సూర్యుని వంటివా డవుతాడు. ప్రసన్నత అనేది గంధం వంటిది, ఇతరుల నుదుట పూయండి, మీ చేతి వ్రేళ్ళు కూడా పరిమళిస్తాయి.

మనం నిరంతరం మన హృదయంలో శ్రద్ధాజ్యోతిని వెలిగించుకోవాలి. శ్రద్ధాజ్యోతి వెలిగించకుండా మనము ఏ కార్యాన్నీ పూర్తి చేయలేము. మన జీవితంలో శ్రద్ధ ఓత ప్రోతమగుగాక! మనం ఏ పనీ శ్రద్ధారహితులమై చేయకుందుము గాక ! ప్రతి పనినీ శ్రద్ధతో మాత్రమే చేసెదముగాక! సంధ్య - పూజ శ్రద్ధతో చేయండి. మన జీవితంలో ప్రతి సమయం, ప్రతి క్షణం, ప్రతి నిముషం, 24 గంటలూ శ్రద్ధాదేవి రాజ్యమేలుగాక.

శ్రద్ధాళువగుట వలన ధనము, బలము, విద్య, యశస్సు అన్నీ దొరుకుతాయి. ప్రతి పనిలో సఫలత, ఐశ్వర్యం లభిస్తాయి. మనం ఎన్నడూ శ్రద్ధ కొంగు వదలిపెట్టకూడదు. కానీ అంధవిశ్వాసం, అంధ శ్రద్ధల నుండి ఎల్లప్పుడూ కాపాడుకొందాము. మన వివేక బుద్ధితో ఉచితానుచితముల నిర్ణయం చేసి, ఉచిత మనుకొన్నదానినే శ్రద్ధాపూర్వకంగా అనుసరిద్దాం. ఆలోచించకుండా ఇతరులను చూచి అనుకరించుట అంధ విశ్వాసమని అంటారు. అది హానికరం కావచ్చు.

శ్రద్ధతోటే ఆత్మబలం పెరుగుతుంది. HHH

**అంతరంగంలోని నారాయణుణ్ణి కళ్లతో చూడలేము.**

## ముఖచిత్ర కథనం -1
# సౌభాగ్య సూర్యోదయం

**పరమపూజ్య గురుదేవులు మార్గదర్శక గురువులు తమకు సాక్షాత్కరించిన సంఘటనను సౌభాగ్య సూర్యోదయంగా వర్ణించారు. వారి 'ఆత్మకథ'లోని ఆ సంఘటనను దిగువ ఇస్తున్నాం.**

1989లో నాకు 78 సంవత్సరాలు పూర్తయినవి. ఈ సుదీర్ఘ జీవన యాత్రలో నా లక్ష్యం ఒకే ఒకటి : సాధన ద్వారా సిద్ధిని సాధించడం ఎలాగో పరిశోధించడం. పలువురు శాస్త్రవేత్తలు మౌలిక పరిశోధనకు తమ యావజ్జీవితాలను అంకితం చేశారు. ఆ విధంగా వారు మానవాళికి సేవ చేశారు. ఆ విధంగానే - సాధన సిద్ధికి దారితీస్తుందనే ప్రాచీన విశ్వాసం నిజమా కాదా అని క్షుణ్ణంగా పరిశీలించాలనీ, ఈ ప్రయోగాన్ని ఇతరులపై కాక నాపైననే జరపాలనీ నాకు అనిపించింది. పది సంవత్సరాల వయస్సులో ఈ అభిప్రాయం నాలో అంకురించింది. నాకు 15 సంవత్సరాలు వచ్చేసరికి అది నా ఆలోచనలను పూర్తిగా ప్రభావితం చేసింది.

ఈ కాలంలో జరిగిన సంఘటనలలో ముఖ్యమైనది మా నాన్నగారు తన సహాధ్యాయులైన మాననీయ శ్రీమాలవ్యాగారి ద్వారా నాకు ఉపనయన సంస్కారము జరిపించుట. దీనినే "గాయత్రీ దీక్ష" అని అంటారు. మా ఊరిలోనే ఉన్న బడిలో ప్రాథమిక విద్యను అభ్యసించాను. మా నాన్నగారే నాకు లఘుకౌముది, సిద్ధాంతకౌముది ఆధారంగా సంస్కృత వ్యాకరణము నేర్పారు. ఆయన రాజులు మహారాజుల వద్ద శ్రీ మద్భాగవతము చెబుతూ, ఆయనతో పాటు నేను కూడా వెళ్లుట వలన భాగవత కథలు నాకు బాగుగా కంఠస్థమైనవి. ఆ మధ్యకాలంలోనే నాకు వివాహమైంది. భార్య క్రమశిక్షణ, శ్రమించే గుణం, సేవా భావం కలిగినది. ఆమె నేను తీసుకున్న నిర్ణయాలకు సాయము చేస్తూ ఉండేది.

సంధ్యావందనము నా నియమిత కార్యక్రమము. శ్రీమదనమోహన మాలవ్యాగారు గాయత్రీ మంత్రదీక్ష నిస్తూ అది బ్రాహ్మణులకు కామధేనువు వంటిది అని అన్నారు. ప్రతి నిత్యమూ మానకుండా జపము చేసుకొనమని చెప్పినారు. కనీసము అయిదుమాలలు (అనగా అయిదువందలసార్లు జపించుట) ఆ తర్వాత ఎంత ఎక్కువ చేసిన అంత మంచిదని చెప్పినారు. ఈ ఆదేశమును నేను తు.చ తప్పకుండా పాటించాను.

నా పదిహేనవ ఏట దైవానుగ్రహం నాపై కురిసింది. ముందుగా పథకం వేసుకున్నట్లు, ముందే నిర్ణయం అయిపోయినట్లు జరిగింది ఆ సంఘటన.

ఆ రోజు వసంత పంచమి. బ్రాహ్మీ ముహూర్తంలో నా గది కెదురుగుండా ఒక ప్రకాశపుంజము సాక్షాత్కరించినది. భ్రమ ఏమో అని కళ్లు నులుముకుని మరల చూచాను. భ్రమ కాదని, నిజమేనని ధ్రువీకరించుకున్నాను. సంభ్రమాశ్చర్యములతో చూచుకున్నాను. క్రమక్రమంగా ఆ తేజోవలయం నుంచి ఒక యోగి సూక్ష్మ శరీరము బహిర్గతమైంది. ఆ సూక్ష్మ శరీరం ఆకాశంలోనూ భూమిపైన తేలియాడుచున్నది.

ఆ సూక్ష్మశరీరము నుండి కొన్ని మాటలు క్రింది విధముగా వినపడినవి :

"అనేక జన్మల నుండి మనము కలిసియే ఉన్నాము. నేను నీకు మార్గదర్శనము చేయుచునే యున్నాను. నీకు యుక్త వయసు వచ్చినది కనుక అవసరమైన మార్గము తెలుపుటకు వచ్చినాను. నీకు నీ పూర్వజన్మల స్మృతి లేదు కావున కొంత ఆశ్చర్యము, సంభ్రమము కలుగవచ్చును. ఇప్పుడు నీవు నీ పూర్వజన్మల వివరములు తెలుసుకొని నీ సందేహములను నివారించుకొనుము."

**నిండు మనసుతో ప్రయత్నించకపోవడం వైఫల్యానికి మూల కారణం.**

గురుదేవుల అనుగ్రహము వలన యోగ నిద్రను పొందినాను. జాగ్రదవస్థలో సమాధి ఎలా ఉంటుందో ఈ జీవితంలో అనుభూతి కలిగింది. నా క్రిందటి మూడు జన్మల వృత్తాంతము నా కన్నుల ముందు క్రమంగా ఒకదాని తర్వాత మరియొకటి వాస్తవంగా తిరిగి జరుగుచున్నట్లు గోచరించింది. ఆ మూడు జన్మలు మూడు సినిమారీళ్ల వలె నా మనోనేత్రము ముందు దర్శనమిచ్చేయి.

ఈ రోజున, నా 15వ యేట జరిగిన సంఘటన గుర్తుకు వస్తే ఆ రోజు నా మనస్సులో ఉత్పన్నమైన అనేక ప్రశ్నలు గుర్తుకు వస్తున్నాయి. అనేకమంది జిజ్ఞాసువులు గురువు కొరకు ఎక్కడెక్కడో వెతుకుతూ, వారినీ, వీరినీ అడుగుతూ ఉంటారు. ఎవరినైనా దర్శనము చేసికొనగలిగినచో తమ అదృష్టమునకు తామే మురిసిపోతూ ఉంటారు. ఏదైనా కోరిక ఉంటే దానిని నెరవేర్చమని కోరుకుంటారు. కానీ నాకు జరిగినది వీటికి అతీతముగా ఉన్నది. మా నాన్నగారు నా ఎనిమిదవ యేటనే మాలవ్యాగారి ద్వారా గాయత్రీ మంత్రదీక్ష ఇచ్చినారు. దీనినే ప్రాణదీక్ష అని అన్నారు. అందుచేత వేరొక గురువును వెతకవలసిన అవసరం నాకు కలుగలేదు. అందువలన ఏ ప్రయత్నము లేకుండా సద్గురు దర్శన కృప నాకు ఎలా లభ్యమైనది?

శిష్యులు గురువును వెతుకుతూ ఉంటారు. గురువు అనుగ్రహం వలన ఎప్పుడైనా అతని దర్శనమైతే తమ జీవితమే ధన్యమైనదని భావిస్తారు. గురువు నుండి ఏదో పొందాలని ఆకాంక్షిస్తూ ఉంటారు. అలాంటపుడు అప్రయత్నంగా ఇటువంటి సిద్ధపురుషుని అనుగ్రహం నాకు ఎలా లభ్యమైనది! కాకున్నచో ఇది కల్పనయో! లేక భూత ప్రేత పిశాచముల కలయికయేమో ? లేక ఏదైనా వంచనలో ఉన్నానేమో ? భావావేశమో ! ఇలాంటి సందేహ సందోహాలు నా మనస్సులో మెదిలినవి.

నా ఈ అనిశ్చిత స్థితిని గ్రహించి ఆయన కోపగించుకోలేదు. అంతేకాక, పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకొని అన్ని విధాలా ఆలోచించి నిర్ణయానికి వచ్చే నా లక్షణాన్ని అభినందించారు కూడా. ఇది ప్రసన్నమైన వారి ముఖంలో స్పష్టముగా కనపడినది. ప్రశ్న జవాబు రూపంలో కాలయాపన చేయుట కంటే తన పరిచయం, తన ఆగమనమునకు గల కారణము, నా పూర్వజన్మల స్మృతి ఇచ్చి, ఈ జన్మలో నన్ను ఒక విశిష్ట ప్రయోజనము కొరకు ఎందుకెన్నుకున్నారో తెలుపుటయే మంచిదనుకున్నారు కాబోలు.

నా పూజాగృహంలో ప్రత్యక్షమైన తేజోవలయంలో ఉన్న గురుదేవులు ఇలా అన్నారు:

"నీవు ఆలోచించే విధానము సవ్యమైనదే. దివ్యాత్మలు ఎవరితోనైనా సంబంధము పెట్టుకునే ముందు వాళ్లను జాగ్రత్తగా పరీక్షించెదరు, తమ శక్తి, కాలము ఇంకొకరికి వెచ్చించేముందు ఆ వ్యక్తిని పూర్తిగా పరీక్షించెదరు. అంతే కాని ఎవరి ముందు పడితే వారి ముందు ప్రత్యక్షమగుట, వారి కోర్కెలను తీర్చుట వారి ఉద్దేశ్యము కాదు. పాత్రతను గుర్తించకుండా ఎవరితోనూ సంబంధం పెట్టుకోరు.

"మహాత్ములతో, ఆధ్యాత్మికతతో ప్రకాశించే మహనీయులతో సంబంధం ఏర్పరచుకుంటే ప్రయోజనం కలుగుతుందని పలువురు భావించెదరు. కాని, పనికిమాలిన వ్యక్తి గురించి తన శక్తి సామర్థ్యాలను వృధా చేయడానికి ఎవరూ ఇష్టపడరనే విషయాన్ని వారు విస్మరించెదరు.

"మేము మా సూక్ష్మ దృష్టితో దేశకాల పరిస్థితులను బట్టి లోక కళ్యాణ నిమిత్తం భౌతిక జగత్తులో పనిచేయగలిగే వ్యక్తులను వెతుకుతూ ఉంటాము. మేము సూక్ష్మ శరీరధారులము కనుక సూక్ష్మ శరీరముతో స్థూల జగత్తులో పనిచేయలేము. అందువల్లనే స్థూల శరీరము ధరించిన వ్యక్తిని శస్త్రము వలె ఉపయోగించెదము. ఇది చాలా కష్టకాలము. మానవాళి సంపూర్ణముగా నష్టపోయే పరిస్థితులు ఎక్కువగా ఉన్నవి. వాటిని నివారించుటకు నీ ద్వారా ప్రయత్నము చేయదలచాము. నీలో ఉన్న లోటుపాట్లను దూరముచేసి నీకు మార్గము చూపిస్తాను. అందుకోసమే నేను నీ కొరకు

**అహంకారం, తొందరపాటు హాని కారకాలు.**

వచ్చాను. ఇంతవరకు నీకు సామాన్య జీవితముతోనే పరిచయము ఉన్నది. నిన్ను నీవు ఒక సాధారణ వ్యక్తిగానే భావించుకునేవాడివి. ఈ రోజుల్లో ఎవరూ ఎవరినీ ఒక్కసారిగా నమ్మరు. అందువల్ల నీ యోగ్యతను ఎంత వర్ణించినా నీ సందేహ నివారణ కాదు. అందుకే నీకు గత జన్మలు చూపించవలసి వచ్చినది."

గతజన్మల వృత్తాంతము పుట్టుక నుండి మృతి నొందువరకు చూచిన తర్వాత ఆ జన్మలలో ఆయన నాకు ఏవిధంగా మార్గదర్శకులుగా ఉన్నారో అర్థమైంది.

ఆ తరువాత ఇలా అన్నారు:

"ఈ జన్మలో కూడా నేను నీకు సహాయకునిగా ఉంటాను. నీ శరీరముతో ఈ కాలమునకు కావలసిన పని చేయిస్తాను. సూక్ష్మ శరీరధారులు ప్రత్యక్షముగా ప్రజలతో సంబంధం ఏర్పరచుకొనలేరు. అది స్థూల శరీరధారులకే సాధ్యము. అందువలన యోగులకు వాళ్ల సాయము చాలా అవసరము. నీకు వివాహము అగుట చాలా మంచిదే అయినది. ఈ కాలములో ఒంటరిగా ఉంటే లాభము తక్కువ, కష్టము లెక్కువ. ప్రాచీన కాలంలో బ్రహ్మ, విష్ణుమూర్తి, శివుడు, గణపతి, ఇంద్రుడు, సూర్యుడు - అందరూ వివాహితులే. సప్తఋషులు వివాహితులే కదా! గురుకులములో తండ్రి ప్రేమ, తల్లి ప్రేమ శిష్యులకు లభించాలి. అన్న వస్త్రములు, నివాస స్థలము, ప్రేమను పంచుట తల్లినుండియు, క్రమశిక్షణ, అధ్యయనము, అనుగ్రహము తండ్రినుండియు లభించును. ఋషి సంప్రదాయం ప్రకారము గురువు తండ్రి పాత్రను, గురుపత్ని తల్లి పాత్రనూ పోషిస్తారు. ఈనాడు సోమరులు, కపటులు అయిన వ్యక్తులు మత బోధకులుగా, సాధువులుగా నటిస్తూ ప్రజలను పెడత్రోవ పట్టిస్తున్నారు. నీవు వివాహితుడవు కావడం నాకు సంతోషం కలిగిస్తున్నది. నీ గత మూడు జన్మలలో రెండింటిలో నీవు గృహస్థువు. గృహస్థ జీవితం నీ పనికి ఆటంకమని నీవు భావించవచ్చు. వాస్తవానికి, ప్రస్తుత పరిస్థితులలో అది సహాయకారి అవుతుంది. మానవ జాతి చరిత్రలో ఒక కొత్త శకాన్ని ప్రారంభించే మహత్తర కార్యంలో మరిన్ని ఫలితాలను సాధించడానికి అది దోహదం చేస్తుంది."

అది వసంత పర్వపు పవిత్ర దినము. బ్రాహ్మీముహూర్తకాలము. రోజూ లాగానే సంధ్యావందన నియమము పాటించునపుడు ప్రకాశపుంజ రూపములో దివ్యాత్మ దర్శనము. ఒక దాని తరువాత ఒకటి మూడు జన్మలు చూచాను. ఆ మూడు జన్మలలో తీవ్ర సాధన చేసి ప్రతి నిమిషము నవ సమాజ నిర్మాణానికే వెచ్చించాను. ప్రతి జన్మలోను అవసరమైనపుడు ఈనాడు ప్రత్యక్షమైన దివ్యాత్మ మార్గదర్శనము నాకు లభిస్తూనే ఉన్నది. అందువలన మొదట అపరిచితుడుగా ఉన్న ఆ వ్యక్తితో అత్యంత సన్నిహిత సంబంధము, ప్రేమ ఏర్పడినవి. ప్రతి సంఘటనలోను ఆయన నా మీద కురిపించిన అనుగ్రహము, అందుకు నా కృతజ్ఞత నాకు స్పష్టముగా కనపడినది. ఈ స్థితిలో నా మనస్సు పూర్తిగా మారిపోయినది. నిన్నటివరకు ఏ కుటుంబాన్ని అయితే నాది అనుకున్నానో వారందరూ పరాయివాళ్లనీ, నాముందు ప్రత్యక్షమైన ఈ ప్రకాశ పుంజము నిర్దేశానుసారమే నాకు మిగిలిన జీవితమంతా జరుగుతుందనీ అర్థమైనది. నా వైపు నుండి నేను ఏమీ కోరను. ఆ చైతన్య పురుషుడు ఏ ఆజ్ఞనిస్తాడో, దానిని ప్రాణమిచ్చియైనా సరే చేసి తీరాలని నిర్ణయించుకున్నాను. దీనినే సమర్పణ అంటారు. ఆ రోజు నా మార్గదర్శకునికి నే చేసిన సమర్పణ 63 సంవత్సరములు పూర్తి అయిన ఈ రోజుకు కూడా అటులనే ఉన్నది. తర్కించకుండా, ఔను కాదు అని అనకుండా ఒకే మార్గంలో పయనిస్తూ వచ్చాను. అది సంభవమా, కాదా, నేను ఆ పనిని చేయగలనా లేనా, దీని పరిణామాలు ఎలా ఉంటాయి ? అనే ప్రశ్నలు ఈ రోజు వరకూ కూడ నా మనస్సులోనికి రానీయలేదు.

ఆ రోజున నేను ఇంకొక రహస్యము తెలుసుకున్నాను. సిద్ధపురుషుల అనుగ్రహము లోక కళ్యాణార్థము,

**ధర్మనిష్ఠ, ఆదర్శ జీవనం ఉదాత్త ఆశయాలు.**

సత్ప్రవృత్తుల అభివృద్ధి కొరకు మాత్రమే లభిస్తుంది. వాళ్లకు ఆత్మీయులు లేరు. విరోధులునూ లేరు. ఒకే ఒక వ్యక్తికి కీర్తి సంపదలు ఇవ్వడానికి వారి అనుగ్రహము ఉపయోగించరు. సంపూర్ణ విశ్వమానవోన్నతి కొరకు మాత్రమే వాళ్ల ప్రయత్నాలన్నీ ఉంటాయి. వారు స్వజనులు అనే వారిని విశ్వ కళ్యాణార్థమే ఉపయోగించుకుంటారు. రామకృష్ణ - వివేకానందులు, సమర్థరామదాస్ - శివాజీ, చాణక్య - చంద్రగుప్త మున్నగు గురుశిష్యుల సంబంధాలన్నీ ఈ సత్యాన్నే ఋజువు చేస్తున్నాయి. ఎచటనైతే చమత్కారము చూపించుట, నేర్పుట జరుగుతూ ఉంటాయో అచట నిజమైన గురుశిష్య సంబంధము ఉండదు. అతినిమ్నస్థితిలో ఉన్న ఎవరికీ పనికిరాని ఆటలాగే దానిని తీసుకొనవలెను.

గంధబాబా అనే ఆయన ఏ పూవు వాసన కావాలంటే దానిని తెప్పించేవాడు. సిద్ధబాబా వచ్చిన వారి కోర్కెలను తీర్చేవాడు. బాగ్ బాబా పెద్దపులిని తన కుటీరానికి పిలిచేవారు. సమాధిబాబా అనే ఆయన అనేక రోజులు భూమిలో స్థాపితమై ఉండేవారు. ఈ చమత్కారములన్నిటి లోపల పెద్ద విశేషాలేమీ లేవు. మౌనముగా ఉండుట, ఒక చేయి పైకి ఎల్లపుడూ ఎత్తి ఉంచుట, చేతిలో పెట్టుకొని భోజనము చేయుట, ముళ్లకంపలమీద నిద్రించుటవంటి అనేక ఆశ్చర్యము కలిగించు పనులు గారడీ కంటే ఎక్కువ కావు. నిజమైన సిద్ధపురుషుడు - శిష్యుడు ప్రాచీన ఋషిసంప్రదాయము ప్రకారము లోకకళ్యాణార్థము మాత్రమే తమ జీవితాలను ధారపోస్తారు. రామకృష్ణ పరమహంస, వివేకానంద, దయానంద, కబీర్, చైతన్య మహాప్రభువు, సమర్థరామదాస్ వీరందరూ ఆ ఋషి సంప్రదాయములను అనుసరించిన వారే. భగవంతుడు తన పేరును జపము చేస్తేనే ప్రసన్నుడు కాడు. ఆయనకు కోరికతో చేసే పూజలు అవసరము లేదు. భగవంతుడు సృష్టించిన ఈ విశ్వోద్యానవనములో గల ముళ్లను పీకివేసి పూలను వికసింపజేసే ప్రయత్నాలు చేయగలిగిన వారి జపమే సార్థకమైనది. ఆ వసంత పర్వదినము నాడు ఈ విధమైన ఆలోచనలే నాలో చెలరేగుచున్నవి. ఎందుకంటే ఆయన స్పష్టంగా చెప్పినారు. 'నీ పాత్రతను అభివృద్ధి చేసుకొనుటయే కాక, లోక కళ్యాణకరమైన పనులు చేయాలి - అంటూ 24 సంవత్సరముల ఉపాసనా పద్ధతిని వివరించారు. గాయత్రీ పునశ్చరణ పద్ధతిని తెలిపినారు. పాటించవలసిన నియమాలను కూడా వివరించారు. అంతేకాక స్వాతంత్ర్య సమరములో ఆదర్శ స్వయంసేవకునిగా పనిచేయమని ఆదేశించారు.

ఆరోజు ఆయన నా సంపూర్ణ జీవన క్రమాన్ని నిర్ధారించుటయే కాక కళ్లెములు తన చేతిలో పట్టుకొని ప్రతి ప్రయత్నము సఫలము కావించారు.

ఆ రోజే నేను నన్ను మనస్ఫూర్తిగా ఆయనకు సమర్పణ గావించుకున్నాను. "నేను దేవుని చూడలేదు. కానీ పరమాత్మ చేసే మంగళకరరమైన మార్పు నా జీవితములో మీరు తీసుకొని వచ్చారు. నాకు మీరే దైవము. నేను నా శక్తి, నా ఆస్తి అంతయు మీకు సమర్పించుకున్నాను. ఈ రోజు నుండి నా జీవిత విధానము మీరు నిర్ణయించిన మార్గాన్నే తు.చ తప్పకుండా పాటిస్తుంది - అని నా అంతరాత్మ మౌనంగా ప్రతిజ్ఞ చేసింది.

అదే రోజున ఆయన నా భావి జీవితాన్ని సూత్రప్రాయముగా తెల్పినారు.

1. 24 సంవత్సరములలో గాయత్రీ మహాశక్తి యొక్క 24 మహా పునశ్చరణలు పూర్తి చేయుట.
2. ఆవునేతితో అఖండ దీపస్థాపన.
3. నా జీవిత కాలములో క్రమబద్ధమైన సూచనలు ఇవ్వడానికి 6 నెలలు నుండి ఒక సంవత్సర కాలము పాటు నాలుగుసార్లు హిమాలయాలలో తన వద్ద ఉంచుకొనుట.

ఇంకా ఆయన విస్తృతమైన వివరణ ఇచ్చినా, పాఠకులకు పైన చెప్పిన విషయములు చాలు. గురుదేవులు నిర్దేశించిన ప్రతి పనిని సక్రమంగా నిర్వర్తిస్తూ వచ్చాను.

H H H

**నమ్రంగా సత్యాన్ని అన్వేషించు.**

## ముఖచిత్ర కథనం -2

# గురుసత్తా సందేశం - సాధనామయ జీవనం

అవతార చేతన స్థాయి కలిగిన మహాపురుషులు ఒక ప్రత్యేక లక్ష్యంతో భూమిమీద అవతరిస్తూ ఉంటారు. అలా దిగివచ్చినప్పుడల్లా వారు ఎందరెందరో వ్యక్తుల జీవితాలలో వెలుగులు నింపుతారు. వారి సాన్నిధ్యాన్ని పొందిన వ్యక్తులు వారి బహుముఖ ప్రజ్ఞను గుర్తిస్తారు. ఆ ప్రజ్ఞలో ఏ కొంచెం తమ జీవితాలలోనికి తెచ్చుకున్నా ఆ వ్యక్తులు ధన్యులు అవుతారు.

### వశిష్ఠ, విశ్వామిత్రుల స్థాయి

పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ చూడడానికి మామూలు వ్యక్తిగా కనిపిస్తారు. సాదాగా కనిపిస్తారు. ఆయన జీవితమంతా ఖద్దరు పంచ, లాల్చీ ధరించారు. పారదర్శకమైన జీవితం గడిపారు. బ్రాహ్మణత్వం మూర్తీభవించిన జీవితం గడిపారు. తపస్వి జీవితం ఎలా గడపాలో జీవించి చూపారు. భగవానుని కృపకు పాత్రుడై వ్యక్తి ఎలా మహాపురుషుడు అవుతాడో జీవించి చూపారు. గాయత్రీ మంత్ర సిద్ధి పొందిన మహావ్యక్తి ఆయన. ఆయన కణకణంలో గాయత్రీ మహాశక్తి నివసించేది. ఆయన సిద్ధులకు స్రోతస్సు, జన్మ స్థలం ఆ మహాశక్తియే. గాయత్రీ మహాశక్తి ఆయనను కాకతాళీయంగా స్వీకరించలేదు. హంస వృత్తి ఆయన జీవితంలోకి రావడం వల్ల ఆయనను స్వీకరించింది. ఆయన విశిష్టమైన తపోసాధన చేశారు. జీవితంలో కఠోరమైన సంయమనాన్ని పాటించి చూపారు. నేటి యుగంలో సైతం విశ్వామిత్ర - వశిష్ఠుల స్థాయి సాధన సాధ్యపడుతుందని ఋజువు చేశారు.

### 3,000 గ్రంథాలు, 5,000 క్యాసెట్లు, 4,000 పీఠాలు.

లక్షలాది వ్యక్తుల జీవితాలలో ఆయన సృజనాత్మకమైన మలుపు తెచ్చారు. 1990 జూన్ 2న మహాప్రయాణం తర్వాతకూడా ఆయన వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత స్థాయిలో ప్రేరణ ఇస్తూనే ఉన్నారు. 3000 గ్రంథాలు రచించారు. 5000లకు పైగా క్యాసెట్‌లలో ఉన్న ప్రవచనాల ద్వారా తమ అమృతవాణి వినిపించారు. 4000ల పీఠాలు నిర్మించారు.

### ఆయన సందేశం జీవన సాధన

ఆయన సందేశం ఎంతో సరళమైనది. మీరు మీ జీవితాలను సాధనామయం చేయండి. అధ్యాత్మవాదులు భౌతికతను అవలంబించాలి, భావాత్మక దృక్పథాన్ని అలవరచుకోవాలి.

### మేధావుల పరివార నిర్మాణం

తమ జీవితంలోని చివరి 20 సంవత్సరాలలో ఆయన "21వ శతాబ్దం - ఉజ్వల భవిష్యత్తు" అనే సింహ గర్జన చేశారు. వ్యక్తి వ్యక్తిలో ఉల్లాసాన్ని నింపారు. ఆయన ఇలా చెప్పేవారు - 21వ శతాబ్దం అంటే సిద్ధాంతవాదం, ఆదర్శవాదం, మానవీయ గుణాల వికాసం జరిగే శతాబ్దం.

### మహావ్యవస్థ నిర్మాణం

1971లో ఒక విరాట్ ప్రజా సమూహం నుండి వీడ్కోలు తీసుకుని, ఆయన మథుర నుండి హిమాలయాలకు, ఆతర్వాత హరిద్వార్‌కు వచ్చారు. అక్కడ ఆయన ఒక వ్యవస్థను నిర్మాణం చేశారు. అది సాధనా ప్రధానమైన వ్యవస్థ. వైజ్ఞానిక అధ్యాత్మవాదాన్ని నిరూపణ చేసే వ్యవస్థ. 21వ శతాబ్దం కోసం కార్యకర్తలను నిర్మాణంచేసే వ్యవస్థ.

**అత్యాశ దుఃఖానికీ, పతనానికీ హేతువు.**

సమాజశాస్త్ర నిపుణులు, ఫ్యూచరాలజిస్టులు, భవిష్యవేత్తలు, పర్యావరణవేత్తలు నేడు చర్చిస్తున్న సమస్యలను ఆయన ఎంతో ముందుగానే, 1967 నుండే, "అఖండ జ్యోతి'' పత్రికలో చర్చించడం ప్రారంభించారు. అంకెలతో కూడిన వివరణ, ప్రకృతి ప్రకోపాల అవకాశం, వాటిని ఎదుర్కొనే విధానం - ఇవన్నీ ఆ పత్రికలో ఆయన వ్రాసిన వ్యాసాలలో ఉండేవి. ఈ వ్యాసాల ద్వారా ఆయన ఒక మేధావుల పరివారాన్ని నిర్మాణం చేశారు. "అఖండ జ్యోతి'' పత్రిక అందకపోతే వారికి తోచేది కాదు.

గత 15 సంవత్సరాలలో ఈ పరివారం మరింతగా విస్తరించింది. ప్రపంచ స్థాయిలో ఈ సమస్యలపట్ల అవగాహన పెంచడంలో, వీటికి పరిష్కారాలను వెదకడంలో, వీటిపై పరిశోధన జరపడంలో అది నిమగ్నమై ఉంది.

## మనిషిలో దేవత్వం, భువిపై దివి

కృతయుగం వస్తుందనీ, భారత్ నుండే అది ప్రారంభం కావడం తథ్యమని ఒక సంత్ ఖచ్చితంగా ప్రకటించడం బహుశా ఇదే ప్రథమం. ఆయన వైజ్ఞానిక ప్రాతిపదికపై కృతయుగాన్ని వ్యాఖ్యానించారు. సమాజంలో సత్పురుషుల సంఖ్య పెరుగుతుంది. వారిలో దేవత్వపు అంశ పెరుగుతుంది. వారు దూరదృష్టి కలవారు అవుతారు. దూరదర్శి అయిన వ్యక్తి నిజాయితీపరుడుగా, వివేకశీలిగా, బాధ్యతాయుతుడుగా, శూరుడుగా ఉంటాడు. సమాజంలో దేవత్వం సమృద్ధిగా కలిగిన వ్యక్తుల సంఖ్య పెరిగితే, భూలోకంపై స్వర్గతుల్య వాతావరణం రావడానికి ఎంతో సమయం పట్టదు.

## మన యువశక్తి ఒక సంపద

నేడు మన దేశ జనాభా సుమారు 102 కోట్లు. ప్రవాస భారతీయులు సుమారు 5.5-6 కోట్లమంది ఉన్నారు. వీరంతా ప్రగతి పథంలో పురోగమిస్తున్నారు. వీరిలో సుమారు 60శాతం యువతరం వారు. మరే జాతిలోనూ ఇంత హెచ్చు శాతంలో యువతరం లేదు. వీరంతా మెలకువలో జాతికి వెలుగు బాట నిర్మించడానికి నడుం బిగిస్తున్నారు. ఇది ఒక ఆశాకిరణం. పెరిగిన మన జనసంఖ్య, వారి సాంకేతిక పరిజ్ఞానం ఒక విశిష్ట సంపదగా రూపొందింది.

## జనాభా తరుగుదలపై గురుదేవుల అంచనా

2005 సంవత్సరం రాగానే మన జనసంఖ్య తనకు తానుగా తగ్గడం ప్రారంభం అవుతుందనీ, 2020 సంవత్సరం రాగానే మన వనరులకు అనుగుణమైన స్థాయిలో స్థిరపడుతుందనీ పరమపూజ్య గురుదేవులు చెప్పారు.

1980లో ఆయన చెప్పిన ఈ మాట ఆనాడు నిరాధారం అనిపించింది. కానీ, ఇప్పుడలా అనిపించడం లేదు. నేటి సమస్య అధిక జనాభా కాదనీ, భవిష్యత్తులో జనాభా తరగడం అనీ అంతర్జాతీయ పత్రిక "న్యూస్‌వీక్'' 2004 సెప్టెంబరు 27 సంచిక చెపుతోంది. జననాల రేటు తగ్గడం వల్ల ఈ సమస్య ఏర్పడింది. పాకిస్తాన్, ఇరాన్, మధ్య ఆఫ్రికా, ఇండోనేషియా దేశాలు మినహా- ప్రపంచ దేశాలలో జననాల రేటు ఇక వేగంగా తగ్గిపోతుంది. ఫెర్టిలిటీ రేటు తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది. బహుశా 2020 నాటికి సంతులనం స్థిరపడుతుంది. ఈ పరిమిత జనసంఖ్యతో ప్రపంచ ప్రజలు సుఖంగా జీవిస్తారని శాస్త్రవేత్తలు చెపుతున్నారు.

భవిష్యవిజ్ఞానవేత్తలు అంచనా వేయలేని విషయాన్ని ద్రష్ట, మనీషి అయిన పూజ్యవరులు 25 సంవత్సరాల పూర్వమే పేర్కొన్నారు.

## సంవేదనల మార్పుద్వారా కృతయుగం

విజ్ఞాన వికాసానికి ఆధారం సంవేదన అనీ, హృదయ స్పందన అనీ పరమపూజ్య గురుదేవులు భావించారు. మేము ప్రజల భావ సంవేదనలను, విశ్వాసాలను, అంతఃకరణలను మార్చగలుగుతామని ఆయన చెప్పారు. కమ్యూనిస్టులవలె

**పిల్లలకు నేర్పేవాటిని పెద్దలు ఆచరిస్తే, దివి భువికి దిగివస్తుంది.**

మనం బ్రెయిన్ - వాషింగ్ (మేధో క్షాళనం) జరపం. నేటి మనస్తత్వ శాస్త్రం రేపు మారుతుంది. అధ్యాత్మ దాని స్థానాన్ని ఆక్రమిస్తుంది. మౌలికంగా పశు ప్రవృత్తులకు ప్రాధాన్యం ఇచ్చేది పశు మనస్తత్వశాస్త్రం అవుతుంది. మనిషిలో దేవత్వ వికాసం, సంవేదనలను మేలుకొలపడం ద్వారా కృతయుగ నిర్మాణం జరుపుతుంది అధ్యాత్మ. అది పరివర్తనను తెచ్చితీరుతుంది.

పూజ్యవరులు 1989లో వివిధ సమయాలలో చేసిన సంకేతాలు ఇప్పుడు వాస్తవాలు అవుతున్నాయి. ఆయన అప్పుడు క్రాంతిధర్మి సాహిత్యాన్ని రచిస్తున్నారు. ఆయన అప్పుడు సుమారు 30 గ్రంథాలు వ్రాశారు. వాటిలో 20 గ్రంథాలు మహత్తరమైనవని ఆయన భావించారు. పరివర్తన్ కీ మహాన్ క్షణ్, సత్‌యుగ కీ వాపసీ, ఇక్కీసవీ సద్ ఉజ్జ్వల భవిష్య మున్నగు శీర్షికలతో ప్రచురించబడిన ఆ 20 గ్రంథాలనూ 2000 సంవత్సరంలో మహాపూర్ణాహుతి పుస్తకమాలగా పెట్టుబడి ధరకు తిరిగి ప్రచురించడం జరిగింది. క్రాంతిదర్శి అయిన ఋషి రచించిన ఒక్కొక్క వాక్యం పఠించదగినది, మననం చేయదగినది. వీనిలో నేటి సమస్యలన్నింటికీ పరిష్కారాలు లభిస్తాయి. మన జీవన విధానం ఎలా ఉండాలి? జీవన సాధనకు స్వర్ణ సూత్రాలు ఏవి? కృతయుగం ఎలా తిరిగివస్తుంది? ఈ విషయాలన్నింటినీ ఈ గ్రంథాలనుండి తెలుసుకోవచ్చు. 15 సంవత్సరాల తర్వాత అవి నిజం అవుతూ ఉండడం చూడవచ్చు.

### మన ఆశాకేంద్రం దేవసంస్కృతి విశ్వవిద్యాలయం

దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం పరమపూజ్య గురుదేవుల కలలను నిజం చేస్తోంది. 21వ శతాబ్దపు మహామానవులను నిర్మాణం చేస్తోంది. బ్రాహ్మణోచితంగా జీవించే ఇక్కడి ఆచార్యులనూ, ఆదర్శాలను తమ జీవితాలకు అన్వయించుకున్న ఇక్కడి విద్యార్థినీ విద్యార్థులనూ చూచిన వారు- 21వ శతాబ్దానికి ఒక మోడల్, ఒక నమూనా తయారైందని భావించారు. ఈ విశ్వవిద్యాలయానికి దూరస్థ కేంద్రాలను (డిస్టెన్స్ సెంటర్‌లు), అనుబంధ కళాశాలలను నిర్మాణం చేసే పథకం అమలు జరుగుతోంది. శిక్షణనూ, విద్యనూ సమన్వయం చేయడాన్ని సార్థకం చేసే ఈ కేంద్రాల, కళాశాలల వ్యవస్థ అంధకారంలో వెలుగులు విరజిమ్మే ఒక కాంతి కేంద్రం, ఒక ధ్రువతార. పరమాత్మ సత్‌ప్రవృత్తుల సముచ్చయం. ఆయనయే యుగ పరివర్తనకు కటిబద్ధుడై ఉన్నాడు. ఈ వాస్తవాన్ని ఇక్కడి కార్యకర్తలు పూర్తిగా నమ్ముతున్నారు.

### శాంతికుంజ్, గాయత్రీ తీర్థం ఒక సాధనా ఆరణ్యకం. దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం మహామానవులను నిర్మాణం చేసే ఒక టంకశాల.

ఈ టంకశాల పునాది చాలా గట్టిది. తపస్సుతో ఈ పునాదిని తడిపారు. పరమపూజ్య గురుదేవులు, పరమవందనీయ మాతాజీల ఆదర్శాలపై నిలచిన ఈ విశ్వవిద్యాలయ వ్యవస్థ అత్యంత బలీయమైనది. ఇది ఎవరో ఒక వ్యక్తిపై ఆధారపడినది కాదు. ఆదర్శాల - శ్రేష్ఠతల పావన పరంపర ఇది. దీనిని నిర్వహించే పాత్రతను సంపాదించిన వ్యక్తి నిరంతరంగా పురోగమిస్తాడు. లక్షల - కోట్ల గాయత్రీ పరిజనుల ఆశా కేంద్రం ఇది. వారే దీనిని తడుపుతున్నారు కూడా.

"21వ శతాబ్దం - ఉజ్వల భవిష్యత్తు"- అన్నది జరుగనున్న ఒక వాస్తవం. ఈ వాస్తవాన్ని మనమంతా పూర్తిగా విశ్వసించాలి. మనల్ని మనం సాధకులుగా మలచుకుని రేపటి ఈ వాస్తవం కోసమై అంకితం కావడం విజ్ఞత. మన గురుసత్తా ఇస్తున్న నిరంతర సందేశం ఇదే.

H H H

**కషాయ కల్మషాలనుండి విముక్తి పొందిన నరుడు నారాయణుడు అవుతాడు.**

ముఖచిత్ర కథనం-3

# పరమపూజ్య గురుదేవులు - ఒక అవతార శక్తి అయిదు అభినవ సంస్థలకు జన్మదాత

పరమపూజ్య గురుదేవులు ఒక అవతారశక్తి అనడంలో ఎటువంటి సందేహం లేదు. దానిని నిరూపించేదే ఈ వ్యాసం. తమ 80 సంవత్సరాల జీవిత కాలంలో వారు చేసిన సాధన, ప్రయోగాలు, గ్రంథ రచన, సంస్థల స్థాపన మొదలయిన విషయాలతో పోల్చదగినవి ఎక్కడా కనబడవు. కోట్లాది మంది వ్యక్తిత్వ నిర్మాణం, ఆలోచనా సరళిలో మార్పు, యుగనిర్మాణ భూమికను సృష్టించే కార్యం - వీటిని లక్షలాది సంవత్సరాల కొకసారి ఈ భూమి మీదకు వచ్చే అవతార శక్తులు మాత్రమే చేయగలవు. వారు స్థాపించిన సంస్థల గురించి ప్రస్తావన వచ్చినపుడు ఇటుకలు, సిమెంటు, మట్టి, సున్నం మొదలైన వాటితో కట్టిన భవనాల కంటే ముందు వారి స్నేహ, సంవేదనలలో లీనమై, వారి ఆప్యాయతను అనుభూతి పొంది, తమ సర్వస్వాన్ని అర్పించుకున్న లక్షలాదిమంది కనిపిస్తారు. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో కూడా అలాంటి వాతావరణమే కనబడేది. ప్రతి ఇంటి నుండి సత్యాగ్రహానికి తరలివచ్చేవారు. అలాంటి భావోద్రేకం చిరస్థాయిగా ఉండదు. దేశప్రగతి కోసం తమ సర్వస్వాన్నీ వదలి, స్వాతంత్ర్య సంగ్రామంలోనికి దుమికిన వ్యక్తులు ఎన్నడూ తప్పటడుగు వేయకుండా చూచేందుకై స్వాతంత్ర్యం తరువాత కాంగ్రెస్ సంస్థను రద్దు చేసి అందరూ స్వయంసేవకులుగా తయారై దరిద్రనారాయణులను ఉద్ధరించి దేశ ప్రగతికి పాటుపడాలని బాపూజీ పిలుపునిచ్చారు.

దేశ కీర్తికి మూలస్తంభమైన ఆ మహాపురుషుడు స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సరం లోపలే బలైన సంగతి అందరికీ తెలిసిందే. ఆయన ఆదర్శాలను అనుసరించేవారు వేళ్లమీద లెక్కించగలిగే ఏ కొద్దిమందో మిగిలారు. అవకాశవాదులు రాజకీయ నాయకులై స్వాతంత్ర్యం వచ్చినాకూడ బ్రిటిష్‌వారు కాకపోయినా అదే రంగు వేసుకొని శాసనాలు చేస్తున్నారు తప్ప నిర్మాణాత్మకంగా వ్యవహరించడం లేదు. మహామానవులను తయారుచేసే ఆశ్రమ వ్యవస్థ రూపంలో బాపూజీ ఆదర్శాల పునాదులమీద ఏర్పాటు చేసిన సేవాగ్రాం, సబర్మతి ఆశ్రమాలు ఆ కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఉండేవి. వినోబాజీ తరువాత వాటి గొప్పతనం క్షీణించిపోయింది. పరమపూజ్య గురుదేవులు ఇదంతా ముందుగానే దివ్యదృష్టితో చూశారు. భవ్య నిర్మాణ వ్యవస్థను ఏర్పాటు చేయాలనుకుంటే, దానికి ముందు దేశానికి సాంస్కృతిక, భౌతిక, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాన్ని ఇవ్వగలిగే అసంఖ్యాక వ్యక్తులను తయారుచేయాలని వారు భావించారు.

నేటికి 90 సంవత్సరాల క్రితం అనగా విక్రమ సంవత్సరం 1968 (క్రీ.శ. 1911)లో జన్మించి స్వాతంత్ర్య సంగ్రామంలో ఉన్మత్తుడై శ్రీరామ మత్త అని పిలువబడిన పండిత శ్రీరామశర్మ ఆచార్యగారు ముందుగా తనను తాను తపింపజేసుకున్నారు. ఆలోచనా క్రాంతి ఉద్యమ తంత్రం ఆయన, వందనీయ మాతాజీగార్ల రూపంలో ముందుకు వచ్చింది. 'అఖండజ్యోతి' పత్రికలో ఆచార్యశ్రీ లేఖిని నుండి వెలువడిన అభిమానపూర్వక వ్యాసాలు, వారు ఒక్కొక్కటిగా వెలువరించిన చిన్న చిన్న పుస్తకాలు అనేకమందిని స్పందింపజేశాయి. తన 24 గాయత్రి మంత్ర మహాపురశ్చరణల పూర్ణాహుతికి మథురలో తపోభూమిని స్థాపించాలని వారు నిర్ణయించారు. మొట్టమొదటి మంత్రదీక్షకూడ 1953లో అక్కడే ఇచ్చారు. ఆధ్యాత్మిక ఆధారం లేకుండా భావనాత్మక స్థాయిలో మార్పును తెచ్చే ఏ ఉద్యమమూ ఫలించదని వారు గుర్తించారు. నెమ్మదినెమ్మదిగా తన బోధనలతో ప్రతి ఒక్కరినీ గాయత్రీ మంత్రంతో, యజ్ఞ తత్వదర్శనంతో జోడిస్తూ వచ్చారు. అనేకమంది మనసులలో మొదటిసారిగా ఉదాత్త భావసంవేదనలను నింపి, గురుసత్తాను గుర్తింపజేసి, త్యాగధనులుగా యజ్ఞమయ జీవనాన్ని జీవించాలనే బలమైన ప్రేరణలు నింపిన గాయత్రీ పరివార్ విరాట్ వటవృక్షానికి మూలాధార స్థాపన అదే. సర్వమేధ రూపంలో తన సర్వస్వాన్ని బలి ఇచ్చి, నరమేధ రూపంలో తనను తాను సమాజం కోసం అర్పించుకుంటూ ఆయన రెండు యజ్ఞాలు

**మనం ఎన్నుకునే మార్గం మన గమ్యానికి అనుగుణంగా ఉండాలి.**

చేశారు. జమీందారీ కుటుంబం నుండి వారసత్వంగా వచ్చిన తన ఆస్తిని, వందనీయ మాతాజీకి చెందిన 250 నవరసుల బంగారు నగలను అమ్మివేసి స్వేచ్ఛ అనే సంపదను పొంది, 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆ భవనమే **'గాయత్రీ తపోభూమి'**. మథుర బృందావనం వెళ్ళే దారిలో దూర్వాసుని జన్మస్థలంలో ఇది నిర్మించబడింది. ఆ మొట్టమొదటి స్థాపనను అఖండ జ్యోతి సంస్థానంగా భావించవచ్చు. 40 మైళ్ళ దూరంలో ఉన్న తమ జన్మస్థలమైన ఆవల్ఖేడానుండి అఖండ దీపాన్ని తీసుకువచ్చి వారు అక్కడ స్థాపించారు. తపోభూమి స్థాపనకు 12 సం॥ల క్రితం ప్రారంభమైన మహాపురశ్చరణ తపస్సు 1941లో అక్కడ కొనసాగించారు. ఈ విధంగా ప్రజల అంతఃకరణాల్లో ప్రవేశించి వారిలో దైవత్వాన్ని జాగృతం చేయడానికి భూమికగా ఈ స్థాపనల క్రమం తయారైంది. భూత్‌బంగ్లా అని పిలువబడే ఒక భవనాన్ని అద్దెకు తీసుకొని, అందులో అఖండ దీపాన్ని స్థాపించి, దాని సమక్షంలో తపస్సు, గ్రంథ రచన సాగించారు. అదే అఖండజ్యోతి సంస్థాన్ ఘీయామండి, మథురగా ప్రసిద్ధిచెందింది. మథురలోనే బృందావన మార్గంలో మూడుమైళ్ళ దూరంలో 1953లో స్థాపించిన గాయత్రీ తపోభూమి రెండవ నిర్మాణం. ఆ తరువాత సంఘటిత గాయత్రీ పరివార్ స్థాపన ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

ఈవిధంగా పరమపూజ్య గురుదేవులు స్థాపించిన అయిదు మూల స్థంభాలు, తరువాత దేశం నలుమూలలా స్థాపించిన శక్తి పీఠాలు, భారత్‌లోనే కాక విశ్వమంతటా స్థాపించిన ప్రజ్ఞాపీఠాలు, గాయత్రీ పరివార్ శాఖలు, చరణపీఠాల గొప్పతనం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ప్రాణశక్తిని నింపిన ఆ శక్తి శరీరాన్ని వదలివేసిన తరువాత కూడ అక్కడ ఉన్న ప్రాణవంతులైన వ్యక్తులు ఎల్లవేళలా ఆ దిశలోనే పయనిస్తున్నారంటే, ఈ సంస్థ ఇంకా అనేకరెట్లు వృద్ధి చెందుతున్నదీ అంటే - వారి ప్రారంభిక కృషి ఎంత సముచితమైనదో భావించవచ్చు.

పరమపూజ్య గురుదేవులు నిర్మించిన అయిదు మహత్తర సంస్థలు -

1. యుగ తీర్థం, ఆవల్‌ఖేడా,
2. అఖండ జ్యోతి సంస్థాన్, ఘీయామండి, మథుర
3. గాయత్రీ తపోభూమి, మథుర,
4. శాంతికుంజ్, సప్తసరోవరం, హరిద్వార్,
5. బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్, సప్త సరోవరం, హరిద్వార్.

## యుగతీర్థం-ఆవల్‌ఖేడా

విక్రమ సంవత్సరం 1968 ఆశ్వయుజ కృష్ణ త్రయోదశి అనగా 1911 సెప్టెంబర్ 20వ తేదీన బ్రహ్మ ముహూర్తంలో యుగఋషి ఆచార్యజీ జన్మించిన స్థలం ఇది. డబ్బుకు ఏమాత్రం కొదువలేని బ్రాహ్మణ జమీందారీ కుటుంబం. సంస్కారవంతమైన వ్యక్తిత్వాలు. తండ్రి ప్రఖ్యాత భాగవత పండితులు. పూజ్యవరుల స్మృతి చిహ్నంగా నేడు ఒక విరాట్ స్తంభం, ఒక వేదిక స్థాపించబడిన ఈ స్థలంలో ఆయన జన్మించారు. ఈ జన్మభూమి అణువణువులో దైవీ శక్తులు నిండి ఉన్నాయి. ఆయన చేతులతో త్రవ్విన బావిలోని నీరే ప్రజలంతా త్రాగేవారు. ఎంతో తియ్యగా ఉండే ఆ నీటిబావి ఇప్పటికీ ఎంతోమంది దాహాన్ని తీరుస్తోంది. ఆయన చేతులతో నాటిన వేపచెట్టు క్రింద కూర్చుని గ్రామస్థులు స్వాతంత్ర్య సంగ్రామ చర్చలు చేస్తుండేవారు. ఆ చెట్టు ఇప్పటికీ ఆ మధుర ఘట్టాలను జ్ఞాపకం చేస్తూ ఉంటుంది. ఆ ప్రక్కనే రెండు గదులు. సూక్ష్మ శరీరధారియైన గురుసత్తా దర్శనం ఇచ్చి, 1962 తరువాత దిశానిర్దేశం చేసిన స్థలం అది. ఆవల్ఖేడాలోనే తల్లి జ్ఞాపకార్థం దానకుంవరీ ఇంటర్ కాలేజీ ఆయన ఇచ్చిన స్థలంలో, ఆయన ఇచ్చిన డబ్బుతో నిర్మించబడింది. 1963లో స్థాపించిన ఈ కాలేజీ నుండి ఎన్నో ఆణిముత్యాలు ఉద్భవించాయి.

1979-80లో గాయత్రీ శక్తిపీఠం, బాలికల ఇంటర్ కాలేజీ స్థాపించబడ్డాయి. చుట్టు ప్రక్కల వంద గ్రామాలనుండి బాలికలు ఇక్కడ చదువుతున్నారు. ఇక్కడ ఉద్భవించిన ప్రాణశక్తి నుండి వచ్చిన ప్రతి సంకల్ప సాధకుడు దేశ నవనిర్మాణానికి కావలసిన శక్తిని పొందాలనే ఉద్దేశ్యంతో ప్రథమ పూర్ణాహుతికి ఈ శక్తిపీఠాన్ని ఎంపిక చేశారు. పూజ్యవరులు 1936-37 వరకు ఇక్కడ ఉన్నారు. కొద్దిరోజులు ఆగ్రాలో ఉండి, 1940-41లో మథుర వెళ్ళారు. రెండు, మూడు ఇళ్ళు మారి ప్రస్తుత భవంతిని అద్దెకు తీసుకున్నారు. అదే ఈనాటి 'అఖండ జ్యోతి సంస్థాన్'.

**సంఘర్షణద్వారా లభించే శక్తి మన పురోగమనానికి దోహదకారి.**

## అఖండ జ్యోతి సంస్థాన్

ఇది ఘీయామండి, మథురలో ఉన్నది. ఆగ్రాలో ప్రారంభమై, ప్రజలవద్దకు విప్లవాత్మక చింతనను అందించే గాయత్రీ చర్చకు మూలస్తంభమైన 'అఖండజ్యోతి' మాసపత్రిక విస్తరణ ఇక్కడనుండే జరుగుతోంది. అసంఖ్యాక దుఃఖితులు, బాధితులు ఇక్కడే ఆయన స్పర్శతో నూతన ఉత్తేజాన్ని పొంది, పరమవందనీయ మాతాజీ చేతుల మీదుగా భోజన ప్రసాదాలను స్వీకరించి వారి సొంత మనుషులుగా తయారయ్యారు. చిన్న ముద్రణ యంత్రంతో అఖండజ్యోతి పత్రిక ఇక్కడే ప్రచురించబడేది. చిన్నచిన్న పుస్తకాల అమ్మకంతో ఆ ఖర్చుకు డబ్బు లభించేది. అఖండదీపం ఉంచిన స్థలంలో ఈనాడు ఒక పూజామందిరం నిర్మించబడింది. ఆయన కుమారుడు ఆ భవంతిని ఖరీదు చేసి నూతన ఆకారాన్నిచ్చారు. లోపల మాత్రం 1942-43లో ఎలా ఉందో అలాగే ఉంచారు. 30 సంవత్సరాల సాధనాకాలం, గ్రంథరచనా కాలం ఈ భవనంలోని రెండు గదులలో తీవ్ర తపశ్చర్యతోపాటు జరిగింది. తపోభూమి నిర్మాణ భూమిక ఇక్కడ తయారైంది. 1958లో సహస్రకుండీ యజ్ఞం ఇక్కడే జరిగింది. రోజూ వచ్చే ఉత్తరాలను వందనీయ మాతాజీ స్వయంగా చదివి వినిపిస్తున్న సమయంలోనే గురుదేవులు సమాధానాలు వ్రాసేవారు. ఇదే స్నేహ సూత్ర బంధాల దృఢత్వానికి ఆధారమైంది. ప్రతి ఒక్కరికీ మూడు రోజులలో జవాబు లభించేది. గాయత్రీ మహావిజ్ఞాన్ మూడు భాగాలు, యుగ నిర్మాణ సాహిత్యం, ఆర్ష గ్రంథాల భాష్య రచన ఇక్కడే జరిగాయి. చిన్న, పెద్ద సమ్మేళనాలు, అయిదు 1008 కుండముల విరాట్ యజ్ఞాలకు గురుదేవులు ఇక్కడినుండే వెళ్ళారు. ఈనాడు 15 లక్షలకు పైగా అఖండజ్యోతి మాస పత్రిక ప్రతులు వివిధ భాషలలో ప్రచురితం అవుతున్నాయంటే గురుదేవుల విరాట్ చేతన ఈ సంస్థానం అణువణువులో ఎలా నిండి ఉందో అర్థం అవుతుంది. బాహ్యరూపం మారిపోయినా, లోపలికి ప్రవేశిస్తూనే గురుదేవులు, మాతాజీల ప్రాణ చేతనల స్పందన నిరంతరం ఇక్కడ ఉండడాన్ని మనం గమనించవచ్చు.

## గాయత్రీ తపోభూమి – మథుర

గురుదేవుల 24 మహాపురశ్చరణల పూర్ణాహుతి సందర్భంగా స్థాపించబడినదిగా దీనిని పేర్కొనవచ్చు. దీని స్థాపనకు ముందు 2400 పుణ్యక్షేత్రాల నుండి జలం, మృత్తికలను సంగ్రహించి పూజ చేయడం జరిగింది. చిన్న యజ్ఞశాలను నిర్మించి అఖండ అగ్నిని స్థాపించారు. ఒక గాయత్రీ మందిరాన్ని నిర్మించారు. నిష్ఠాపరులైన సాధకులచే 2400 కోట్ల గాయత్రీ మంత్ర లేఖనం వ్రాయించి ఇక్కడ స్థాపించారు. సాధన, ప్రాతఃకాల గ్రంథ రచన అఖండ జ్యోతి సంస్థాన్‌లో జరిగాయి. వారు వచ్చిన వారినందరిని కలిసి మార్గదర్శనం చేసిన కర్మ భూమి - తపోభూమి ఇది. 1953లో 108 కుండముల యజ్ఞంలో మొదటి మంత్ర దీక్ష ఇచ్చింది కూడ ఇక్కడే. 1953లో నరమేధ యజ్ఞం, 1958లో విరాట్ సహస్రకుండీ యజ్ఞాలు ఇక్కడే జరిగాయి. శ్రేష్ఠమైన రత్నాలను వెలికితీసి గాయత్రీ పరివార్‌ని స్థాపించే కార్యాన్ని ఇక్కడే నిర్వహించారు. హిమాలయ ప్రయాణం నుండి తిరిగివచ్చి ఆచార్యశ్రీ యుగనిర్మాణ ప్రణాళికకు చెందిన శతసూత్ర కార్యక్రమాన్ని, సత్సంకల్పాలను, స్వావలంబన ప్రధాన శిక్షణనిచ్చే విద్యాలయ స్థాపన నిర్ణయాన్ని ప్రకటించారు. ఇది 1964లో స్థాపించబడి ఇప్పటికీ విజయవంతంగా నడుస్తోంది. గురుదేవులు అందరినీ కలిసే గదిని ఇప్పటికీ చూడవచ్చు. 1971లో వారు ఇక్కడ నుండి వెళ్ళిపోయినా, ఇక్కడి అణువణువులో వారి ప్రాణచేతనను మనం ఇప్పటికీ దర్శించవచ్చు. విరాట్ ప్రజ్ఞానగర్, యుగనిర్మాణ విద్యాలయం, ఆఫ్‌సెట్ ముద్రణా యంత్రాలు, గురుదేవులు జీవితాంతం రచించిన యుగనిర్మాణ సాహిత్య ముద్రణ, వితరణల విస్తార తంత్రం ఇక్కడే చూడవచ్చు.

## శాంతికుంజ్ – హరిద్వార్

ఋషి పరంపరకు బీజారోపణ కేంద్రంగా ఇది 1971లో స్థాపించబడింది. మథురను వదలిన తరువాత వందనీయ మాతాజీని అఖండదీప సంరక్షణకు ఇక్కడ వదలి వారు హిమాలయాలకు వెళ్ళారు. గురుసత్తా ఆదేశంతో ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చారు. శాంతికుంజ్‌కు విరాట్ రూపాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి ముందు పరమ వందనీయ మాతాజీ 24 మంది కన్యలతో అఖండదీప సమక్షంలో 240 కోట్ల గాయత్రీ మంత్ర అఖండ అనుష్ఠానాన్ని ప్రారంభించారు.

**మంచిని పెంచడం చెడును త్రుంచడానికి మంచి పద్ధతి.**

గురుదేవులు ప్రాణ ప్రత్యావర్తన శిబిరాలు, జీవన సాధన శిబిరాలు, వానప్రస్థ శిబిరాలు మొదలైన వాటిద్వారా వివిధ క్షేత్రాలలో కార్యకర్తలను తయారుచేశారు. కల్పసాధన, సంజీవనీ సాధనల రూపంలో 9 రోజుల శిబిరాలు, ఒక నెల యుగశిల్పి శిక్షణా శిబిరాలు అప్పటినుండే జరుగుతూ ఉన్నాయి. అసంఖ్యాకులు ఈ శిబిరాలలో పాల్గొనడానికి క్యూలో ఉంటారు.

శాంతికుంజ్‌కు 'గాయత్రీ తీర్థం' రూపాన్నిచ్చి 1978-79లో సప్తఋషుల విగ్రహాలను స్థాపించారు. ఒక దేవాత్మ హిమాలయం నిర్మించబడింది. అన్ని సంస్కారాలు నిర్వహించే వ్యవస్థ ఏర్పాటై నిరంతరమూ కొనసాగుతోంది. నిత్యమూ దీక్ష, పుంసవనం, నామకరణం, విద్యారంభం, ఉపనయనం, వివాహం, శ్రాద్ధ - తర్పణ మొదలయిన సంస్కారాలు జరుగుతున్నాయి. పరమ వందనీయ మాతాజీ మహిళా జాగరణ శిబిరాలు ప్రవేశపెట్టారు. దేవ కన్యలకు శిక్షణ నిచ్చి దేశం మొత్తానికి బృందాలుగా పంపించారు. దేశం నలుమూలలా ఉద్యమ నాదం వినిపించింది.

ఇది ఈనాడు ఒక విరాట్ అకాడమీగా కనబడుతుంది. ఒకేసారి పదివేల మంది కలిసి ఉండడానికి కావలసిన కట్టడాలు 1981-82లో ప్రారంభమైనాయి. విలక్షణమైన, దుర్లభమైన వనమూలికల మొక్కలు పెంచుతున్నారు. ప్రఖర ప్రజ్ఞ, సజల శ్రద్ధల రూపంలో ఒక తీర్థాన్ని పూజ్యవరులు తమముందే నిర్మించారు. వారి ఆదేశాల ప్రకారం వారు శరీరం వదలివేసిన తరువాత ఆ రెండు శక్తులను అగ్నికి సమర్పించిన స్థలం ఇదే. స్వావలంబన విద్యాలయంతోపాటు విశాలమైన ఒక భోజనశాలను నిర్మించారు. గాయత్రీ విద్యతోపాటు భారత్‌లోని అన్ని ప్రభుత్వ విభాగాలకూ శిక్షణా తంత్రం స్థాపించబడింది. ఒక ప్రాణవంతమైన పుణ్యక్షేత్రం ఇప్పుడు తయారైంది. ఉజ్వల భవిష్యత్తుకు తొలి మెరుపు ఇక్కడ కనిపిస్తుంది. విశాల కంప్యూటర్ కార్యాలయం, ఉత్తర ప్రత్యుత్తరాల శాఖలో నిత్యం వేలాది ఉత్తరాల ద్వారా పూర్తి తంత్రానికి మార్గ దర్శనం చేయడం ఇక్కడి ప్రత్యేకత.

## బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్

గురుదేవుల అయిదవ స్థాపన ఇది. ఇక్కడ విజ్ఞానము, అధ్యాత్మికతల సమన్వయ పరిశోధనలు జరుగుతాయి. ఇది 1979 గాయత్రీ జయంతినాడు ప్రారంభించబడింది. ప్రస్తుత శాంతికుంజ్‌కి అరకిలోమీటర్ దూరంలో గంగానది ఒడ్డున ఆకర్షణీయంగా నిర్మించడం వలన సహజంగానే ఇది అందరినీ సమ్మోహకంగా స్వాగతిస్తుంది. క్రింది భాగాన వైజ్ఞానిక వస్తువులతో అలంకరించిన యజ్ఞశాల నిర్మించబడింది. 24 గదులలో గాయత్రీ మహాశక్తి యొక్క 24 విగ్రహాలు, బీజ మంత్రాలు, వాటి ఫలశృతులతో సహా స్థాపించబడినాయి. మొదటి అంతస్థులో వైజ్ఞానిక ప్రయోగశాల ఉంది. సాధనకు ముందు, తరువాత, యజ్ఞాది మంత్రోచ్చారణలకు ముందు, తరువాత శారీరక, మానసిక కార్యకలాపాలలోను, రక్తప్రసరణ మొదలైన వాటిలోను ఎటువంటి పరివర్తన సంభవిస్తుందో పరీక్షించి చూసి చెప్పే వైజ్ఞానిక యంత్రాలు ఇందులో ఉన్నాయి. ఇవి ఆధారంగా సాధకులకు సాధనకు సంబంధించిన సూచనలు ఇవ్వడం జరుగుతుంది. యజ్ఞశక్తి, మంత్రశక్తుల ప్రభావం సాధకుల మస్తిష్క తరంగాలు, జీవ విద్యుత్ మొదలయిన వాటిని ఏవిధంగా ప్రభావితం చేస్తాయో వారు చూస్తారు. అనేక రకాల మనోవైజ్ఞానిక శిక్షణలు కూడ ఇక్కడ ఉంటాయి. రెండవ అంతస్థులో విశాల గ్రంథాలయం ఏర్పాటు చేయబడింది. విశ్వమంతా నిండి ఉన్న వైజ్ఞానిక ఆధ్యాత్మిక పరిశోధనకు చెందిన దాదాపు 45000 గ్రంథాలు ఇక్కడ ఉన్నాయి. కొన్ని పురాతన తాళపత్ర గ్రంథాలు కూడ ఉన్నాయి. ఇది అనితరసాధ్యమైన భాండాగారం.

పరమపూజ్య గురుదేవులు స్థాపించిన పై సంస్థలు ఏదో ఒక విలక్షణ మహాశక్తి మన అందరి మధ్య తన లీలలను రచించి వెళ్ళిందనే విషయాన్ని స్పష్టం చేస్తాయి. ఇవి కళ్ళకు ప్రత్యక్షంగా కనిపించే కేంద్రీయ స్థాపనలు మాత్రమే. 4800పైగా ప్రజ్ఞా సంస్థానాలు, 24000పైగా జ్ఞానమండళ్ళు, స్వాధ్యాయ మండళ్ళు, అసంఖ్యాకమైన గాయత్రీ పరివార్ శాఖలు ఇందులో కలిపితే ఆ విరాట్ స్వరూపాన్ని ఊహించను కూడ ఊహించలేము. ఆ మహాపురుషుణ్ణి ఒక అవతారశక్తిగా నిలబెట్టే ఈ స్థాపనలు వ్యక్తులలో తమ కర్తవ్యాలపట్ల శ్రద్ధను, ఉత్సాహాన్ని ప్రేరేపిస్తాయి.

- డి.వి.ఆర్.మూర్తి

H H H

**కల్పనా భూతం చిన్న దోషాన్ని పెద్ద పర్వతంలా చూపుతుంది.**

## బోధ కథ

# నమ్రత ధర్మ లక్షణం

అతి ప్రాచీన కాలంలో ఇంద్రప్రస్థ మహారాజు ధనంజయునికి పుత్రుడుగా బోధిసత్వుడు జన్మించాడు. తండ్రి మరణం తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఆయన న్యాయ నిష్ఠ, దానశీలత జంబూద్వీపమంతటా ప్రఖ్యాతి పొందాయి.

ఆ రోజులలో కళింగ రాజ్యంలో కరవు ఏర్పడింది. ఆకలి చావులు ప్రారంభమైనాయి. జనం రాజ్యం వదలి పారిపోసాగారు. ప్రజల దుఃఖాన్ని చూచి కళింగ మహారాజు ఎంతగానో బాధపడ్డాడు. విద్వాంసులను పిలిపించి కరవు నివారణకు ఏమి చేయాలని సలహా అడిగాడు.

ఒక వయోవృద్ధుడు ఇలా చెప్పాడు -

పూర్వపు రాజులు కరవు పరిస్థితులలో తమ కోశంలోని ధనం మొత్తాన్ని దానం ఇచ్చేవారు. నెలరోజులపాటు గడ్డిమీద నిద్రపోయేవారు. వ్రతాన్ని పాటించేవారు. వారలా చేయడంవల్ల వర్షాలు కురిసేవి.

కళింగ రాజు వెంటనే ఆ సలహాను అమలు చేశాడు. దానం, వ్రతం, భూమి శయనం సక్రమంగా జరిపాడు. కానీ వర్షం పడలేదు.

రాజు మరో సభను ఏర్పాటు చేశాడు. ఆ సభలో ఒక జ్యోతిషవేత్త ఇలా చెప్పాడు -

కురురాజ్యం రాజువద్ద అంజన వసభ అనే శుభదాయకమైన ఏనుగు ఉంది. ఆ ఏనుగును మన రాజ్యంలోకి తీసుకువస్తే కరవు తొలగిపోతుంది.

కళింగ రాజు ఆ ఏనుగును పంపవలసిందిగా కోరుతూ కురు రాజ్యానికి దూతను పంపాడు. ఉదారుడైన కురు రాజు ఆ ప్రార్థనను అంగీకరించాడు. తక్షణమే ఆ ఏనుగును దానం ఇచ్చాడు. ఆ ఏనుగు కళింగ రాజ్యంలోకి వచ్చింది. అయినా వర్షాలు పడలేదు.

రాజు మూడవ సభను సమావేశపరచాడు. ఆ సభలో సుదీర్ఘమైన చర్చ జరిగింది. చివరికి ఒక నిర్ణయం జరిగింది.

ఇంద్రప్రస్థంలో ఎన్నడూ కరవు రాదు. అక్కడ ప్రజలు ధర్మాన్ని ఆచరిస్తారు. సదా సుఖంగా ఉంటారు. మన రాజ్యంలో అధర్మం పెరిగింది. కనుకనే కరవు వచ్చింది. మనం ఇంద్రప్రస్థ మహారాజునుండి ధర్మాచరణ నియమాలను తెలుసుకోవాలి. వాటిని స్వర్ణ ఫలకంమీద వ్రాయించి పంపవలసిందిగా కోరాలి. ప్రజలచేత ఆ నియమాలను పాటింపజేయాలి. అప్పుడు వర్షాలు కురుస్తాయి.

కళింగ రాజు ఎనిమిదిమంది బ్రాహ్మణుల బృందాన్ని ఇంద్రప్రస్థానికి పంపాడు. ఇంద్రప్రస్థం రాజు ఇలా వ్రాసిఉన్న స్వర్ణ ఫలకాన్ని వారికి చూపాడు -

"నిర్దయగా ఉండవద్దు. శ్రమించకుండా ధనాన్ని తీసుకోవద్దు. మోసం చేయవద్దు. స్నేహ సౌజన్యాలతో వ్యవహరించు. సంయమనాన్ని పాటించు. ప్రసన్నంగా ఉండు."

అయితే ఈ నియమాలు అసంపూర్ణంగా ఉన్నాయనే సందేహం ఆయనకు కలిగింది. ధర్మతత్వం దాన్ని నిర్దేశించేవారికి కాక దానిని ఆచరించవారికే తెలుస్తుందని ఆయన భావించాడు. కనుక ఆయన బ్రాహ్మణులను ధర్మపరాయణురాలు అయిన తన తల్లివద్దకు పంపాడు. ఈ నియమావళిలో ఉన్న లోటును ఆమెచేత పూర్తి చేయించండి - అని వారికి చెప్పాడు.

బ్రాహ్మణుల బృందం రాజమాతవద్దకు వెళ్ళి విషయం వివరించారు. రాజమాత ఇలా అన్నది -

"ధర్మాన్ని ఆచరించాలని నేను నిరంతరం ప్రయత్నిస్తూ ఉన్నాను. అయినా ఏవో లోపాలు దొర్లుతున్నాయి. మీరు ఉపరాజువద్దకు వెళ్లండి. అతడు నాకన్న మెలకువగా ఉంటాడు."

ఉపరాజు వద్దకు వెళ్లగా అతడు వారితో ఇలా చెప్పాడు-

"నేను ధర్మాచరణకోసం ప్రయత్నిస్తున్న మాట నిజమే. అయితే నాలో ఇంకా సంస్కరించకోవలసింది చాలా ఉంది. కనుక ధర్మతత్వాన్ని కర్తవ్యనిష్ఠ కలగినవారినుండి తెలుసుకోవాలి. కనుక విద్రుభ అమాత్యుల వద్దకు వెళ్లండి."

బ్రాహ్మణులు అమాత్యుని వద్దకు వెళ్లారు. అమాత్యుడు కర్రకు తాడు కట్టి పొలాల పొడవూ, వెడల్పూ కొలుస్తున్నాడు. ఈ పనిలో ఒక కప్ప అతడి కాళ్లక్రింద నలిగి చనిపోయింది. అతడు విచారంగా కూర్చొని ఉన్నాడు. బ్రాహ్మణులు తాము వచ్చిన పని

**ప్రపంచంలో చీకటి ఉంది. వెలుతురు మరింత ఉంది.**

గురించి అతడికి తెలిపారు. అమాత్యుడు ఇలా చెప్పాడు -

"మీరు చూడడం లేదా, నేను నా కర్తవ్య పాలనలో మెలకువ వహించలేదు. ఇది అధార్మికం, ధర్మాన్ని బోధించే అధికారం నాకేమి ఉంది? మీరు సుధార సారథి వద్దకు వెళ్లండి. ఎలాంటి లోపం లేకుండా ధర్మాచరణ చేయడంలో అతడు ప్రసిద్ధి పొందాడు.

సారథి తన లోపాలను ఇలా పేర్కొన్నాడు -

"గుర్రాలు సరిగా పరుగెత్తుతూన్నప్పటికీ మరింత వేగంగా పరుగెత్తించడానికై వాటిని కొరడాతో పలుమార్లు కొట్టాను. అందువల్ల వాటికి ఎంత బాధ కలిగిందో గుర్తించ లేక పోయాను. సహానుభూతి కొరవడిన వ్యక్తి ధర్మోపదేశం ఎలా చేయగలడు? మీరు అనాభ శ్రేష్ఠి వద్దకు వెళ్లండి. ధర్మాత్ముడుగా పేరుపొందిన వ్యక్తి ఆయన."

అనాభ శ్రేష్ఠి అంతకు పూర్వమే జరిగిన ఒక సంఘటనను వారికి ఇలా వర్ణించాడు -

"రాజ్యానికి పన్ను కట్టకుండానే నేను పొలంలోని ధాన్యాన్ని కోసుకుని రొట్టెలు చేసి తిన్నాను. పన్ను చెల్లించిన తర్వాతనే దాన్ని తినాలని తింటూన్నప్పుడు నాకు తోచలేదు. మరి నేను మరొకరికి ధర్మాన్ని ఎలా బోధించగలను? ఆచరణలో పెట్టినవాడే ఉపదేశించడానికి అర్హుడు. మీరు వీరోజన అమాత్యునివద్దకు వెళ్లండి. ఆయనకా అర్హత ఉంది."

వీరోజన అమాత్యుడు ముఖం వ్రేలాడవేసుకుని దిగులుగా కూర్చొని ఉన్నాడు. రైతుల పంటలో ఆరవ భాగం పన్నుగా వసూలు చేయడం ఆయనకు అప్పగించబడిన బాధ్యత. నిన్న ఒక రైతు ధాన్యపు రాశిని ఆయన కొలిచాడు. రాజ్య భాగాన్ని వేరు చేయడం కోసం విభజన రేఖగా ఆయన కొద్ది ధాన్యాన్ని గుర్తుగా ఉంచాడు. కొలవడం పూర్తవుతూ ఉండగా వర్షం వచ్చింది. అతడు ఆ తొందరపాటులో అలా గుర్తుగా ఉంచిన ధన్యాన్ని రాజ్య భాగంలో కలిపాడు. అది రాజ్య కోశంలో జమ అయింది. తాను చేసిన పొరపాటువల్ల రాజ్యానికి అనుచితమైన లాభం కలిగింది. రైతుకు అన్యాయం జరిగింది. న్యాయంగా పన్నులు వసూలు చేయడానికి తాను పంపబడ్డాడు. ఆ పనిలో మరింతగా మెలకువ వహించవలసింది. అతడు బ్రాహ్మణులకు తాను చేసిన పొరపాటుగురించి చెప్పాడు. మీరు ద్వారపాలకుడు సుధీర్‌వద్దకు వెళ్లండి - అని వారికి సలహా ఇచ్చాడు.

సుధీర్ బ్రాహ్మణులు చెప్పింది విని, ఒక సంఘటనను ఇలా వర్ణించాడు -

ఒక యువకుడు న్యాయంకోసం తన సోదరితోపాటు రాజ దర్బారుకు వచ్చాడు. వారిద్దరూ నవ్వుకుంటూ వెళుతున్నారు. వారు వ్యభిచారులని నేను అనుకున్నాను. వారిని కటువుగా మందలించాను. తాము అన్నా చెల్లెళ్లమని వారు నాకు వివరించారు. నాకు బాధ కలిగింది. విషయం పూర్తిగా తెలుసుకోకుండా కేవలం అనుమానం ఆధారంగా నిర్ణయం తీసుకున్నాను. నాలాంటి వాడు ధర్మం గురించి ఏమి చెపుతాడు? మీరు వేశ్య చంద్రవతివద్దకు వెళ్లండి."

బ్రాహ్మణులు చెప్పిన మాట విని ఆ వేశ్య ఏడుపు ముఖం పెట్టింది. ఆమె ఇలా చెప్పింది -

"ఒక సంవత్సరంపాటు ప్రణయ క్రీడ కోసం పరదేశి అయిన ఒక యువకుడు నాకు వేయి నాణెములు ఇచ్చి ఒప్పందం కుదుర్చుకున్నాడు. అకస్మాత్తుగా అతడు స్వదేశానికి తిరిగివెళ్ల వలసివచ్చింది. నేను మూడు సంవత్సరాలు అతడి కోసం వేచిచూశాను. అతడి జాడ తెలియలేదు. నేను ఆకలితో చనిపోయే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు మరో యువకునితో ఒప్పందం చేసుకున్నాను. మొదటి యువకునిపట్ల నేను నమ్మక ద్రోహం చేయలేదు కదా - అని నేను ఆలోచనలో పడ్డాను. ఎటూ తేల్చుకోలేని ఇలాంటి మానసిక పరిస్థితిలో ఉన్న నేను మరొకరికి సలహా ఎలా ఇవ్వగలను?"

వీరందరూ చెప్పిన దానిలోని సారాన్ని మనసులో పెట్టుకుని బ్రాహ్మణులు రాజు వ్రాయించి ఇచ్చిన స్వర్ణ ఫలకంతో కళింగ రాజ్యానికి వచ్చారు. రాజ్యసభలో జరిగినదంతా వివరించారు. ధర్మాచరణకు స్థూలమైన నియమాలు ఫలకంపై వ్రాసి ఉన్నాయి. వాటిలోని సారం ఇది -

"ప్రతి వ్యక్తీ తన ఆచరణ గురించి లోతుగా సమీక్షించుకోవాలి. దాన్ని సవరించుకోవడానికి కృషి చేయాలి. వినమ్రంగా ఉండాలి. తనకన్న ఇతరులు శ్రేష్ఠులని భావించాలి."

కళింగరాజు స్వర్ణ ఫలకంపై వ్రాయబడిన నియమాలకు బ్రాహ్మణులు చెప్పిన ధర్మ రహస్యాన్ని జోడించాడు. తన ప్రజలు వాటిని పాలించేటట్లు చూచాడు.

ప్రజలు ఆ ప్రకారం ధర్మాచరణను ప్రారంభించగానే కుండపోత వర్షం కురిసింది. కరవు తొలిగిపోయింది. కృతయుగపు సువ్యవస్థకు పునాది పడింది.

M M M

**దుఃఖాలు మన అధర్మాల ఫలితాలు.**

దేవ సంస్కృతి సౌరభం

# వైదిక సాహిత్యంలో మానవ ధర్మ దర్శనం

కుట్రలు, కుతంత్రాలతో నిండిన నేటి విషపూరిత వాతావరణంలో వైదిక సాహిత్యం వర్ణించిన అఖండత, ఏకత్వ సూత్రాలే భారతీయులందరికీ అనుసరణీయాలు. సంఘటితంగా ఉండడం వల్లనే దేశ కల్యాణం సంభవం. అందరి హృదయాలలో, సంకల్పాలలో సమానత్వం ఉండాలని ఋగ్వేద మంత్రాలు ఘోషిస్తున్నాయి. ప్రేమతో నిండిన హృదయమే ఐశ్వర్యాభివృద్ధిని చూడగలదు.

**సమానీ వః ఆకూతిః సమానా హృదయాని వః ।**
**సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి ॥**
- (ఋగ్వేదం - 8/49/4)

వైదిక ఋక్కుల ఉద్బోధనను స్వీకరిర్తా మనం సంఘటితం అవ్వాలి. మనం ఎప్పుడూ విడిపోకూడదు. విడిపోనివ్వరాదు. మన లక్ష్యం - అఖండ దేశం, మానవత్వం.

### విశ్వకల్యాణ భావన

వైదిక సాహిత్య కల్యాణమయ వాణి మానవమాత్రుల కోసమే. దాని అంతః ప్రభావం స్వయంగా వేదమే.

**యథేమాం వాచం కల్యాణీ మవదానీ జనేభ్యః ।**
- (ఋగ్వేదం - 26/2)

వేదం స్వయంగా చెబుతోంది - నాకు మంచి జరిపించే వాణి స్త్రీ, పురుషులకోసమే. ఇందులో బ్రాహ్మణులనుండి శూద్రులు - అతి శూద్రుల వరకు అందరికీ ఆదేశం ఉంది. ఈ ఋక్కుల వ్యాఖ్యానాన్ని మానసికంగా ఆచరించడం ఎంతో అవసరం. సంప్రదాయాన్ని ధర్మంగా భావించడం బుద్ధిహీనతను సూచిస్తుంది. అది హృదయాలను విడదీసి మనిషికీ మనిషికీ మధ్య అంతరాన్ని పెంచుతుంది.

గత రెండువేల సంవత్సరాల నుండి విభజనవాదుల దుర్మార్గాలు పెరిగిపోయాయి. వారు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నారు. ఒక ఈశ్వరుని స్థానంలో అనేకమంది ఈశ్వరులు, దేవతలు, ఒక ఉపాసన స్థానంలో అనేక ఉపాసనలు పుట్టుకువచ్చాయి. ఒకే సమాజంలో అనేక జాతులు, ఉపజాతులు, వాటిలో ఉచ్చనీచాలు, భిన్నత్వాల ప్రతిబంధకాలు ఉత్పన్నమయ్యాయి. వేదాలు నిర్దేశించిన ఒకే ధర్మం స్థానంలో లెక్కలేనన్ని రీతులు - ఆచారాలు. ఇలాంటి స్వార్థపరులు తమ అధికారాన్ని స్థిరం చేసుకోవడానికి, తమ తమ వర్గాలు ఏర్పాటు చేసుకోవడానికి భారతీయ సంస్కృతిని, సమాజాన్ని ముక్కలు, ముక్కలు చేశారు. ఫలితంగా చీపురు కట్టనుండి విడిపోయిన పుల్లలలాగా మనదేశం అతిదీనంగా, బలహీనంగా తయారైంది. విదేశీయుల దాస్యంలో వెయ్యి సంవత్సరాలు మగ్గవలసివచ్చింది.

### అన్ని మతాలకూ మూలం

విశ్వ కల్యాణాన్ని కోరేది ఈ సనాతన వైదిక ధర్మం ఒక్కటే. విశ్వంలోని సమస్త మతాలు ఈ వేద శిఖరం నుండి వచ్చినవే.

**"వేదాత్ ధర్మః ప్రవహతి శైలాదమి నదీ యథా"**

పర్వతాల నుండి నదులు ఎలా బయలుదేరుతాయో, అదే విధంగా అన్ని ధర్మాలూ (మతాలూ) వేదాలనుండే ప్రారంభమయ్యాయి. మనం ధర్మాల మూలం వరకు వెళ్ళి వాటి సారాన్ని గ్రహించాలి. అప్పుడే మనం ఇల్లు - కుటుంబం - సమాజం - దేశం విశ్వముల కల్యాణాన్ని సాధించవచ్చు.

దేశ చరిత్రను అవిచ్ఛిన్నంగా ఉంచడానికి సమర్థవంతమైన సమాజ సంఘటిత శక్తిని జాగృతం చేయడం మన పావన కర్తవ్యం. ఇది సంకల్పం, విశ్వాసముల ద్వారా సాధ్యమవుతుంది. వైదిక సాహిత్యాన్ని పూజించే బదులు దాని ప్రేరణలకు ఒక రూపాన్నివ్వడం మన బాధ్యత. వైదిక సాహిత్య స్వాధ్యాయం మనసును వికసింపజేసి జ్యోతిర్మయం చేస్తుంది. ఎటువంటి విలువలేని పుస్తకాలు చదివే బదులు, నిత్య జీవితంలో ఒక మంత్ర అర్థాన్ని తెలుసుకొని, దానిని ఆలోచిస్తే ఖచ్చితంగా ప్రకాశవంతమైన మార్గం దొరుకుతుంది. వేదాల మూలరూపాన్ని చదివి అర్థం చేసుకోవడం ఈనాటి సామాన్య జనులకు సాధ్యం కాదు. కనుక 'వేదాలు-దివ్య సందేశం' పుస్తకాన్ని అధ్యయనం, మననం చేయాలి. ఈ పుస్తకంలో వర్తమాన జీవితానికి ఉపయోగపడే విధంగా మంత్రాల వ్యాఖ్యానం సరళమైన భాషలో అర్థమయ్యేలా వ్రాయబడింది. వివేకవంతులం కావడం వల్లనే మన ఐకమత్య సోపానాలను అధిరోహించగలుగుతాము.

**మోసానికి విరుగుడు శోకం.**

'కృణ్వన్తో విశ్వమార్యమ్' అనగా మనమంతా సంఘటితమై విశ్వాన్ని శ్రేష్ఠవంతంగా చేయాలి. అప్పుడే శాంతి వెల్లివిరుస్తుంది.

## మనసులను కలిపి మంత్రం

"సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మనాసి జానతమ్।"

- (ఋగ్వేదం - 10/19/2)

ఈ మంత్రంలో ఐశ్వర్య ప్రార్థన ఉన్నది. ఈశ్వరుని ఆదేశం ఉన్నది.

**సంగచ్ఛధ్వం:-** మీరందరూ కలిసి సాగండి. ఏ కార్యసిద్ధికైనా అందరి మార్గం విభిన్న రకాలుగా ఉంటే కార్యసిద్ధిలో కష్టాలు ఎదురవుతాయి. కనుక అందరి ఆచరణ పరస్పర అనుకూలంగా ఉండాలి.

**సంవదధ్వం:-** మీరందరూ ఒకే మాట మీద నిలబడండి. ఒకే మార్గంతోపాటు వాక్కుకూడ ఒకటిగానే ఉండాలి. ఐకమత్య సాధనకు ఒకే వాణి, ఒకే భాష ఉండాలి.

**సం వో మనాసి జానతమ్ :-** మీరు జ్ఞానులతో సమానమైన మనసు కలిగి ఉండాలి. మానసిక భావనలు ఒకటయినపుడు మాత్రమే మాటలు ఒకే రకంగా వస్తాయి. ఉచ్చారణకు మూలం ఆలోచన. మనసులో ఏదయితే ఉంటుందో అదే వాక్కులో వస్తుంది. ఏదయితే వాక్కులో వస్తుందో అదే కర్మగా పరిణతి చెందుతుంది.

మనిషి, సహృదయం ఎప్పుడు ఒకే వ్యవహారాన్ని నడుపుతాయి. అథర్వవేదంలో కూడ ఇలాంటి మంత్రమే ఉన్నది-

**సం జానీధ్వం సం ప్రచ్ఛధ్వం - (641)**

అనగా మీరందరూ సంఘటితమై ముందుకు సాగండి. మీ అందరి మనసులు ఒకటిగా ఉండాలి.

జ్ఞానుల ఆలోచనలలో సమైక్యత ఉంటుంది. కాని అజ్ఞానులలో పరస్పర విరుద్ధ భావన లుంటాయి. మాటిమాటికి కొట్లాటలు, కలహాలు, ఒకరి మాట ఒకరు ఖండించుకోవడం, ఒకరిని ఒకరు నీచంగా చూసుకోవడం వారి స్వభావం. అందువలనే తులసీదాసు రామచరిత మానసంలో ఇలా వ్రాశాడు.

## రంధ్రాన్వేషణ తగదు

**జే పరదోష లఖాహిం సహసాఖీ।**
**పరహిత ఘృత జిన్‌కే మన్ మాఖీ॥**

రంధ్రాన్వేషణ ప్రవృత్తి నుండి బయటపడి ఎప్పుడూ సద్గుణాలు కలిగి ఉండేవారే అందరి కల్యాణం కోసం పని చేయగలరు. దేశాన్ని సంఘటితం చేయాలంటే - సంఘటన అనేది ముందు కుటుంబం నుండి ప్రారంభం కావాలి. ఇంటిలో క్లేశ, కలహ వాతావరణాన్ని ఉత్పన్నం చేసేవారు బయట శాంతి వచనాలు ఎలా వల్లించగలరు? ఇంటా, బయటా కాంతిని నింపేవాడే బుద్ధిమంతుడు, వివేకవంతుడు అవుతాడు. బయట కపటంతో వ్యవహరించేవారు ఇంట్లో అంధకారాన్ని దూరం చేయలేరు. సంఘటిత ఐకమత్య కాంతిని ముందు ఇంట్లో నింపాలి. తరువాత సమాజానికి, దేశానికి ఆ కాంతిని ఇచ్చి సమస్త మానవాళిని మంగళమయం చేయాలి.

వైదిక ఋక్కులు కేవలం వల్లెవేయడానికి కాదు. జీవితంలో అవలంబించడానికి. వైదిక సాహిత్యం పూజించడానికి, హారతు లివ్వడానికి కాదు. వాటి శిక్షణను మన స్వభావంగా మార్చుకోవాలి.

అఖండత, ఐకమత్య ప్రేరణలు ఏదో ఒక దేశానికి, జాతికి ఉద్దేశించినవి కావు. అఖిల మానవజాతి కోసం. కాబట్టి వేద వాక్యాలలో ఇలా చెప్పబడింది - "మాతా భూమి పుత్రో >హమ్ పృథివ్యా." అనగా పృథ్వి మనకు మాత. మనం ఆమె పుత్రులం. ఇలాంటి ఉదాత్త ఆలోచనా ధార మనిషి. మనిషి సహోదరులనే భావనను పెంపొందించి విశ్వ కల్యాణం కలుగజేస్తుంది. శ్యాకిర్ శ్యోర్‌పురి ఈవిధంగా చెబుతున్నాడు.

## మానవ ధర్మమే నిజమైన ధర్మం

**శేఖ్ జిస్ రాహ్‌సే హోకర్ గుజర్ హై అపనీ।**
**ఉస్ మే న కాబా హై, న కాశీ హై, న గిరిజా హై॥**

మానవ ధర్మమే నిజమైన ధర్మం. అది స్నేహం, క్షమ, శక్తి, శుచి, ఇంద్రియ నిగ్రహం, ధైర్యం, విద్య, సత్యం, శాంతం మొదలైన సద్గుణాలను ధారణ చేయడంతో బలాన్నిస్తుంది. వీటిని ధారణ చేయడమే ధర్మం. కనుక ఈ విశ్వమంగళ కారకమైన వైదిక ధర్మాన్ని ప్రచారం చేయాలి. మానవులు మానవత్వాన్ని ధారణ చేసి ఐకమత్యంతో, అఖండంగా ఉండేటట్లు ప్రచారం చేయాలి.

-అనువాదం : డి.వి.ఆర్.మూర్తి

H H H

**మన అంతః చైతన్యం నిష్పక్ష న్యాయమూర్తివలె మన పనులను చూస్తూ ఉంటుంది.**

సాధు సంత్‌ల జీవితాలు

# క్రియాశీల అనుష్ఠాన వేదాంతి
# సద్గురు మహర్షి మలయాళస్వామి

## క్రియాశీల యోగి

"కాషాయ వస్త్రం ధరించడం మాత్రమే సన్యాసం కాదు. ఆత్మ సన్యాసమే ప్రధానం. ఈ కాలంలో సన్యాసానికి అర్హతలేని వారు కూడ కాషాయాంబరధారులై ఆ పవిత్రాశ్రమం గౌరవానికి హానికరంగా ప్రవర్తిస్తున్నారు. ఉదర నిమిత్తమే వేషధారులైన వారెందరో ఉన్నారు. ఈ రోజుల్లో కాషాయ వస్త్రం ధరించిన మన సంఘంలోని వారనేకులు, దానిలో ఏదో మహిమ ఉందని తలచి 'మాకూ సన్యాసం కావా'లని కోరుతుంటారు. సన్యాసానికి తగిన విద్య, తపస్సు, జ్ఞానం లేకపోయినట్లయితే అది పరిహాస పాత్రమవుతుంది. విద్యావంతులైన బుద్ధిమంతుల కెందరికో నేటి సన్యాసుల మీద గౌరవం లేకపోవడానికి ఇదే కారణం. అత్యంత పవిత్రమైన వేషం ధరించి, అందుకు తగిన యోగ్యత లేని వారు పురాతన యతీశ్వరులను నిందల పాలు చేసిన వారవుతారు. దేహ సన్యాసం, దానికన్న ఆత్మసన్యాసం ఉత్తరోత్తరం శ్రేష్ఠం.''

సద్గురు మహర్షి మలయాళస్వామి వారి ఇటువంటి సందేశాలు వేలకొలది ఉంటాయి. జన్మించింది మలయాళ ప్రాంతంలోనే అయినా వారి భావజాలమంతా తెలుగులోనే వెలువడింది. తెలుగువారు భావశుద్ధి ద్వారా క్రియాసిద్ధి సాధించాలని తపించిన మహాత్ములు వారు. యథార్థ భారతి ఆధ్యాత్మిక మాసపత్రిక ద్వారా, వ్యాసాశ్రమంద్వారా కర్మ జ్ఞాన భక్తి మార్గాలను శంకరుల అద్వైతాన్ని అనుసరించి బోధించి ఈ ఆంధ్రప్రాంతాన్ని పునీతం చేసిన ఆంధ్ర శంకరులు వారు.

## బాల్యం - విద్యాభ్యాసం

కేరళలోని గురువాయూరు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం. దానికి దగ్గరే "ఎగ్గండ్యూర్" అనే చిన్న పల్లె. ఆ ఊరిలో కరియప్ప, నొట్టియమ్మ అనే పుణ్య దంపతులు. వారికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. వారి మూడవ కుమారుడే వేలప్ప. ఈ వేలప్పే ఆసంగానందస్వామిగా, మలయాళస్వామిగా ప్రసిద్ధి పొందిన సద్గురువు - మహర్షి - మహాదార్శనికులు - క్రియాశీల అనుష్ఠాన వేదాంతి, శుష్క వేదాంత తమోభాస్కరులు.

1885 మార్చి 27వ తేది గురువారం నాడు వేలప్ప జన్మించారు. అల్లరి చేయని యుక్తాహార విహారిగా చిన్నప్పటి నుండే యోగిగా పిలవబడ్డ అబ్బాయి. అయిదేళ్ళప్పుడు తల్లిదండ్రులు ఆంగ్ల పాఠశాలలో వేయించాలనుకొన్నారు. కాని వేలప్ప తనకా చదువు వద్దన్నారు. నారాయణాశ్రమంలో చేరి చదువుకొన్నారు.

ఈ ఆశ్రమాన్ని 1854లో తిరువనంతపురానికి సమీపంలోని చిన్న గ్రామంలో నారాయణ గురుదేవులు స్థాపించారు. హిందూ సమాజం మహోన్నతంగా వికసించడానికి ఆధ్యాత్మిక మార్గంలో కృషి చేసిన మహానుభావులు శ్రీనారాయణ గురుదేవులు. ఆధ్యాత్మిక జ్ఞాన జ్యోతి వెలిగించిన దివ్యజ్ఞాన సంపన్నులు వారు. ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడని ఎలుగెత్తి చాటిన సత్యసనాతనులు వారు. నిత్య నూతనులు వారు. ఆ నారాయణ గురుదేవుల శిష్యులు శ్రీసిద్ధ శివలింగ గురుస్వామి దగ్గరే అనేక విద్య లభ్యసించారు శ్రీవేలప్ప. సంస్కృతాన్ని దీక్షగా అభ్యసించి భాషా నైపుణ్యాన్ని

**సమస్యను అన్ని కోణాలనుండి పరిశీలించడం విజ్ఞత.**

సాధించారు. ఆ ఆశ్రమంలో ఉన్నప్పుడు ఈ క్రింది శ్లోక నియమాలు పాటించి వ్యవహరించారు శ్రీ వేలప్ప.

**ప్రథమం గురు కార్యంచ దైవకార్యం ద్వితీయకమ్ ।**
**తృతీయ మపి చాతిథ్యం స్వాత్మకార్యం చతుర్థకమ్॥**

దైనందిన కార్యక్రమాలలో మొదటిది గురుకార్యం, రెండవది దైవకార్యం, మూడవది అతిథికార్యం, నాల్గవది సొంతపని. ఈ నియమాలతో ఆశ్రమ జీవనం గడుపుతున్న వేలప్పను అందరూ "భక్తా" అని పిలచేవారు. గురువుగారు అతని దీక్షను గుర్తించి అతడిని దేవాలయ పూజావిధిని నిర్వహించడానికి నియమించారు. వేలప్ప నిజంగానే భక్తుడయ్యారు.

## గురుమంత్రోపదేశం

శ్రీ వేలప్పలోని నిష్ఠాభక్తిని గుర్తించి శ్రీ శివలింగ గురువు ఓ పవిత్ర దినాన మంత్రోపదేశం చేశారు. ఆ మంత్ర జపంతో పాటు యమ నియమానుష్ఠానపరుడై వ్యవహరించారు శ్రీవేలప్ప. ఈ నియమాలతో పాటు ఆధ్యాత్మిక గ్రంథాలెన్నో ఆ బాల్యంలోనే శ్రీవేలప్ప నిష్ఠగా అధ్యయనం చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు గురువుగారి అనుగ్రహానికి పాత్రులై మహామంత్రోపదేశాన్ని పొందగలిగారు.

ఆశ్రమంలో విద్యాభ్యాసం చాలా వరకు పూర్తయింది. శ్రీవేలప్ప ఉత్తర భారతం చూడాలనే, తీర్థక్షేత్రాల్ని సందర్శించాలనే తన కోరికను వెలిబుచ్చారు. మొదట ఇంటికి వెళ్ళి అస్వస్థురాలైన తల్లిని దర్శించుకోవాలనుకొన్నారు. శ్రీశివలింగ గురువు అనుమతించారు. బయలుదేరుతున్న శ్రీవేలప్పకు గురువుగారు ఈ విధంగా చెప్పారు-

"నాయనా! నీ వెక్కడికి పోయినా జీవిత ధర్మాలైన బ్రహ్మచర్యం, అహింస, సత్యం, అపరిగ్రహవ్రతం అనే చతుష్టయ సంపత్తిని ఏమరుపాటు లేకుండా కాపాడుకో. సమస్త ప్రాణుల్ని సమంగా చూడు. హృదయంలో కపట వర్తనకి తావివ్వకు....."

ఈ గురుమంత్ర బోధ ఆయన జీవితాంతం ఆచరణలో ఉన్నది. ఆయనను మహాత్మునిగా - మహర్షిగా - సద్గురువుగా తీర్చిదిద్దినది.

## ఎన్గండ్యూర్ నుండి గోతీర్థం వరకు

శ్రీవేలప్ప తల్లికి కుదుటబడిన తర్వాత తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఆయన మనస్సులో బుద్ధుడు, శంకరులు మెదలుతున్నారు. తాను సర్వసంగపరిత్యాగి కావాలనుకొన్నారు. కాలినడకనే పయనమయ్యారు. ఆయనకొక జోలె. అందులో భగవద్గీత, యోగదర్శనం, కఠోపనిషత్తు, జపమాల, విభూతి, కొన్ని కాగితాలు, కలం, చిన్నపాత్ర (ఈ పాత్ర కూడ వదలివేసి ఆ తర్వాత టెంకాయ బుర్రనే ఉపయోగించారు).

ఉడిపి, సుబ్రహ్మణ్యస్థలి, ధర్మస్థలి, గోకర్ణక్షేత్రం, పండరీపురం, నర్మద సమీపంలో ఓంకారేశ్వరం, ద్వారక, పంజాబులోని స్వర్ణమందిరం, ఆ తర్వాత కాశ్మీరం, కాశ్మీరంలోని వివిధ ప్రదేశాలు - కాలినడకనే ఇవన్నీ దర్శించారు శ్రీవేలప్ప.

ఆ తర్వాత హరిద్వారం, మథుర, బృందావనం, గోకులం అన్నీ దర్శించారు. హరిద్వారంలోని కన్యాగురుకులాన్నీ దర్శించారు. మహర్షి దయానందుల మార్గాన్ని పూర్తిగా అధ్యయనం చేశారు. దేశ పర్యటనలో ఎందరో సన్యాసులను, ఆశ్రమ స్థాపక నిర్వాహకులను కలిశారు. సంస్కృత, హిందీ భాషల ద్వారా తాను తెలుసుకోవాల్సినవెన్నో తెలుసుకొన్నారు. తానుకూడా ఒక గొప్ప ఆశ్రమాన్ని స్థాపించాలనే ఆలోచన శ్రీవేలప్పకు ఇక్కడే కలిగింది.

ఆ పిదప బదరికాశ్రమం, బ్రహ్మకపాలతీర్థం, అయోధ్య, ప్రయాగ, కాశి, గయ తదితర తీర్థక్షేత్రాల్ని దర్శించారు. గయలో వేదమంత్రోచ్చారణ పూర్వకంగా బ్రహ్మతర్పణం చేశారు.

**నిర్ణయించబడిన విధానాన్ని తనదిగా భావించి అమలు చేయడం కార్యకర్త లక్షణం.**

ఆ తర్వాత బుద్ధగయ, నవద్వీపం, కలకత్తా, పూరిజగన్నాథ క్షేత్రం దర్శించారు. ఆంధ్రప్రాంతంలో ప్రవేశించి, సింహాచలం, భద్రాచలం, శ్రీశైలం తదితర క్షేత్రాలు దర్శించారు. అలా పర్యటిస్తూ తిరుమలకు చేరారు.

ఆంధ్ర ప్రాంతంలో సాధువుల కాశ్రయమిచ్చే ఆశ్రమాలు లేవని చింతించారు. ఇక్కడొక ఆశ్రమం స్థాపించాలనే ఆశయం అప్పుడే వారిలో కలిగింది. తిరుమలనంతా పర్యటించి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకొని సేదదీరారు. ఆ తర్వాత అక్కడే ఉన్న గోగర్భ క్షేత్రాన్ని దర్శించి ఆకర్షితులయ్యారు. ఇక్కడికి మళ్లీ రావాలని నిర్ణయించుకొని దక్షిణదేశయాత్రలు పూర్తి చేసికోవాలని బయలు దేరి, అరుణాచలం, కంచి, శివకంచి, చిదంబరం, శ్రీరంగం దర్శించారు. ఈ ఆలయాలెందుకు ఉత్తర భారతంలోవలె ఆధ్యాత్మిక కేంద్రాలుగా విలిసిల్లడం లేదని ఆలోచించారు. పళనికి వెళ్ళారు. మధురకు వెళ్ళారు. రామేశ్వరం వెళ్ళారు. కన్యాకుమారి, అనంతశయనం క్షేత్రాలను దర్శించారు. "పరకల"లో ఉన్న శ్రీశివలింగ గురువు సన్నిధి చేరి ఆయన ఆశీస్సు లందుకొన్నారు.

ఈ మధ్యలో తండ్రి పోయారని తెలిసింది. ఎర్నండ్యార్ వెళ్లి తల్లి పాదాలకు ప్రణమిల్లి కొన్నాళ్లక్కడ తల్లి సేవలో ఉండి, ఒకనాటి రాత్రి ఎవరికీ చెప్పకుండా తిరుమల తిరుపతి వైపుగా సాగిపోయారు. 1913 డిసెంబర్లో గోగర్భ క్షేత్రం చేరి దానిని తన కార్యరంగానికి కేంద్రంగా నిర్ణయించుకొని తపస్సు కుపక్రమించారు.

## గోగర్భంలో తపస్సు

నాటి దేశ పరిస్థితులకు ఆయన హృదయం కదలిపోయింది. విదేశీయుల దమన నీతి కారణంగా తరిగిపోయిన సనాతన ధార్మిక నిలువల పునఃప్రతిష్ఠాపన జరగాలని ఆయన ఆశించారు. పరమేశ్వరుని దయకు అందరూ పాత్రులు కావాలని తపించారు. తపోదీక్షలో నిమగ్నమవుతున్న ఆ దశలో ఆయన నోట అలనాడు వాల్మీకి "మానిషాద...." వలె అప్రయత్నంగా ఈ క్రింది శ్లోకం వెలువడింది.

**అతీత వైరాగ్యమఖండ బోధః**
**కదానుమే సిద్ధ్యతి హే దయాళో ।**
**సమాధియోగస్య పరస్య నిష్ఠా**
**సర్వేషు భూతేషు సమత్వబుద్ధిః ॥**

- దయాంతః కరణుడవైన ఓ పరమేశ్వరా! తిరుగులేని వైరాగ్యం, అఖండబోధ, ఆత్మ సమాధి, యోగనిష్ఠ, జీవులన్నిటి ఎడ సమత్వబుద్ధి నాకు ఎప్పుడు సిద్ధిస్తాయో కదా!

భక్తివినమ్రంగా ప్రార్థించారు, అర్థించారు, అవేదనతో మనఃపూర్వకంగా అభ్యర్థించారు, తపోదీక్ష కుపక్రమించారు.

గోగర్భంలో వదిలిన పిండాల పిండి, శ్రీవేంకటేశ్వర స్వామి ప్రసాదావశిష్టం, భిక్షాన్నం, ఏవీ లేకుంటే ఉపవాసం ..... అన్నపానాలకై ఆరాటపడకుండానే లభించినదానితో తృప్తి పడుతూ ప్రతనిష్ఠాగరిష్ఠులయ్యారు శ్రీ వేలప్ప.

## మలయాళస్వామిగా వేలప్ప

శ్రీ స్వామి వారి సన్నిధికి వచ్చే ఈ యువ భక్తాగ్రణిని ఎందరో దర్శించుకొనేవారు. గోగర్భం వెళ్ళి సాగిలబడేవారు. ఆ స్వామి మలయాళ దేశం నుండి వచ్చారన్న సంగతి అందరికీ తెలిసిపోయింది. అందరూ మలయాళస్వామి అని పిలవడం ప్రారంభించారు. వేలప్ప పేరే ఎవరికీ తెలియకుండా పోయింది.

తపోనిష్ఠలో శ్రీమలయాళస్వామి ఉన్నారు. ఉపవాసం; మరెందుకో శ్రీవేంకటేశ్వర స్వామియే స్వయంగా వచ్చి ప్రసాదం ఇచ్చిపోయారు. అలనాడు వివేకానందునికి అందినట్లే ఇదీ అందింది.

## తపస్సు - ఆత్మసాక్షాత్కారం

శ్రీ మలయాళస్వామి వ్యక్తిత్వానికి అలరిన మహంతు

**విమర్శలో విచక్షణ తగదు.**

మఠం రామ లక్ష్మణదాసు ఆ తర్వాత కొన్నాళ్లకు ఆయనకు భోజన వసతి కల్పించారు. మఠానికి రావడం స్వామి మానివేస్తే, భక్తులు కొందరు ఆయనకు భోజనం అక్కడే గోగర్భంలో అందించడం ప్రారంభించారు.

భక్తులకు తమకు వచ్చిన తెలుగులోనే బోధలు చేస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన వారిలో సగానికి పైచిలుకు, శ్రీమలయాళస్వామి సన్నిధికి వచ్చి వారి బోధలు వినేవారు. తానాచరించిన ఆత్మపూజాష్టవిధ పుష్పాలివి అంటూ శ్రీస్వామివారు భక్తులకు ప్రబోధం చేసేవారు.

1.అహింస, 2.ఇంద్రియనిగ్రహం, 3.భూతదయ, 4.సహనం, 5.శాంతి, 6.తపస్సు, 7.ధ్యానం, 8.సత్యం. ఈ అష్టవిధ పుష్పాలతో మనిషి తనను తానే అలంకరించుకోవాలి అని వారు అనేకోదాహరణలతో వివరించేవారు.

శ్రీస్వామి కేవల గోగర్భంలోనే గాక తుంబురుతీర్థం, సనకసనందన తీర్థం, కుమారధారాతీర్థం, రామకృష్ణతీర్థం, శ్రీవైకుంఠ తీర్థం మొదలైన అనేక తీర్థాలలో తపస్సు చేశారు. క్రూరమృగాలు కూడా వారి సన్నిధిలో విశ్రమించేవి. తపస్సు గురించి ఎవరైనా అడిగితే భయం నుండి తొలగించమని పరమాత్మను వేడుకొంటున్నానని, జన్మరాహిత్యాన్ని కోరుకోనని, ఇతరులకు సేవ చేయడానికి, జ్ఞాన ప్రచారానికి, భేదదృష్టిని దూరం చేయడానికి నాకు అనేక జన్మలివ్వవలసినదని భగవంతుణ్ణి కోరుకొంటానని వివరించేవారు మహర్షి మలయాళస్వామి.

మఠం ద్వారా సంస్కృత బోధన కొనసాగించే యత్నం చేసారు శ్రీస్వామివారు. తిరుమలలో భిక్షాటన చేస్తున్న పిల్లల్ని సమీకరించి మఠంలో విద్య నేర్పించే ప్రయత్నం చేశారు. గోగర్భంలో ఓ సంస్కృత పాఠశాల కూడా తెరిచారు. పిల్లలు క్రమశిక్షణకు ఒదగలేక పారిపోయారు. అయ్యో సంస్కరణోద్యమం విఫలమైందే అనుకొన్న శ్రీస్వామి తర్వాత వ్యాసాశ్రమ స్థాపన ద్వారా విజయం సాధించారు.

నెల్లూరు జిల్లా కొటంబేడులో కలరా వ్యాపించగా, శ్రీస్వామి వారు వెళ్లి అక్కడి దేవాలయాన్ని శుభ్రం చేయించి, వారం రోజులున్నారు. ఆ ఊరి నుండి కలరా పారిపోయింది. ఆయన పశువ్యాధిని రూపుమాపారు. గోగర్భంలో 9 సం॥లున్నారు. 1919లో శుష్కవేదాంత తమో భాస్కరమనే అద్వితీయ తాత్విక గ్రంథం రచించారు. తిరుమలలో పుట్టుకతోనే వర్ణం అని వాదించే కొందరికి గుణకర్మ ఫలితాలే జన్మానుబంధాలు అని బోధించారు.

"సర్వజనులకు వారి గుణానుసారముగా అన్ని విద్యలలో ప్రవేశము లేకపోవుట, కల్పవృక్షముల చేతను, కామధేనువుల చేతను, చింతామణుల చేతను ప్రకాశవంతమైన హిమాచలము నుండి సేతు పర్యంతము విస్తరించి యుండు ఈ మహాభూఖండము పరుల కధీనమై ఈ దేశవాసులు బానిసలై పోవుటకు కారణమైనది.."

జనుల యోగ్యత ననుసరించియే అన్ని కార్యములు జరుగవలసియున్నది అని, దేశకాల పరిస్థితుల ననుసరించి, ఈ దేశీయుడు సత్వ సత్యధర్మనిష్ఠాపరుడై మెలిగినప్పుడే దేశము స్వాతంత్ర్యాన్ని సముపార్జించగలదని శ్రీస్వామి వారు అనేక సందర్భాలలో నొక్కివక్కాణించారు.

తొమ్మిది సం॥ల తపస్సు ద్వారా పరమార్థ సిద్ధిని పొందలేదే అని మొదట శ్రీస్వామివారు నిర్వేదానికి గురై ఆత్మహత్యకు సిద్ధమయ్యారు. మరో మూడు రోజులలో పరమార్థ సిద్ధి లభించకపోతే ఆత్మత్యాగం చేస్తానని వారు దీక్షలో ఉండగా, 12 సం॥ల బ్రహ్మ నిష్ఠ పూర్తి చేయాలని దివ్యవాణి పలికింది. దానితో వారు మరో 3 సం॥లు గడిపారు. ఆత్మసాక్షాత్కారాన్ని పొందారు.

### శ్రీవ్యాసాశ్రమం స్థాపన

శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించే భక్తు లెందరో తప్పనిసరిగా శ్రీస్వామివారిని కూడా దర్శించి వారి

**లక్ష్యం లేని వ్యక్తి చుక్కాని లేని నావ.**

బోధామృతాన్ని గ్రోలేవారు. క్రమంగా కానుకలు కూడా సమర్పించడం సంప్రదాయమైంది. అపరిగ్రహ వ్రతంలో ఉన్న స్వామి ద్రవ్యాన్ని స్పృశించక హుండీలోనే వేయించేవారు.

కాని శ్రీస్వామి వారి వర్ణాశ్రమ ధార్మిక భావాలను వ్యతిరేకించే కొందరు ఆయనను తిరుమల నుండి పంపించాలనే యత్నాలు చేశారు. మహంతు చేత ఉత్తరం వ్రాయించారు. శ్రీస్వామి తిరుమల నుండి బయలుదేరారు. తిరుపతికి కాలినడకన వచ్చారు. తిరుపతి ప్రజలు మేళ తాళాలతో ఎదుర్కొని అక్కడే ఉండవలసినదని కోరారు. ఇంకా ఎందరో తమ తమ గ్రామాలలో ఆశ్రమ స్థాపనకు తగిన వనరులు కల్పిస్తామని ఆహ్వానించారు.

అయితే శ్రీమలయాళ స్వామివారు అప్పటికే కొందరు శిష్యుల సహకారంతో ఏర్పేడు గ్రామ కాశీబుగ్గ స్థలంలో శ్రీవ్యాసాశ్రమ స్థాపనకు నిర్ణయం తీసుకొన్నారు.

3 జూన్ 1926 నాడు వారు తిరుమలను వదలి పెట్టారు. గోగర్భంలో 12 సం॥ల ఐదుమాసాల, పదమూడు రోజుల తపస్సు ముగిసింది. ఆత్మ సాక్షాత్కారం జరిగింది. భగవంతుని ఆదేశమా అన్నట్లుగా స్వామి కొండ దిగారు. జనంలోకి వెళ్లిపోయారు.

ఏర్పేడులోని కాశీబుగ్గ ప్రదేశంలో శ్రీ వ్యాసాశ్రమం స్థాపించారు. ప్రతి ఆషాఢశుద్ధ ఏకాదశికి అక్కడ ఉత్సవం జరుగుతున్నది. ఆనాటి శ్రీకాళహస్తి పరిపాలకులు శ్రీకుమార వెంకట లింగంనాయని ఆశ్రమ స్థలాన్ని శ్రీస్వామివారికి సమర్పించారు. ఆ పరిసరాల్లో జంతుబలి జరిగేది. మాంస భక్షణమూ ఉండేది. ఆశ్రమ స్థాపనతో, శ్రీస్వామి వారి బోధలతో బలి ఆగిపోయింది. ఆశ్రమంలో కొంతకాలంపాటు శ్రీస్వామివారు భక్తులకు మేలు జరగాలని తీర్థం ఇచ్చేవారు. విభూది నిచ్చేవారు. అయితే ఈ భౌతిక చికిత్సలు కూడదని నిర్ణయించుకొని, పారమార్థిక చికిత్సే సర్వోత్తమమైందని భావించి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు.

## అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు

శ్రీ మలయాళ స్వాములవారు భక్తి జ్ఞాన ధ్యాన ధర్మ ప్రచారం నిమిత్తం 1927 ఫిబ్రవరిలో యథార్థ భారతి మాసపత్రిక స్థాపించారు. బ్రహ్మవిద్యా ప్రచారమే ఈ పత్రిక పరమధ్యేయం.

వందలకొలది సనాతన వేదాంత సభలు నిర్వహించారు. ఆంధ్రప్రాంతమంతటా పర్యటించి ధర్మ ప్రచారం చేశారు. వారి పిలుపు మేరకు భక్తులు కొన్నిచోట్ల సనాతన ధర్మ పరిపాలన సేవా సమాజాలను స్థాపించారు.

సనాతన వేదాంత జ్ఞాన సభలను స్థాపించి నిర్వహించారు. సంస్కృతభాషా ప్రచారానికి పాఠశాల ప్రారంభించారు. ఇది 1928 ఫిబ్రవరి 2వ తేదీన స్థాపించబడింది.

1936 ఫిబ్రవరి 2వ తేదీన శ్రీస్వామి వారు తమ గురువులైన శ్రీ సిద్ధశివలింగ గురుస్వాముల గురుభాయి అయిన శ్రీ శంకరానంద యతివర్యుని దీక్షదాతగా ఎన్నుకొని తురీయాశ్రమంలో (సన్యాసాశ్రమంలో) అడుగుపెట్టారు.

ఆశ్రమం గిరి సంప్రదాయాన్ని పాటిస్తున్నది. ఆ కారణంగా శ్రీస్వామివారి దీక్షానామం ''శ్రీశ్రీశ్రీ అసంగానంద గిరిస్వాము''లయింది. అయినా వారు శ్రీమలయాళ స్వాములుగానే జగత్ప్రసిద్ధినొందారు.

ఆయన వందలకొలది గ్రంథాలు వ్రాశారు. కలిరాజే ఆయన అనుయాయి అయ్యారు. బ్రహ్మవిద్యా పాఠశాల వికసించింది. కన్యాగురుకులాశ్రమాన్ని స్థాపించారు. 77 సం॥ల వయస్సులో 1962 ఏప్రిల్ 3వ తేదీన తుది సందేశాన్నందించి బ్రహ్మైక్యాన్ని పొందారు.

- ఆచార్య కసిరెడ్డి

H H H

**మూర్ఖుని మొదటి లక్షణం అహంకారం.**

వ్యక్తి నిర్మాణం

# లోపలి మనిషిలో మార్పు

ఒక ప్రపంచంలో ఎన్నో ప్రపంచాలు ఉన్నట్లే మానవునిలో ఎందరో మానవులు. మానవుని మనస్సులో ఒక దానిమీద ఒకటిగా పొరలున్నాయి. ఒక పొర శుభకరం. రెండవది అశుభకరం. కనుక మానవుడేమిటి? అతని స్వభావమొకటేనా అని ఖచ్చితంగా చెప్పలేము. ప్రతి వ్యక్తిలోనూ మరొక వ్యక్తి దాగి ఉన్నాడన్న సంగతి మనకు తెలియదు. మనలో రహస్యంగా ఉన్నది ఆంతరిక వ్యక్తిత్వం.

ఉన్నతమైన, సంస్కారవంతమైన నైతిక జీవితం గడపాలనీ, భజనలూ పూజలు చేయాలనీ, వ్రతాలూ, ఉపవాసాలూ, సత్సంగ స్వాధ్యాయాలూ చేయాలనీ పలువురు ఉపన్యసిస్తారు. కానీ ఆశ్చర్యపరచే విషయమేమిటంటే - అంతరంగంలో వారి ఆలోచనలు చాలా నీచంగా రాక్షస ప్రవృత్తులతో నిండిఉంటాయి. సాత్విక ప్రవృత్తిని కనబరుస్తున్న మనస్సులో ఈ దుర్భావనలెలా వచ్చాయో మనం విశ్వసించలేకపోతాం.

ఈ దుర్భావనలు రహస్యమైన అంతరిక వ్యక్తిత్వం నుండి ఉత్పన్నమౌతాయి. ఉన్నతమైన వ్యక్తిత్వం ఒకటి చెప్తే అంతరిక వ్యక్తిత్వం దానికి వ్యతిరేకమైన ఆజ్ఞల నిస్తుంది. పైనున్న మనస్సు సంయమమును బోధిస్తే అంతరంగ వ్యక్తిత్వం విలాసవంతమైన ప్రవృత్తిని ఉత్పన్నం చేస్తుంది. ఈ రెండు వ్యక్తిత్వాలూ నిరంతరం ఘర్షణ పడుతూనే ఉంటాయి. ఒకటి మనిషిని శుభకర్మలవేపు ప్రేరేపిస్తే, మరొకటి అశుభకార్యాలవేపు లాగుతుంది. పైపొర జ్ఞానం, వైరాగ్యం, సంయమనం, తేజస్సులతో నిండి ఉంటుంది. అడుగు పొర చెడు, అసంయమనం, ఆవేశాలతో నిండి ఉంటుంది.

మానవుడు కనబడడానికి ఒకడే. కానీ అనేకమైన వ్యతిరేక తత్వాల సమ్మేళన మతడు. మాయతో నిండిన ఒక బొమ్మ.

ఈ అంతర్గత ప్రపంచమే అన్ని సమస్యలకూ, కష్టాలకూ మనోక్లేశాలకూ మూలకారణం. మనలోని పరివర్తనలన్నీ ఈ అంతర్గత వ్యక్తి మాయాజాలమే.

డాక్టర్ కోయూ "సెల్ఫ్ మాస్టరీ థ్రూ కాన్షస్ ఆటో సజెషన్'' అనే తన పుస్తకంలో మానవుడు తనలోని అంతర్గత పొరలను శుభ్ర పరచుకొని వాటిలో విశ్వాసాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ ఉత్పన్నం చేయాలని వ్రాశారు. పైపొరకు సంకేతాన్ని ఇచ్చినందువల్ల విశేషమైన ప్రయోజనమేమీ ఉండదు. మానవుడి అంతర్గత పొరలే వాస్తవానికి అతని ఉన్నతికి ఆధారశిలలు కాగలవు. బయటకు కన్పించే కష్టాలు అంతర్గత కాఠిన్యాల ఛాయలు మాత్రమే, లోపలి పొరల యందు శక్తిని ఉత్పన్నం చేయగలిగిన మానవుడు అపారమైన బలాన్ని అనుభవించగలడు. కష్టాలను అధిగమించడానికి అతనికి శక్తి ఇచ్చటినుండే లభ్యమౌతుంది.

అంతరంగ పొరలలో ఆత్మవిశ్వాసాన్ని అత్యధికంగా ఉత్పన్నం చేయాలి. పై పై విశ్వాసం లాభం లేదు. అంతర్గత ప్రేరణయే నిజమైన మానవుణ్ణి తయారు చేయగలదు. మానవుని నిర్మాణం అతని వస్త్రధారణ, ఆడంబరాల వల్ల జరుగదు. అంతరంగంలోని అతని విశ్వాసం, భావనలు, ప్రేరణలవల్ల జరుగుతుంది.

-అనువాదం: కె.అరవిందమ్మ

మౌనం కలహానికి నివారణ.

బోధ కథ

# మహిమల ప్రదర్శన తగదు

రాజధానికి దూరంగా అడవి దాపున కొన్ని వనవాసుల గ్రామాలున్నాయి. వాటిలో కొద్దిమంది విద్యావంతులు కూడా ఉన్నారు. కాశ్మీర్ నుండి వచ్చిన కొన్ని బ్రాహ్మణ పండిత కుటుంబాలు అక్కడ చాలాకాలం నుండీ ఉంటున్నందున వనవాసులకు ఆమాత్రం విద్యాగంధం అంటింది.

ఎవరి అపరాధం వల్ల, లేదా అపకర్మవల్ల సంభవించాయో గాని గ్రామస్థులను భయ భ్రాంతులను చేసే దుస్సంఘటనలు అక్కడ జరుగసాగాయి. అడవిలోని పులి ఒకటి గ్రామాల్లోకి రావడం మొదలుపెట్టింది. ఏదో పాపకర్మకి ఫలితమే ఇది, లేకుంటే ఇంతవరకూ అడవి జంతువేది గ్రామాల్లోకి వచ్చిన జాడ లేదు. ఈ పవిత్ర ప్రదేశంలో మనుషులకు శత్రువుగా మారిందీ లేదు. ఎవరి జీవితాలు వాళ్ల హద్దులు దాటకుండా నిశ్చింతగా సాగించుకుంటుండగా పులి అడవి దాటి జనపదాల వైపుకి వస్తూ గోశాలల నుండి పశువులనే కాక ఇద్దరు ముగ్గురు మనుషులను కూడా కబళించింది.

సమాచారం తెలుసుకున్న పాలకులు అధికార్లను పంపారు. కానీ పులి చాలా తెలివైంది. ఎన్ని ఉచ్చులు పన్నినా వేటగాళ్లకు పట్టుబడడం లేదు. పైపెచ్చు మూడుసార్లు చేసిన ప్రయత్నాల్లో నలుగురు రాజభటులు గాయపడ్డారు. ఒకడు మృత్యువుకి ఆహారమయ్యాడు.

“అడవిలోకి ఎవరో రాక్షసుడు ప్రవేశించాడు. వాడు జంతువు రూపం దాల్చి మనుషుల్ని, పశువుల్ని తింటున్నాడు. వాడినెవరూ పట్టుకోలేరు'' - అంటూ ప్రజలు రకరకాల కథలు అల్లి చెప్పుకోసాగారు.

మరోమార్గమేదీ కనపడక ఆగ్రామాల ప్రజలంతా కలసి మహాసిద్ధుడిని శరణు కోరాలని నిశ్చయించుకున్నారు. ఎనభై నలుగురు సిద్ధులలో మొట్టమొదటి సిద్ధుడు సరహపా (శ్రీనాగార్జున). ఆయన అప్పుడు సాధనకోసం ఆ అడవిలో నివసిస్తున్నారు. వనవాసులంతా కలసి ఆశ్రమానికి వచ్చారు. ''మహాపురుషుల ఉనికి చేతనే ఆటంకాలన్నీ తొలగిపోతాయని అంటారు. ఆపదలు దరిచేరవని అంటారు. ఇప్పుడు మేము ఆర్తులమై మీ శరణు కోరి వచ్చాము. నిరక్షరాస్యులము, అజ్ఞానులము అయిన మా ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మేము ఓడిపోయాము. మమ్మల్ని రక్షించే భారం మీదే''- అని వారు ఏకకంఠంతో మొరపెట్టుకున్నారు.

పరమ ప్రజ్ఞాశాలి, త్రికాలదర్శి, అమితశక్తి సంపన్నుడైన సరహపా తన విశాల నేత్రాలను ఎత్తి వారివైపు చూశారు. అంతా అర్థం అయిందన్నట్లు తల త్రిప్పారు. ''కన్హకి దీనిగురించి తెలిసిపోయినట్లుంది. అతడు ఆ ప్రయత్నంలోనే ఉన్నాడు. అడుగో వాడు రానే వస్తున్నాడు'' - అన్నారు.

గ్రామస్థులు మహాసిద్ధుడు దృష్టి సారించిన వైపుకి తిరిగి చూశారు. దూరంగా చెట్లమధ్య నుండి వస్తున్న ఒక మానవాకృతి కనపడింది. అతడు పులిమీద కుర్చుని ఉన్నాడు. వారు ఆశ్చర్యంతో అటువైపే చూడసాగారు. పశువులు కాచుకునే పిల్లలు దున్నపోతు మీద కూర్చుని స్వారీ చేస్తున్నట్లు పులివీపు మీద రెండుకాళ్ళూ వేళ్లాడేసిన జటాజూటధారి అయిన ఆ యువకుడు మరెవరో కాదు మహాసిద్ధ సరహపా ప్రియశిష్యుడు కన్హపా. అతడిని ఎరగని వారెవరున్నారు?

పులి మీద నుండి క్రిందకు దూకి అతడు గురుదేవుల వద్దకు వచ్చాడు. భూమికి తల ఆనించి, రెండు చేతులూ

**ప్రతిఫలాపేక్ష లేకపోవడం ధన్య జీవిత లక్షణం.**

జోడించి ప్రణామం చేశాడు. "దీన్ని తీసుకువచ్చాను. తమరి శ్రీచరణాలు ఏశిక్ష విధిస్తే దానిని స్వీకరించడానికి ఇది సిద్ధంగా ఉంది'' - అన్నాడు వినయంగా. పులి తల దించుకొని దూరంగా నిలబడి ఉంది. భారీ ఆకారంలో ఉన్న పెంపుడు కుక్కలాగా పరమశాంతంగా ఉన్నది.

మహాసిద్ధుడు గ్రామస్థులవైపు చూశారు "ఇది ఉపద్రవాలు సృష్టించిన మాట యథార్థమే. అడవి జంతువు కావడాన ఇది తన స్వభావంలోని దోషంవల్ల హింసకు పాల్పడింది. కన్హా దీన్ని తన వాహనంగా చేసుకున్నాడు. దీనికి సాధుత్వం సిద్ధించింది. కనుక ఈ సారికి మీరంతా దీన్ని క్షమించండి. అది సముచితమని నాకు అనిపిస్తున్నది''- అని వాళ్ళకు నచ్చచెప్పి ఆయన పులివైపు దృష్టి సారించారు. అది నెమ్మదిగా అడుగులు వేస్తూ మహాసిద్ధుని సమీపానికి వచ్చింది. వారి చరణాలపై తలపెట్టుకుని పడుకుంది.

జనం ఆశ్చర్యానందాలతో చేసిన జయఘోష మిన్నంటింది. "మహాసిద్ధునికీ జై" అంటూ వారు జయజయ ధ్వానాలు చేశారు.

ఆ జయఘోష ధ్వని మందగించనేలేదు. ఇంకా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. కొన్ని నెలలు గడిచాక "మహాసిద్ధునికి జై! కన్హాపాకి జై!'' - అంటూ జనం అమితోత్సాహంతో జయనాదాలు చేయసాగారు. జనుల భక్తి శ్రద్ధల ఆవేగం కూడా నదీ ప్రవాహం లాంటిదే. అది ఉప్పొంగిందంటే దాన్ని నిలువరించడం అంత తేలిక కాదు. రాజ భటులు జన సమూహాన్ని నియంత్రించలేక అవస్థపడుతున్నారు.

నిజానికి ప్రజల ఈ ఉత్సాహం, శ్రద్ధాపూర్వకమైన ఈ ఆవేశం సమంజసమైనవే. మహాసిద్ధుని ప్రియశిష్యుడు కన్హాపా వారికి మరొకసారి ప్రాణదానం చేశాడు. మరి వారు కృతజ్ఞతలు తెలుపకుండా ఉండగలరా?

కాశ్మీరు కనుమలు చాలా లోతుగా ఉంటాయి. పర్వతాలమీద నుండి దూకే పెద్ద పెద్ద జలపాతాలు కశ్యప మహర్షి కృపవలన గమనం మార్చుకున్నాయి. దానితో అది మనుషులకు ఆవాసయోగ్యమైంది. అయినా ఆ కనుమలో చిన్న చిన్న నీటిధారలు, కుండాలు, సెలయేళ్లు ఎక్కువే. ఎప్పుడైనా పెద్ద వర్షం కురిస్తే ఆ నీరంతా బయటకు పోవడానికి ఏర్పాటు చేశారుగాని, అది చాలా చిన్నది. అందుచేత చిన్న వర్షం పడ్డా ఆ ప్రాంతం చెరువులాగా అయిపోతుంది. అటువంటిది మూడురోజులుగా రాత్రీపగలు ఎడతెరపిలేని వర్షం కురియ సాగింది. జలప్రళయం వచ్చిందా అన్నట్లు కనుమంతా నీటితో నిండి పోయింది.

మహాసిద్ధుడు తన ఆశ్రమంలో తపస్సమాధిలో ఉన్నారు. నెమ్మదిగా వర్షపు నీరు ఆశ్రమంలోపలికి కూడా పొంగి రాసాగింది. కన్హాపా చటుక్కున లేచి నిలబడ్డాడు. అదే సమయంలో శరణు కోరడానికి ఆశ్రమానికి వచ్చిన గ్రామ ప్రజలు కన్హాపా మొగం చూసి ఆశ్చర్య చకితులైనారు. స్వయంగా సూర్యుడే దిగివచ్చాడా అన్నంత తేజోమయంగా ఉన్నది ఆముఖ మండలం. కన్హాపా ఆశ్రమం బయటకు వచ్చి తలఎత్తి ఆకాశంనిండా కమ్ముకొని ఉన్న కారు మేఘాలను చూశాడు. "హుం'' అంటూ హుంకారం చేశాడు. కొండల్లాటి కారుమేఘాలు చెల్లాచెదరయ్యాయి. మరి రెండు నిముషాల్లో కనుమంతా బంగారు రంగు నీరెండ పరుచుకున్నది. ఆకాశం నిర్మలం అయిందిగాని కురిసిన నీరు యథాతథంగానే ఉన్నది. మునిగిపోయిన ఇళ్ల కప్పులమీద పెద్దా చిన్నా, పిల్లాపాపా అంతా గోలగోలగా ఉన్నది ఎక్కడ చూసినా. ఇళ్లలో సామాను ఏమైందో, ఏమేమి కొట్టుకుపోయాయో పట్టించుకునేవారు లేరు. ముందు ప్రాణాలు దక్కితే అంతే చాలని ఇళ్లకప్పులమీదకు చేరారంతా.

అగస్త్య మహర్షి సముద్రంలోని జలాన్నంతా ఒక్క గుక్కలో త్రాగేశాడని చెప్పుకోవడం విన్నాంగానీ అదెలా సాధ్యమైందో అర్థం కాదు. కానీ ఇప్పుడు కళ్లెదుట జరుగుతున్నదేమిటి? కన్హాపా తన కుడిచేయి పైకెత్తి ప్రకృతికి

**ఇంటింటా సదాలోచనల వ్యాప్తి ఈ పృథివికి స్వర్గప్రాప్తి.**

ఏదో సంకేతం ఇచ్చాడు. అరచేతి వేళ్లు ఏదో ముద్రను పట్టాయి. నీరంతా ఆవిరిగా మారి పైకెగిరిపోయిందా? అంత నీరు ఎటువైపు పోవడానికీ దారిలేదు మరి. లేక - అగస్త్య మహర్షిలా కన్హపానే అదంతా త్రాగేశాడా? ఏమి జరిగిందో తెలియదు. కన్హపా చేయి పైకెత్తి ఆశ్రమం బయట అలాగే నిలబడ్డాడు. కొద్దిసేపట్లో నీరంతా ఇంకిపోయి తడినేల మాత్రం మిగిలిపోయింది. అప్పుడు కన్హపా తన చెయ్యి క్రిందికి దించి ఆశ్రమం లోపలికి వెళ్లాడు.

రాజభటులు, అధికారులు ఆనందించారు. ప్రజలంతా ఉప్పొంగి శ్రద్ధాభక్తులతో జయజయధ్వానాలు చేశారు. కాశ్మీర్ రాజు మహా సిద్ధునికి, మహామహిమాన్వితుడైన ఆయన శిష్యుడికి వందనం చెయ్యడానికి స్వయంగా విచ్చేశాడు. ఆ జయఘోష కోలాహలానికి మహాసిద్ధుడు సమాధి స్థితినుండి మేల్కొన్నారు.

రాత్రి రెండవ జాము. అప్పటికి జనుల కోలహాలం సద్దుమణిగింది. ఎవరిళ్లకు వాళ్ళు వెళ్లిపోయారు. మహాసిద్ధుడు శిష్యుడిని దగ్గరకు రమ్మని పిలిచారు. కన్హపా గురువుగారిని సమీపించి చేతులు కట్టుకొని నిలబడ్డాడు. మహాసిద్ధుడు కన్హపా ముఖంలోకి స్థిరంగా చూశారు.

"నువ్వు చేయకూడని పని చేశావని నేను అనడం లేదు. అయితే, సాధన స్వరూపం, దాని సఫలత సమష్టి విధానాల్లో పరివర్తన చేసే శక్తిని పొందడంలో ఉంది. ఇలా ప్రకృతిలో జోక్యం చేసుకోవడంలో లేదు. నువ్వు దారితప్పుతున్నావని మాత్రం చెపుతున్నాను.''- అని చాలా నెమ్మదిగా ఒక్కొక్కమాటా పలికారు.

నగరం మొత్తం ఈరోజు ఎవరినైతే మహాసిద్ధునికి మరో రూపంగా ఎంచి గౌరవించిందో ఆ కన్హపా తలవంచుకొని అపరాధిలాగా నిలబడ్డాడు. మిగిలిన శిష్యులు బిక్కు బిక్కుమంటూ చూడసాగారు. గురుదేవులు తనకు అత్యంత ప్రియమైన శిష్యునిపట్ల ఎందుకంత నిర్దయగా ఉన్నారో వాళ్లకు అర్థంకావడం లేదు.

"కన్హపా చేసే పనుల్లో స్వార్థంగాని, అహంకారంగాని కనపడదు. అతడేమైనా చేశాడు అంటే, అది తప్పక ఇతరుల క్షేమం కోసమే అవుతుంది. అలాంటప్పుడు గురుదేవులేమిటి ఇలా విమర్శిస్తున్నారు? తప్పు పడుతున్నారు.'' అయోమయంగా ఉంది వాళ్లకి.

కన్హపా ఆత్మగ్లానితో క్రుంగిపోయాడు. "దేవా! దయచూపండి! దయ చూపండి!! దయ చూపండి!!!'' - అంటూ దుఃఖంతో సరహపా పాదాల మీద వాలిపోయాడు. పసిపిల్లవానిలా వెక్కివెక్కి ఏడ్వసాగాడు. తలఎత్తి ఎవరి వైపూ చూడలేకున్నాడు. "వత్సా!'' సరహపా గద్గదస్వరంతో పిలిచారు. శిష్యుని తల, వీపు నిమురుతూ వాత్సల్యం నిండిన గొంతుతో ఇలా అన్నారు-

"సాధన తత్వం, దాని సిద్ధి అంటే ఈశ్వరుని పట్ల ప్రేమ కలిగి ఉండడం. అంతేకాని మహిమలు ప్రదర్శించే సిద్ధి, ఆ విధానంలో పటాటోపంతో నిండిన ఆచరణ సిద్ధిసాధనలో బాధక తత్వాలయి, వ్యక్తిని అవినీతికి గురిచేస్తాయి. ఈశ్వరుని పట్ల ప్రేమ చూపించడమంటే అర్థం ప్రాణులపట్ల కరుణ కలిగి ఉండడం. లోకంపట్ల కరుణా మయుడుగా ఉండాలంటే ప్రతిమనిషిలో సద్భావనలు, సత్ చింతన, సత్కర్మలను ప్రేరేపించడం. జన హృదయంలో వాటి పట్ల శ్రద్ధా, నిష్ఠా వెల్లివిరిస్తే అప్పుడు నీ సాధన సఫలమయిందని తెలుసుకో. సిద్ధి లభించిందని తెలుసుకో.''

మహాగురువు సరహపా దివ్యవచనామృతం కన్హపా మనసులోపలి పొరల్లో సిద్ధి నిజస్వరూపాన్ని సాక్షాత్కరింప చేసింది. అతడు జన జీవనంలో ఆదర్శాలు సంవేదన అనే సరితను ప్రవహింపజేయడానికి నడుం కట్టాడు.

- అనువాదం: విజయకుమారి

H H H

**నింద, అసూయ అసుర గుణాలు.**

## సాధన విజ్ఞానం

# మనిషి నుదిటిలో మూడవ కన్ను

శివుడు మూడవ నేత్రంతో మన్మథుణ్ణి దహనం చేయడం, ప్రళయాన్ని సృష్టించే దావానలాన్ని ఉత్పన్నం చేయడం పురాణాలలోని గాథ మాత్రమే కాదు. ఆ దివ్య సంఘటనలు ఒక వైజ్ఞానిక సత్యాన్ని, ఒక యథార్థాన్ని తెలియజేస్తున్నాయి. ఈనాటి ఆధునిక విజ్ఞానం మానవుని మూడవ కన్ను అస్తిత్వాన్ని అంగీకరిస్తున్నది. వైజ్ఞానిక భాషలో ఈ కన్నును 'పీనియల్ గ్రంథి' అంటారు. ఈ గ్రంథి సరిగ్గా తృతీయ నేత్రం అనగా ఆజ్ఞాచక్రం వెనుక పిట్యూటరీతో కలసి ద్విదళ కమల రూపంలో ఉంటుంది. ఈ గ్రంథినుండి స్రవించే రసాయనం అద్భుతమైనది. మూడవ కన్ను అతీంద్రియ శక్తులు కలిగి ఉంటుంది. త్రాటకం ద్వారా తృతీయ నేత్రంలోని అపరిమిత శక్తులను జాగృతం చేయవచ్చు.

### మూడో కన్ను కల్పన కాదు

భారతీయ ఆర్ష గ్రంథాలలో ఈ నేత్రం గురించి విస్తృతమైన వివేచన లభిస్తుంది. ఋషులు ఈ నేత్రాన్ని జాగృతం చేసుకొని అదృశ్య జగత్తులోని రహస్యాలను మామూలు కళ్ళతో చూసినట్లు చూసేవారు. అందువలన భారతీయ పురాణ శాస్త్రాలలో ఆజ్ఞాచక్ర జాగరణ, తృతీయ నేత్రం తెరుచుకోవడం, దాని మాహాత్మ్యం. ప్రతిఫలంలను గురించి విస్తృతంగా వర్ణించారు. దమయంతి తన శాపంతో పులిని భస్మం చేయడం, గాంధారి దుర్యోధనుని వజ్రకాయునిగా చేయడం, ధృతరాష్ట్రునికి సంజయుడు మహాభారత యుద్ధ దృశ్యాలను చూపించడం, కృష్ణుడు తన విశ్వరూప దర్శనం కోసం అర్జునునికి దివ్య నేత్రాన్ని ప్రసాదించడం - ఇలాంటి అనేక ఘటనలను కథలు, కల్పనలుగానే భావించలేము. వీటిలో వైజ్ఞానిక సత్యాలు, రహస్యాలు దాగి ఉన్నాయి. మెస్మరిజం, హిప్నాటిజంల ద్వారా ఈ నేత్ర సూక్ష్మ దృష్టిని వృద్ధి చేయడం జరుగుతుంది. శరీర శాస్త్రజ్ఞులు ఒకటిన్నర, రెండు మిల్లీగ్రాముల కనురెప్పలతో సమానమైన ఈ రచనను పీనియల్ గ్రంథి అంటారు. ఇందులో ఒక పారదర్శక ద్రవం నిండి ఉంటుంది. ఇందులో ప్రకాశాన్ని అనుభూతికి తెచ్చే నాళాలు ఎక్కువగా ఉంటాయి.

### పీనియల్ గ్రంథి రహస్యాల పుట్ట

మానవులలో పీనియల్ గ్రంథి అవికసిత స్థితిలో ఉంటుంది. ఇతర వెన్నెముకగల చిన్న చిన్న జంతువులలో కూడ ఇది అవికసిత లేదా అల్ప వికసిత రూపంలో ఉంటుంది. ఇది దృశ్యంతోపాటు వాసన, శబ్ద, ఉష్ణ తరంగాలను గ్రహించగలుగుతుంది. వీటిని సామాన్యంగా ముక్కు, చెవులు, చర్మం ద్వారానే గ్రహించగలము. చేపలు ఈ గ్రంథి ద్వారానే నీటి ఉష్ణోగ్రతను తెలుసుకుంటాయి. తమకు అనుకూలమైన ప్రాంతాలను ఎంచుకుంటాయి. ఈ గ్రంథితోనే సముద్రంలో ఎంతో లోతుగా లేదా ఎంతో దూరంగా ఉన్న వస్తువులు హానికారకమైనవా? కావా? అని గ్రహిస్తాయి. కప్ప మూడవ నేత్రంలో మెలటోనిన్ అన్న పేరుగల హార్మోన్ లభిస్తుంది. ఈ హార్మోన్ వల్లనే అసంభవం అనిపించే కార్యాలను సాధించడం జరుగుతుంది. ఈ విధంగా మూడవ కన్నును రహస్యాల పుట్టగా భావించవచ్చు.

ఈ పీనియల్ గ్రంథిని కప్పలలో, ఊసరవెల్లులలో కూడ చూడవచ్చు. ఈ గ్రంథి ఈ జీవుల మస్తిష్కంపై ఒక వాపు (పొటమరింపు) రూపంలో కనబడుతుంది. ఈ జీవులు ఈ గ్రంథి ద్వారానే ఋతువుల ఆగమనాన్ని ముందుగానే గ్రహించి తదనుగుణంగా తమ భావి జీవన చర్యలను నిర్ధారించుకుంటాయి.

### కీర్తికాంక్ష, కాముకత

మనిషి కళ్ళు పీనియల్ గ్రంథితో ప్రభావితం అవుతాయని ఆధునిక పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ గ్రంథి వికసించిన దశ కళ్ళకు అనేక దివ్యశక్తులను ప్రసాదిస్తుంది. సామాన్యంగా కళ్ళ దృశ్యశక్తి చాలా తక్కువ. అయితే ఈ గ్రంథిని జాగృతం చేయడం ద్వారా అల్ట్రావయొలెట్, ఇన్‌ఫ్రారెడ్ లాంటి అదృశ్య కిరణాలను తెరచిన కళ్ళతో చూడవచ్చు. గొప్పవాళ్ళం కావాలనే బలీయమైన కోరికతో, కాముకతతో కూడా ఈ గ్రంథికి సంబంధం ఉంది. ఈ లక్షణాలు ఏ మాత్రం పెరిగినా మనిషి అసాధారణ కీర్తికాముకుడుగా తయారవుతాడు. దుస్సాహసంతో అడుగు ముందుకు వేయడానికి సిద్ధంగా ఉంటాడు. ఈ గ్రంథి రసాయనంలో హెచ్చుతగ్గులు కామ ప్రవృత్తి మీద కూడ గట్టి ప్రభావాన్ని చూపుతాయి. ఈ రసాయనం వృద్ధి చెందడంతో, కాముకత అసాధారణంగా పెరుగుతుంది. ఇది తగ్గితే నపుంసకత్వం వస్తుంది.

**నిజమైన భక్తునికి కష్టాలు చేదుమందులు.**

మూడవ కన్నుగా భావించబడుతున్న ఈ గ్రంథికి సహాయ సహకారాలు అందించే గ్రంథి మరొకటి ఉన్నది. దీనిని మాస్టర్ గ్రంథి అనగా పిట్యూటరీ గ్రంథి అంటారు. ఇది మస్తిష్క అగ్రభాగంలో రెండుకళ్ళ మధ్య ఉంటుంది. ఇది తన జీవ రసాయనాలతో మస్తిష్కం మొత్తాన్ని నియంత్రించే శక్తిని కలిగి ఉంటుంది. ఈ విధంగా దాని ప్రభావం ఎడ్రినల్, థైరాయిడ్ గ్రంథుల నుండి స్రవించే హార్మోనుల మీద అధికంగా ఉంటుంది. అయినా ఇది పీనియల్ గ్రంథి కార్యాలలో సమానంగా భాగం పంచుకుంటుంది.

దుఃఖం, సంతోషం లాంటి వ్యవహారాలు ఈ కేంద్రం స్థితి, ప్రతిక్రియలమీదే ఆధారపడి ఉంటాయి. సోమరితనం, ఉత్సాహ ప్రవృత్తులు కూడా ఈ గ్రంథికి సంబంధించినవని చెప్పబడుతోంది. శారీరక వికాసం మీద పడే అసాధారణ ప్రభావానికి కావలసిన పోషక తత్వాలకంటె అధికంగా - పైన చెప్పిన గ్రంథుల క్రియాకలాపాల వైరుధ్యానికి ఈ గ్రంథి బాధ్యురాలని చెప్పబడుతోంది.

## త్రాటక సాధనద్వారా దివ్యశక్తి

మానవీయ నేత్రాల అయస్కాంత ఆకర్షణ ఈ పిట్యూటరీ, పీనియల్ కేంద్ర దివ్య ప్రభావ పరిణామంగా భావించబడుతోంది. ఈ కేంద్రం వికసిస్తే నేత్రాల సూక్ష్మదృష్టి వృద్ధి చెందుతుంది. స్థూలనేత్రాల పరిధికి అవతల ఉండే అదృశ్య దృశ్యాలు కనిపిస్తాయి. అపరిమిత యోగ్యతలు, కల్పనలతో నిండిన తృతీయ నేత్రం సాధారణంగా పనిచేయలేని సుషుప్తావస్థలో ఉంటుంది. త్రాటక సాధన ద్వారా దాని దివ్యశక్తిని జాగృతం చేయవచ్చు.

మూడవకన్ను - ఆజ్ఞా చక్రాన్ని జాగృతం చేసి దాని ద్వారా రాడార్, టెలివిజన్, ఎక్స్‌రే యంత్రాల లాగా ఎన్నో అసాధారణ, ఆశ్చర్యకరమైన పనులు చేయవచ్చు. మూడవ కన్నులో అతీంద్రియశక్తి ఉంటుంది. అనగా స్థూల ఇంద్రియాలు లేకుండానే ఈ కార్యాలు చేయవచ్చు. ఇది జాగృతమైతే ఎటువంటి యంత్రాల సహాయం లేకుండానే దూర-సుదూర ప్రాంతాలలో జరిగే సంఘటనలను, దృశ్యాలను చూడవచ్చు. శరీరంలోపలి భాగాలు, బాహ్య బ్రహ్మాండంలోని విభిన్న భాగాల చిత్రణ దీనితోనే సాధ్యమవుతుంది. ఈ విధంగా భృకుటి మధ్య ఉన్న ఆజ్ఞాచక్ర జాగరణ అనేక భౌతిక ప్రయోజనాలను అందిస్తుంది.

మూడవకన్ను యొక్క భౌతిక ప్రయోజనాల కంటే ఆధ్యాత్మిక రహస్యాలు చాలా గొప్పవి. ఈ కంటి జాగరణతో ప్రపంచ ఊహాచిత్రమే మారిపోతుంది. ఎందుకంటే స్థూలనేత్రాలకంటే అధికంగా, విస్తృత విరాట్ రూపాన్ని సూక్ష్మ నేత్రాలతో చూసి తెలుసుకోవచ్చు. ఆజ్ఞాచక్రం జాగృతం కావడంతోనే మోహ భావనలు నశిస్తాయి. ఆకర్షణీయంగా కనబడే ఈ ఏడురంగుల ప్రపంచం నిస్సారంగా, నిర్జీవంగా కనిపిస్తుంది. బాహ్య ప్రపంచ ఆకర్షణ క్షణకాలం కనిపించి పగిలిపోయే నీటి బుడగలాగా కనబడుతుంది. చిరస్థాయిగా ఉండే విలక్షణ ఆకర్షణ మనలోనే ఉంది. సంతోషదాయకమైన ఈ దివ్య దర్శన ఆనందం ఆజ్ఞాచక్రంతోనే పొందగలము. స్థూల, నశ్వర శరీరంలోపల ఉన్న నశింపులేని ఆత్మయొక్క అపరిమిత సౌందర్యాన్ని ఆజ్ఞాచక్రమే శోధించి చూడగలదు. ఇది తన అపార ఆకర్షణశక్తితో విరాట్ బ్రహ్మాండంలోని అద్భుత దృశ్యాలను చూసే సామర్థ్యం కలిగి ఉంటుంది.

## తపశక్తి ద్వారా భవిష్య దర్శనం

ఆజ్ఞాచక్ర రూపంలో ఉన్న మూడవ కన్ను ప్రకాశంతో కళ్ళమీద పేరుకున్న మాలిన్య ఆవరణలు తొలగిపోవడం ప్రారంభమవుతుంది. లోతుగా కప్పిపెట్టి, అణచబడి ఉన్న ఆత్మశక్తి తళతళా మెరవడం ప్రారంభమవుతుంది. అలాంటి శాశ్వత అనుభూతి రసాస్వాదన పొందిన సాధకునికి పరా, అపరా ప్రకృతిలోని సంపూర్ణ రహస్యాలు తెలుస్తాయి. తన తపస్సుతో ఆర్జించిన శక్తిని పొంది ఆజ్ఞాచక్రం భవిష్యత్తులో జరుగబోయే సంఘటనలను దూరదర్శన్ చిత్రాల మాదిరి చూస్తుంది. భవిష్య గర్భంలో వెలువడే ఘటనలను సాక్షాత్కరింపజేస్తుంది. తపశ్శక్తితోనే ఆజ్ఞాచక్ర సామర్థ్యం బయటపడుతుంది. శివ భగవానుడు, శంకరాచార్యులు, రమణ మహర్షి, శ్రీ అరవింద, స్వామి వివేకానంద మొదలయిన మహాతపస్వుల ఆజ్ఞాచక్రాల ధారణశక్తి భూమి, బ్రహ్మాండం రెండువైపులా ఉంటుంది.

## రాజయోగ సమాధి

త్రాటక అభ్యాసంతో సమయానుగత రాజయోగ సమాధి ప్రయోజనం సంభవిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ రకమైన అభ్యాసంతో మనం అసామాన్య భౌతిక ప్రయోజనాలను, అద్భుత ఆధ్యాత్మిక లాభాలను పొందవచ్చునేది నిర్వివాదాంశం. ఈ ప్రక్రియలతో అనేక సమస్యలతో నిండిన జీవనంలో దివ్య ప్రకాశాన్ని, దివ్య దృష్టిని ఉత్పన్నం చేయవచ్చు.

- అనువాదం : డి.వి.ఆర్.మూర్తి

**ఉత్తములను వివేకం నడిపిస్తుంది.**

## ఆదిశక్తి గాయత్రి సాధన - 2

# తొమ్మిది గుణాల వికాసమే గాయత్రీ సిద్ధి

మంత్రదీక్ష రూపంలో గాయత్రిని స్థాపించేటప్పుడు ఉపనయన సంస్కారాన్ని జరిపించడం కూడ అవసరం అవుతుంది. ద్విజత్వం యొక్క మానవత్వపు గరిమకు అనుగుణంగా జీవితాన్ని సంస్కరించుకునే సిద్ధాంతమని కూడ ఈ ప్రక్రియను వర్ణిస్తారు. జందెం వేసుకోవడం అంటే అర్థం, దానిని భుజంమీద ధరించడం అంటే అర్థం - జీవనచర్యనూ, శరీరాన్ని కలిపి ఒక దేవాలయంగా, గాయత్రీ ఆలయంగా దానిని రూపుదిద్దుకోవడం. యజ్ఞోపవీతంలో తొమ్మిది పోగులు ఉంటాయి. మానవత్వపు విశిష్టతను వెలికితెచ్చే తొమ్మిది సద్గుణాలకు ఇవి సంకేతాలు, ఒక్కొక్క గుణాన్ని గుర్తుపెట్టుకోవడానికి ఒక్కొక్క పోగును ఏర్పాటు చేశారు. మనిషికి అనేక మహత్తులనూ, విశిష్టతలనూ అందించే ఆ తొమ్మిది సద్గుణాలనూ పెంపొందించుకోవడానికి నిరంతరం కృషిచేయాలనే భావన ఈ ఏర్పాటు వెనుక ఉంది.

సౌరమండలంలోని గ్రహాలు తొమ్మిది. రత్నాలు తొమ్మిది - నవరత్నాలు. అంకెలు తొమ్మిది. శరీర ద్వారాలు తొమ్మిది. ఈవిధంగానే అనేకానేక సద్గుణాలనూ, ధర్మ లక్షణాలనూ లెక్కించడంలో తొమ్మిది అంకెకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఆ తొమ్మిది గుణాలు ఇవి :

**1. శ్రమశీలత** :- సమయాన్నీ, శ్రమనూ, మనస్సునూ ఏదైనా ప్రయోజనకరమైన కార్యంకోసం నిరంతరం వినియోగిస్తూ ఉండడం. అలసత్వాన్నీ, పొరపాటునూ ఎన్నడూ దరిజేయనీయక పోవడం. ఒక్క క్షణాన్నికూడా వృథా చేయకపోవడం. నిరంతరం పనిలో నిమగ్నం కావడం.

**2. శిష్టత** :- శిష్టాచారం, సజ్జనత్వం, సహృదయత అనే సద్గుణాలను అనుక్షణం వ్యక్తం చేయడం. తన నమ్రతనూ, ఇతరుల ప్రతిష్ఠనూ వ్యక్తం చేయడం. తనపట్ల ఇతరులు ఎలా వ్యవహరించాలని కోరుకుంటాడో, అలా తాను ఇతరులపట్ల వ్యవహరించడం. సభ్యతనూ, సత్‌సంస్కారాన్నీ, అనుశాసనాన్నీ నిరంతరం పాటించడం. విధి నిషేధాలను అక్షరాలా పాటించడం.

**3. మితవ్యయం** :- నిరాడంబర జీవనం, ఉదాత్తమైన ఆలోచనా సరళి అనే సూత్రం. ఆడంబరం, అట్టహాసం, అహంకార ప్రదర్శన, ధనగర్వ ప్రదర్శన, దురాచారాలతో ముడిపడిన దుబారా ఖర్చు - వీటన్నింటినీ పరిహరించడం నిరాడంబరత్వం. రకరకాల ఫ్యాషన్‌లకు లొంగిపోవడం, ఖరీదైన నగలు ధరించడం నిరాడంబరత్వం కాదు. విపరీతంగా ఖర్చుచేసే వ్యక్తి దుర్మార్గాలకు దిగడం, అప్పుల్లో కూరుకుపోవడం తరచు కనిపిస్తుంది. అలాంటివారిలో నీచత్వం, అపరిపక్వత, నిజాయితీ లేకపోవడం, దూరదృష్టి లేకపోవడం వంటి లక్షణాలు కూడ కనిపిస్తాయి.

**4. సువ్యవస్థ** :- ప్రతి వస్తువునూ ఒక క్రమపద్ధతిలో చక్కగా అమర్చుకోవడం. చేతకానితనం, అస్తవ్యస్త స్థితి, పద్ధతి లేకపోవడం అనే దుర్గుణాలను ఎట్టి పరిస్థితిలోనూ దరిజేరనివ్వక పోవడం. సమయాన్ని నిర్ణయిస్తూ తీరికలేని దినచర్యను ఏర్పరచుకోవడం. దానిని అక్షరాలా పాటించడం. చురుకుగా, మెలకువగా ఉండడానికి అనుసరించదగిన పద్ధతులు ఇవి. వస్తువులను వాటివాటి స్థలాలలో ఉంచకపోతే అంతా చిందరవందరగా తయారవుతుంది. పద్ధతి లేని వ్యక్తిని సభ్యతా, సంస్కారంలేని వాడుగా పరిగణిస్తారు.

**5. ఔదార్యం, సహకారం** :- కలసి మెలసి పనిచేయడంలో ఆనందాన్ని అనుభవించడం. పరస్పరం ఇచ్చిపుచ్చుకునే స్వభావాన్ని అలవరచుకోవడం. దీనిని సామాజిక భావన, సహకార భావన అనికూడా పేర్కొంటారు. ఇంతవరకు జరిగిన ప్రగతికి ముఖ్యమైన ఆధారం ఇదే. ఈ విధానాన్ని అనుసరించడంవల్ల భవిష్యత్తుకూడ ఉజ్వలం అవుతుంది. ఏకాకితనం మనిషిని కుత్సితునిగా, మూర్ఖునిగా చేస్తుంది.

పైన పేర్కొన్న అయిదు గుణాలను పంచశీల అని పిలుస్తారు. ఈ గుణాలను ఆచరణలోకి తీసుకురావచ్చు. ఇవి

**మధ్యములను అనుభవం నడిపిస్తుంది.**

స్పష్టంగా కనిపిస్తాయి. కనుక వీటిని అనుశాసన గుణాలుగా వర్ణించవచ్చు. వీటిని ధర్మాచరణగా కూడ పరిగణిస్తారు.

ఇవికాక- భావనకూ, శ్రద్ధకూ సంబంధించిన ఉత్కృష్ట స్వభావాలు కూడ ఉన్నాయి. శ్రద్ధా విశ్వాసాల స్థాయిలో, అంతఃకరణ లోతుల్లో ఇవి స్థిరపరచబడతాయి. వీటిని ఆధ్యాత్మిక సంపద అనీ, దైవీ సంపద అనీ కూడ పేర్కొనవచ్చు. ఈ నాలుగు గుణాలు ఆధారంగా ఆస్తికత్వం, ఆధ్యాత్మికత, ధార్మికత పెంపొందుతాయి. నాలుగు వేదాల సారం ఇదే. నాలుగు దిశాధారల వెనుక, వర్ణాశ్రమ ధర్మం వెనుక ఉన్న మూల సూత్రాలుకూడ ఇవే.

**6. విజ్ఞత** :- దూరదృష్టితో కూడిన వివేకం. నీరక్షీర వివేకం. సముచితమైన దానినే ఎంపిక చేయడం. రాగల పరిణామాలను సమగ్రంగా బేరీజువేసిన తర్వాతనే పనికి ఉద్యమించడం. జీవితం అనే అమూల్య సంపదలోని ఒక్కొక్క క్షణాన్నీ ఉత్తమోత్తమంగా వినియోగపరచడం. దుష్ట ప్రవృత్తులతో ముడిపడి ఉన్న దుశ్చర్యల విషయంలో తగు మెలకువ వహించడం.

**7. నిజాయితీ** :- ఎదుటి వ్యక్తికి సహజమైన సజ్జనత్వం పరిచయమయ్యే విధంగా, ఇతడు నమ్మదగిన వ్యక్తి అని భావించే విధంగా, ఇతడితో వ్యవహరించడంలో ఎలాంటి ఇబ్బందీ ఉండదు అనిపించే విధంగా - ఆర్థిక విషయాలలో, ఇతర వ్యవహారాలలో ప్రవర్తించడం. కాపట్యం, వంచన, అవినీతి - వీటిని దృఢంగా పరిహరించడం.

**8. బాధ్యతాయుతత్వం** :- మనిషి స్వతంత్రుడని భావిస్తారు. కాని, అతడు బాధ్యతల బంధనాలలో చిక్కుకుని ఉన్నాడు. తనవారిపట్ల కాని, పరాయివారిపట్ల కాని చెడుగా ప్రవర్తించడానికి అతడికి అవకాశమే ఉండదు. పరమేశ్వరుడు ప్రసాదించిన శరీరం, మనస్సు, విశిష్టతలు - వీటిలో దేనినీ దురుపయోగం కానివ్వకపోవడం. కుటుంబం, దేశం, ధర్మం, సమాజం, సంస్కృతి - అన్నిటిపట్ల తనకు గల బాధ్యతలను శ్రద్ధగా నిర్వహించడం. వీనిలో ఏ ఒక్కదానిలోనూ దురాచారాన్ని ప్రవేశించనివ్వక పోవడం.

**9. వీరత్వం** :- సాహసం, శౌర్యం, పరాక్రమం అనే లక్షణాలు. అవినీతి ఎదుట తలవంచక పోవడం. దురాచారంతో ఎట్టి పరిస్థితులలోనూ రాజీ పడకపోవడం. ప్రమాదాన్ని చూచి గాబరా పడకపోవడం. తన గుణ కర్మ స్వభావాలలోకి ప్రవేశించే అవాంఛనీయ లక్షణాలను నిరంతరం ప్రతిఘటించడం, వాటిని ఓడించడం. లోభం, మోహం, అహంకారం, చెడు సహవాసం, దుర్వ్యసనం మున్నగు అనౌచిత్యాలను జయించగలిగే సంఘర్షశీలత.

## తొమ్మిది గుణాల వికాసమే గాయత్రీ సిద్ధి

అయిదు క్రియాపరమూ, నాలుగు భావనాపరమూ - మొత్తం ఈ తొమ్మిది గుణాల సముదాయాన్ని ధర్మాచరణ అని పిలుస్తారు. గాయత్రి మంత్రంలోని తొమ్మిది శబ్దాలు ఈ తొమ్మిది దివ్యసంపదలనూ కలిగి ఉండాలనే ప్రేరణ ఇస్తాయి. యజ్ఞోపవీతంలోని తొమ్మిది నూలు పోగులూ కూడ ఇవే. అవి గాయత్రికి ప్రతీకలు. ఈ ధర్మ నిర్వహణకోసం ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండడానికై యజ్ఞోపవీతాన్ని బుజంమీద ధరింపజేస్తారు. అనగా - మానవ గరిమతో విడదీయరాని విధంగా ముడిపడిఉన్న తొమ్మిది అనుశాసన పూర్వక బాధ్యతలను భుజంపై ధరించడమే వాస్తవానికి యజ్ఞోపవీత ధారణలోని రహస్యం. ఆ ధరించడమే వాస్తవానికి గాయత్రి మంత్రాన్ని జీవనచర్యలో అంతర్భాగం చేసుకోవడం. మంత్రదీక్ష, గురుదీక్షల సమయంలో కూడ ఈ తొమ్మిది అనుశాసనాలనూ హృదయంలోకి ప్రవేశింపజేస్తారు.

గాయత్రీ మంత్ర సాధనలో ఈ తొమ్మిది గుణాలూ వెలికివస్తాయి. మరోవిధంగా చెప్పాలంటే - ఈ తొమ్మిది గుణాలనూ అలవరచుకున్న వ్యక్తిలోనే గాయత్రి మంత్రంలో ఇమిడి ఉన్న సిద్ధులు వెలికి వస్తాయి. శుచీ శుభ్రం కలిగిన మంచి వ్యక్తి మురికి చోట కూర్చోనడానికి ఇష్టపడడు. మరి - నికృష్టమైన ఆలోచన, శీలమూ, వ్యవహరణా కలిగి ఉన్న వ్యక్తులమీద దైవ అనుగ్రహం కురుస్తుందనీ, దైవత్వంతో మమేకం అయినవారికి లభించే గౌరవం వారికి లభిస్తుందనీ ఎలా ఆశించగలం?

జ్ఞానం, కర్మ జంటగా ఉంటాయి. అవి కలసి ఉండడంలోనే, రెండింటిని ప్రభావితం చేయడంలోనే,

**అవసరం అధములను నడిపిస్తుంది.**

నేర్చుకున్నదీ, తెలుసుకున్నదీ, అర్థం చేసుకున్నదీ, స్వీకరించినదీ ఊహాలోకంలో ఉండిపోకుండా బలీయమై పనినీ, నియమ నిబంధనలనూ తన స్థాయికి అనుగుణంగా మలచగలగడంలోనే - రెంటికీ సార్థకత ఉంది.

జీవన సాధనతో ముడిపడిన గాయత్రీ మహామంత్రం యొక్క తొమ్మిది అనుశాసనాలు పైన పేర్కొనబడ్డాయి. మన జీవన చర్యలోని ప్రతి అంశంలో వీటిని సమన్వయించుకోవాలి. శ్రద్ధతో, విశ్వాసంతో, నిండు మనసుతో ఉపాసన చేస్తే దాని మొట్టమొదటి ఫలితం ఈ సద్గుణాల పెరుగుదల రూపంలో కానవస్తుంది. ఆతర్వాత అలౌకికమూ, ఆధ్యాత్మికమూ, అతీంద్రియమూ అయిన సంపదల, మహిమల రూపంలో ఫలితం కానవస్తుంది.

## గాయత్రీ తత్వం ఇచ్చే భౌతిక ఫలితాలు

గాయత్రి ఉపాసన యొక్క సహజ రూపం వ్యాహృతులతో కూడిన త్రిపద గాయత్రి జపం. 'ఓం భూర్భువః స్వః' - ఇది శీర్ష భాగం. ఆకాశం, పాతాళం, ధరాతలంల రూపంలో ఉన్న మూడులోకాలలో ఆ దివ్యశక్తి ఇమిడి ఉన్నదనే అనుభూతిని పొందడం దీని తాత్పర్యం. న్యాయమూర్తి సమక్షంలో, పోలీసు అధికారి సమక్షంలో నేరం చేయడానికి ఎవరూ సాహసించరు. అలాగే - అన్ని కాలాలలో, అన్ని స్థలాలలో వ్యాపించి ఉన్న న్యాయమిచ్చే శక్తియొక్క ఉనికి తనకు అన్నివైపులా అన్నివేళలా అనుభూతి కావడం; ఎలాంటి అవినీతి పనినీ జరగనివ్వకపోవడం.

'ఓం' అనగా పరమాత్మ - ఆ పరమాత్మ విరాట్ రూపంలో, బ్రహ్మాండం రూపంలో వ్యాపించి ఉన్నాడని కూడ గుర్తించాలి. ఆ పరమాత్మ మన ఆత్మలో నిండి ఉన్నట్లు అనుభూతి పొందాలంటే - స్థూల శరీరంలో, సూక్ష్మ శరీరంలో, కారణ శరీరంలో పరమాత్మ శక్తి యొక్క ఉనికిని అనుభూతి పొందాలి; ఈ మూడు క్షేత్రాలలో పరమాత్మ శక్తి ప్రవేశించడానికి సంకోచం కలిగించే మాలిన్యం ఎక్కడా ఏమాత్రం ప్రవేశించకుండా శ్రద్ధ వహించాలి. వాటిని ఎంతో ఆరోగ్యంగా, నిర్మలంగా, దివ్యత్వాలతో నిండినవిగా ఉంచుకోవాలి. వికసించిన గులాబీ వద్దకు తుమ్మెదలు సహజంగా వచ్చిచేరే విధంగా- మూడు శరీరాలలో పరమాత్మ ఉనికి కానరావాలి. వాటినుండి సహజంగా వెలువడే సదాశయం అనే వాటి సుగంధం పరిసర వాతావరణమంతటినీ ముంచెత్తాలి.

గాయత్రీ మంత్రం యొక్క అర్థం సరళమైనది. అందరికీ తెలిసినది. సవితృః = తేజస్సుతో కూడినది. వరేణ్యాం = వరించడం, స్వీకరించడం, భర్గో = తేజస్సు ఆధారంగా అనౌచిత్యాన్ని పారద్రోలడం. దేవస్య = దేవత్వం పక్షాన ఉన్న మహత్తులను, ధీమహి = ధరించడం.

చివరలో - ఈ విశిష్టతలతో కూడిన పరమేశ్వరుడు మా అందరి బుద్ధులకూ సన్మార్గంలో పనిచేసే ప్రేరణ ఇవ్వాలనీ, సద్బుద్ధిని ప్రదానం చేయాలనీ ఆయనను ప్రార్థించడం జరిగింది. అలాంటి సద్బుద్ధిని పొందిన వ్యక్తి, తన సద్భావనను జీవంతో జవంతో నింపిన వ్యక్తి తన దృక్పథంలో స్వర్గతుల్యమైన మనోదశనూ, పరిస్థితులనూ అనుభూతి పొందుతాడు. ఎక్కడ ఉన్నా, అతడు తన విశిష్ట లక్షణాలతో స్వర్గమయమైన వాతావరణాన్ని నిర్మిస్తాడు.

స్వర్గప్రాప్తి మాత్రమే కాక - దైవ అనుగ్రహంవల్ల కలిగే మరో ప్రయోజనం మోక్షం. మోక్షం అంటే విముక్తి. కల్మషాలనుండి విముక్తి. దోషాలనుండీ, దుర్గుణాలనుండీ విముక్తి. భవ బంధనాలనుండి విముక్తి. స్వతంత్రమైన అస్తిత్వంతో జన్మించిన మానవులను లోభాలూ, నీచత్వాలూ అనే సంకెళ్ళతో బంధించేవే భవ బంధనాలు. ఆత్మపరిశోధనతో వీటిని తొలగించుకోగలిగితే - జీవించి ఉండగానే మోక్షం పొందినట్లే. మోక్షంకోసం మరణ సమయంకోసం ఎదురుచూడవలసిన అవసరం ఉండదు. గాయత్రీ ఉపాసననూ, జీవన సాధననూ అర్థవంతంగా జరిపితే - ఆత్మికమైన దాని సిద్ధులు రెండూ స్వర్గం, ముక్తి అనే రూపాలలో నిరంతరం అనుభవంలోకి వస్తూ ఉంటాయి. ఆ అనుభూతి కారణంగా ప్రతి క్షణం సార్థకం అవుతుంది.

గాయత్రి ఉపాసనద్వారా భౌతికమైన సిద్ధులూ, ఫలితాలూ లభించిన ఘట్టాలు పురాణాలలో వర్ణించబడ్డాయి. వశిష్ఠ మహర్షి ఆశ్రమంలో నందిని రూపంలో ఉన్న గాయత్రి

**స్వభావం జంతువులను నడిపిస్తుంది.**

వేలాది సైనికులతో కూడిన విశ్వామిత్ర మహారాజు సైన్యానికి కొద్ది సేపటిలోనే అద్భుతమైన భోజనాలు ఏర్పాటుచేసి వారందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. గౌతమ మహర్షికి గాయత్రీ మాత అక్షయపాత్రను ప్రదానం చేసింది. ఆ అక్షయపాత్ర కారణంగా ఆరోజుల్లో కరవుతో పీడితులైన ప్రజలకు ఆహారం అందింది. దశరథ మహారాజు జరిపిన పుత్రకామేష్టి యజ్ఞానికి ఆధ్వర్యం వహించిన ఋష్యశృంగ మహర్షికి గాయత్రి అనుగ్రహం లభించింది. ఆ అనుగ్రహంవల్ల దశరథునికి దైవ సమానులైన నలుగురు పుత్రులు జన్మించారు. గాయత్రీ సాధనవల్ల కలిగే ఇలాంటి అద్భుత ఫలితాల రసవత్తర వర్ణనలతో కూడిన కథలూ, గాథలూ పౌరాణిక సాహిత్యం నిండా ఉన్నాయి.

## ఇరవైనాలుగు అక్షరాల శక్తి కేంద్రం

గాయత్రిలోని తొమ్మిది శబ్దాలు కాళికాదేవి యొక్క తొమ్మిది రూపాలు. ఆశ్వయుజ మాసంలో నవదుర్గలకు వివిధ ఉపచారాలతో పూజలు జరుపుతారు. గాయత్రి యొక్క మూడు శక్తులు - బ్రాహ్మీ, వైష్ణవీ, శాంభవీ అనేవి - దేవీ భాగవతంలో వర్ణించబడ్డాయి. స్త్రీజాతి మహాశక్తులు ఇరవైనాలుగు అని ఆ గ్రంథంలో పేర్కొన్నారు. ఒక్కొక్క శక్తి మహత్తును అందులో విపులంగా వర్ణించారు.

గాయత్రిలోని 24 అక్షరాలు అలంకారికంగా ఇతర సందర్భాలలోకూడ ప్రస్తావించబడ్డాయి. భగవంతుని పది అవతారాలనేకాక 24 అవతారాలను కూడా పురాణాలు వర్ణించాయి. మహర్షులలో సప్తమహర్షులేకాక 24 గురు ప్రముఖులని పేర్కొనబడింది. ఇవి గాయత్రిలోని అక్షరాలే. దేవతలలో త్రిమూర్తులకు ప్రాముఖ్యం ఉంది. ప్రముఖ దేవతలు 24 మంది ఉన్నట్లు లోతుకుపోయి పరిశీలిస్తే తెలుస్తుంది. దత్తాత్రేయుడు బ్రహ్మ ఇచ్చిన సలహా ప్రకారం 24మంది గురువులద్వారా తన జ్ఞానతృష్ణను తీర్చుకున్నాడు. ఈ 24మంది గురువులూ మరో రూపంలో గాయత్రిలోని 24 అక్షరాలే.

సౌరమండలంలో 9 గ్రహాలు ఉన్నాయి. సూక్ష్మశరీరంలో ఆరు చక్రాలూ, మూడు గ్రంథి సముచ్చయాలూ ఉన్నాయి. ఇవి మొత్తం తొమ్మిది. వీటి రూపురేఖలు సాధన శాస్త్రాలలో వర్ణించబడ్డాయి. గాయత్రిలోని తొమ్మిది శబ్దాలలో దేనిని ఏవిధంగా సాధన చేస్తే ఏయే దివ్యశక్తులు లభ్యమవుతాయో ఆ శబ్దాలలో వాఖ్యలలో రుజువుచేయబడింది. అష్ట సిద్ధులూ, నవనిధులూ ఇలాంటి దివ్యశక్తుల పరిధిలోనివే, పేరాసైకాలజీలోని అతీంద్రియ శక్తులు గాయత్రీ మంత్రంలోని ఖండ ఉపఖండాలవల్ల కలిగే దివ్యశక్తులను పోలిఉంటాయి. దేవీ భాగవంలో మహాశక్తియొక్క అనేక రూపాల వివేచన ఉంది. మాలిక ఉంది. గాయత్రి యొక్క రహస్య శక్తుల వివరణగా దానిని పరిగణించవచ్చు. మహర్షియుగంలోని తపస్వులు దాదాపు అందరూ గాయత్రిని ఆలంబనగా చేసుకుని ముందుకు వెళ్లినవారే. మధ్యయుగానికి చెందిన పలువురు సిద్ధ పురుషుల జీవిత గాథలలో వారికి గాయత్రి ఆధారంగానే సిద్ధులూ, మహత్తులూ లభించిన రహస్యం పేర్కొనబడింది.

ఈ విషయమై మరిన్ని వివరాలు కావాలంటే - అఖండజ్యోతి సంస్థాన్, మథుర సంస్థ ప్రచురించిన గాయత్రీ మహావిజ్ఞాన్ గ్రంథం యొక్క మూడు ఖండాలను చదువవచ్చు. మామూలు వ్యక్తిత్వం, పరిమితమైన వనరులు కలిగి ఉన్నప్పటికీ ఎంత పెద్ద పనిని, ఎంతటి మహత్తరమైన పనిని ఆ గ్రంథ రచయిత నిర్వహించారో కూడ ఆ అధ్యయనంద్వారా కనుగొనవచ్చు. ఆ పనిని సమర్థుడైన వ్యక్తి అయిదు జన్మలలోకాని, అయిదుగురి సహాయంతోకాని ఏదోవిధంగా చేయగలుగుతాడు.

ఇతర మతాలలో ఒక్కొక్క సంప్రదాయానికీ ఒక్కొక్కటే ప్రముఖ మంత్రం ఉంది. భారతీయ ధర్మానికి కూడ ఒకే జన్మస్థలం ఉంది. అదే గాయత్రి. చెట్టుకు మొదలూ, రెమ్మలూ, ఆకులూ, పువ్వులూ, పండ్లూ ఉన్న విధంగా - ఆ గాయత్రియొక్క విస్తరణయే వేదాలు, శాస్త్రాలూ, పురాణాలూ, ఉపనిషత్తులూ, స్మృతులూ, దర్శనాలూ, సూక్తాలూ మున్నగునవి. ఏకంనుండి అనేకం, అనేకం నుండి ఏకం రూపొందడం అనే సత్యం గాయత్రి విషయంలో రుజువయింది. గాయత్రి యొక్క జ్ఞాన విజ్ఞానాలకు సంబంధించిన సాధనలనూ, వివేచనలనూ వాటి వివిధ రూపాలనూ చూచినపుడు ఆ విస్తరణలో ఉన్న రహస్యం చక్కగా అవగతం అవుతుంది.

" HHH

**ఋషులు మాట్లాడరు. మేధావులు మాట్లాడతారు. మూర్ఖులు వాదిస్తారు.**

## కృష్ణావతారం-27

# అసలు తీర్థం ఆత్మయే

పాండవులు రాజ్యవ్యవస్థను సుదృఢముగా చేయుటకు అశ్వమేధ యజ్ఞమును ఏర్పాటు చేసిరి. వారి ఆహ్వానమును పొంది శ్రీకృష్ణుడు ప్రద్యుమ్న సాత్యకాదులను వెంటనిడుకొని హస్తినాపురమునకు చేరికొనెను. పాండవులు యజ్ఞవ్యవస్థకై హిమాలయమునకు వెడలిరి. ఇంతలో ఉత్తర ప్రసవించెను. అశ్వత్థామ యొక్క అస్త్ర ప్రభావముచే మరణించిన పుత్రుడు జన్మించెను. అంతటా శోకము అలముకొనెను. కుంతి, ద్రౌపది మున్నగువారు విలపింపసాగిరి. ఈవార్త విని శ్రీకృష్ణుడు అక్కడకు చేరికొని వారికి ధైర్యము చెప్పి తన తపస్సు యొక్క, సత్యపాలనము యొక్క ప్రభావముతో ఆ బాలుని పునర్జీవితునిగా జేసెను. "నేను ఆటలలోనైన అసత్యమును పలుకనివాడనైనచో, నాధర్మమును ఎప్పుడును తప్పనివాడనైనచో ఈ అభిమన్యుని పుత్రుడు జీవించుగాక" అని ఆయన పలికెను.

**యథా కంసశ్చ కేశీ చ ధర్మేణ నిహతౌ మయా ।**
**తేన సత్యేన బాలోऽయం పునః సంజీవతామయమ్॥**

నేను కంసుని, కేశిని ధర్మానుసారము వధించినట్లయినచో ఆ సత్య ప్రభావముచే ఈ బాలుడు పునర్జీవితుడగుగాక!

1. అన్యాయముగ ప్రవర్తించు దుష్టులను సంహరించుట గూడ ధర్మసాధనలో, సత్యసాధనలో భాగమే.

శ్రీకృష్ణుడిట్లు సంకల్పించి తన తపస్సులోని, సత్యములోని భాగమును ఇచ్చుటచే ఆ మృతబాలుడు పునర్జీవితుడయ్యెను. అన్నివైపుల సంతోషము నెలకొనెను. పాండవులు తిరిగి వచ్చి విషయము నంతటిని విని శ్రీకృష్ణునకు హృదయ పూర్వక ధన్యవాదముల నర్పించిరి. యుధిష్ఠిరుడు ఆయనతో "ఈ శరీరమునకెట్టి ఆధారము లేదు. అందువలన యజ్ఞము చేయుటకు ఆలస్యమైనది" అని పలికెను. శ్రీకృష్ణుడు ఆయనను ప్రశంసించి ఇట్లు పలికెను - రాజ్యమును పొందుట గొప్ప విషయము కాదు. దానిని తగిన విధముగ వ్యవస్థీకరించుటయే ముఖ్యవిషయము. నీవు నీ యీ ధర్మ కర్తవ్యమునకు మహత్త్వము నొసింగితివి. ఇది మానవ శరీరమునకు తగిన కార్యమే.

**జన్మాన్తర సహస్రైస్తు మనుష్యత్వం హి దుర్లభమ్ ।**
**తద్గత్వాపీహ యో ధర్మం న కరోతి స్వవంచితః ॥**

వేలకొలది జన్మలెత్తినను మానవ జన్మ లభించుట దుర్లభమగును. అమూల్యమైన ఇట్టి మానవ శరీరమును పొందియు ధర్మము నాచరించని వాడు గొప్ప ప్రయోజనముచే వంచితుడగును.

1. ధర్మము కొన్ని కర్మ కాండలకు పరిమితము కాదు. ఆత్మోత్కర్షను గూర్చి, లోకహితమును గూర్చి తన కర్తవ్యములను నిర్వహించుటను గూడా ధర్మమందురు.

**అనాగతాని కార్యాణి కర్తుం గణయతే మనః ।**
**శారీరకం సముద్దిశ్య స్మయతే నూనమన్తకః**
**తస్మాద్ధర్మ సహాయస్తు ధర్మం సంచితుయాత్సదా ।**
**ధర్మేణ కిం సహాయేన తమస్తరతి దుస్తరమ్ ॥**

మానవుని మనస్సు భవిష్యత్కార్యములను చేయుటను లెక్కించుచుండును. కాని కాలము నశించు స్వభావముగల వాని శరీరమును చూచి నవ్వుచుండును. అందువలన ధర్మమునే సహాయముగా భావించి దానిని సంగ్రహించుటలో నిమగ్నము కావలెను. ఎందుకనగా ధర్మము యొక్క సహాయము వలన మానవుడు దుస్తరమగు నరకము దాటగలడు.

1. మానవుడు తన అంతమును గూర్చి ఎరుగడు, అందువలన అధిక మహత్త్వముగల కార్యమును వాయిదా వేయరాదు.

**చెవులు రెండు నోరు ఒకటే. కనుక - ఎక్కువగా విను, తక్కువగా తిను, మాట్లాడు.**

2. సాంసారికములైన ఉపలబ్ధుల కంటె ధర్మ కర్తవ్యములను పాటించుట వలన అధికాధిక లాభము చేకూరును.

శ్రీకృష్ణుని మాటలను నమ్మి అందరు ఉత్సాహముతో అశ్వమేధ యజ్ఞమునకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నులైరి. అందరి సహకారము వలన, పురుషార్థము వలన శ్రీకృష్ణుని సంరక్షణము గూడా సఫలమయ్యెను. చక్రవర్తి ప్రభుత్వము ఏర్పాటయ్యెను. యజ్ఞము తరువాత యుధిష్ఠిరుడు తీర్థయాత్రకు వెళ్ళవలెనను కోరికను వెల్లడించెను. శ్రీకృష్ణుడు ఆయనకు తీర్థముల యొక్క మర్మమును తెలిపెను. తీర్థములను కాక ఉత్తమ ప్రవృత్తులను గౌరవింపవలెనని చెప్పెను.

**తపస్తీర్థం దయాతీర్థం శీలం తీర్థం యుధిష్ఠిర ।**
**అల్పసంతోషకం తీర్థం నారీతీర్థం పతివ్రతా ॥**

యుధిష్ఠిరా! తపస్సు, దయ, శీలము, సంతోషమూ - ఈ సద్గుణములు గూడ తీర్థముల వంటివే. పతివ్రతయగు స్త్రీ గూడ ఒక తీర్థమే.

1. ఎవని సాన్నిధ్యము వలన మానవునిలో దివ్యత్వము ఉప్పొంగునో దానిని తీర్థమందురు. ఈ దృష్టితో సద్గురువును, ఉత్తమప్రవర్తన గల స్త్రీని తీర్థమని చెప్పిరి.

**ఆత్మా నదీ భారత పుణ్యతీర్థం**
**ఆత్మా తీర్థం సర్వతీర్థ ప్రధానమ్ ।**
**ఆత్మా యజ్ఞః సతతం మన్యతే వై**
**స్వర్గో మోక్షః సర్వమాత్మన్యధీనమ్ ॥**

**ఆచారనైర్మల్యముపాగతేన**
**సత్యక్షమా నిస్తుల శీతలేన ।**
**జ్ఞానాంబునా స్నాతి హి నిత్యమేవం**
**కిం తస్య భూయః సలిలేన తీర్థమ్ ॥**

రాజా! ఆత్మ అనెడు నది పవిత్రమైన తీర్థము. ఇది అన్ని తీర్థములలో ప్రముఖమైనది. ఆత్మ యజ్ఞరూపముగా తలపబడినది. స్వర్గము, మోక్షము అన్నియు ఆత్మయొక్క ఆధీనములో ఉన్నవి. సదాచారమును పాటించుటవలన మిగుల నిర్మలమైనవాడు, సత్యము ద్వారా క్షమద్వారా సాటిలేని శీతలత్వమును పొందినవాడు, జ్ఞానమనెడు జలములో నిరంతరము స్నానము చేయువాడు నగు మానవునకు నీటితో నిండిన తీర్థముతో నేమి అవసరమున్నది.

1. దీని వలన ఆత్మ పరిష్కారము యొక్క అద్భుత మహత్త్వము ప్రతిపాదింపబడినది.

ఆయనకు శ్రీకృష్ణుడిట్లు తెలిపెను. "తీర్థములలో ఉత్తమ ఆత్మలు తపస్సు ద్వారా ఆత్మ పరిష్కారమునకు తగిన వాతావరణమును కల్పించును. తీర్థయాత్రను తన ఆత్మ పరిష్కారమునకు, జ్ఞానవృద్ధికి సాధనముగా తలంచి దానిని పూర్తి చేయుట మంచిది. కేవలము కొన్ని విగ్రహములను దర్శించి, కొన్ని జలాశయములలో స్నానాదులను చేసినచాలునని తలంచరాదు.

యుధిష్ఠిరుడు భగవానుడు చెప్పిన దానిని శ్రద్ధగా విని దానిని అనుసరించి తన యాత్రకు సిద్ధము చేసికొనెను.

దుష్ట సంహారమును, అన్ని వైపుల ధర్మరాజ్యమును స్థాపింపజేసి శ్రీకృష్ణ బలరాములు ద్వారకానగరమును చక్కబరచుటలో నిమగ్నులైరి. శక్తి సాధనమును, శ్రీకృష్ణ బలరాముల సమర్థ సంరక్షణమును పొందిన యాదవులలో స్వేచ్ఛాప్రవృత్తి పెరుగసాగెను. వారిని సిద్ధాంతనిష్ఠులనుగా జేయుటకు శ్రీకృష్ణుడు కృషి చేయసాగెను.

ఒక మారు సూర్యగ్రహణ సమయమున తీర్థస్నానమునకై జనులు వెళ్ళుచుండిరి. తమవారికి ఋషి శ్రేష్ఠుల యొక్క, మహాత్ములయొక్క సత్సంగమును కలిగించు దృష్టితో శ్రీకృష్ణుడు అందరిని వెంటనిడుకొని కురుక్షేత్రమునకు వెళ్ళెను. అక్కడ ద్రౌపదితోపాటు పాండవులు, పరివారముతో పాటు నందుడు గూడ వచ్చెను. అందరు పరస్పరము ప్రేమతో కలిసికొనిరి, శ్రీకృష్ణ దర్శనమునకై వ్యాసుడు, నారదుడు, చ్యవనుడు, విశ్వామిత్రుడు, భారద్వాజుడు, గౌతముడు, కశ్యపుడు, పరశురాముడు, వశిష్ఠుడు, భృగువు, అత్రి, మార్కండేయుడు, బృహస్పతి, సనకాదులు, అగస్త్యుడు, యాజ్ఞవల్క్యుడు మున్నగు పెక్కండ్రు ఋషులు తమ

**రాజకీయ, సాంఘిక స్వేచ్ఛలు మంచివే. అయితే - వాస్తవమైనది ఆధ్యాత్మిక స్వేచ్ఛ.**

శిష్యులతో అక్కడకు చేరికొనిరి. శ్రీకృష్ణుడు వారి నందరిని తగు విధముగ సత్కరించెను, ఆసనముల నొసంగెను. వారి రాకకై చాలా సంతోషించెను. శ్రీకృష్ణుడు పలికెను. "ఋషి శ్రేష్ఠులారా! ఇక్కడకు మేము వచ్చుటలో గల ప్రధాన ఉద్దేశ్యము మీ దర్శనమును పొందుటకే, మీరే మీ తపస్సుతో తీర్థములను నిర్మించుచుందురు. జ్ఞానములేని వారు స్థూలతీర్థములకే మహత్వము నొసంగుదురు. సత్పురుషుల సహవాస ప్రయోజనము పొందలేరు".

**కిం స్వల్ప తపసాం నృణామర్చాయాం దేవ చక్షుషామ్।**
**దర్శన స్పర్శన ప్రశ్న ప్రహ్వ పాదార్చనాదికమ్ ॥**
**నహ్యమ్మయాని తీర్థాని న దేవా మృచ్ఛిలామయాః ।**
**తే పునన్త్యురు కాలేన దర్శనాదేవ సాధవః ॥**

చాలా కొద్ది తపస్సు చేసినవారు, తమ ఇష్టదేవుని సర్వప్రాణులలోను చూడలేని వారు, మూర్తి విశేషము నందే ఆయనను దర్శించువారు. మీ దర్శన - స్పర్శన - కుశల ప్రశ్న. ప్రణామ - పూజల యొక్క అవసరమును ఎట్లు పొందగలరు.

జలమయములగు తీర్థములే తీర్థములు కావు. మృత్ప్రతిమలు లేదా శిలాప్రతిమలె దేవతలు కావు. సత్పురుషులే నిజమగు తీర్థములు దేవతలు. ఎందుకనగా వానిని ఎక్కువ కాలము సేవించినచో అవి పవిత్రము చేయును. కాని సత్పురుషుల దర్శనము వెంటనే ధన్యులనుగా జేయును.

1. ఈశ్వరుని సర్వవ్యాపకత్వమును అనుభవములోనికి తెచ్చుకొనుటకు మానవుడు తపోనిష్ఠుడు కావలెను.
2. స్థూలమునె సర్వస్వమని భావించువాడు సూక్ష్మతత్త్వ ప్రయోజనమునుండి వంచితుడగును.
3. తీర్థము సూక్ష్మ సంస్కారయుక్త వాతావరణ నామము, స్థానము కాదు. దాని ప్రయోజనము స్థానవిశేషమున లభించును. కాని సత్పురుషుల సాన్నిధ్యము వలన ఆ ప్రయోజనము ఎక్కడైనను లభించును.

**యస్యాత్మ బుద్ధిః కుణపే త్రిధాతుకే**
**స్వధీః కలత్రాదిషు భౌమ ఇజ్య ధీః ।**
**యత్తీర్థ బుద్ధిః సలిలే న కర్హి చిత్**
**జనేష్వభిజ్ఞేషు స ఏవ గోఖరః ॥**

శ్రీకృష్ణుడు ఇంకను ఇట్లు చెప్పెను - మహాత్ములారా! సభాసదులారా! ఏ మానవుడు వాత - పిత్త - కఫములనెడు మూడు ధాతువులతో నిర్మితమైన శవతుల్యమైన శరీరమునె ఆత్మయనియు, భార్యా పుత్రులు తనవారనియు, మట్టి - రాయి - కొయ్య మున్నగు వానిచే చేయబడిన రూపములనె ఇష్టదేవతలనియు భావించునో, జలమునే తీర్థమని తలంచునో, జ్ఞానులైన మహాపురుషులను అట్లు తలంపడో అతడు మనుష్యుడు అయినను పశువులలో గూడా నీచమైన గాడిదయే అగును.

1. శరీరమునే కాక తనలోపల ఉన్న చైతన్యమును గూడా తన స్వరూపమని తలంపవలెను.
2. శారీరక బంధువు కంటె ముందుకు పోయి ఆలోచన మరియు ఆత్మికములైన సంబంధముల వరకు ఆత్మీయతను విస్తరింప జేయవలెను.
3. సత్పురుషులను చైతన్య తీర్థమందురు.
4. వివేకమును ఉపయోగింపకుండుట పశుత్వమునకు చిహ్నము.

భగవాను డిట్లు చెప్పగా వినిన సభాసదుల అజ్ఞానము తొలగిపోయెను. ఋష్యాదులు ఆయనను ఇట్లు స్తుతింపసాగిరి.

**బ్రహ్మ తే హృదయం శుక్లం**
**తపస్స్వాధ్యాయ సంయమైః ।**
**యత్రోపలబ్ధం సద్వ్యక్తమవ్యక్తం చ తతః పరమ్॥**

దేవా! నీ హృదయము నిర్మలము, తపస్సు - స్వాధ్యాయము - సంయమము మున్నగు వాని ద్వారా దానియందు (హృదయములో) నీ సాకార నిరాకార రూపమైన మరియు రెండిటికి అధిష్ఠాన స్వరూపమైన పరబ్రహ్మము యొక్క సాక్షాత్కారమగును.

1. నిర్మల హృదయమందే భగవానుని బోధ కలుగును.
2. భగవానుని అనుభూతి సాకారము గాని నిరాకారము గాని లోపలే కలుగును, బయట కాదు. HHH

**సాధుత్వం పనికిరాని చోట కఠినత్వం అవసర మవుతుంది.**


ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 14

# సద్గురువు సాక్షాత్కరించిన సుముహూర్తం - 1

## దీక్షనుండి లభించిన దిశ

తూర్పున నక్షత్రాల మిలమిలలు క్రమంగా క్షీణిస్తున్నాయి. చీకటి క్రమంగా తగ్గుతోంది. పక్షులు తమ గూళ్లలో నుండి కిలకిలారావాలు చేస్తున్నాయి. అప్పుడు శ్రీరామ్ తమ పూజ గదిలో ఆసనం పరచారు. కూర్చొని 'అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాం గతోపి వా...' మంత్రాన్ని జపిస్తూ ప్రాతః సంధ్యను ప్రారంభిస్తున్నారు.

మహామనా మాలవ్యాజీ మంత్రదీక్ష ఇచ్చేటప్పుడు ఆయా విధి విధానాలను వివరించారు. సంధ్యావందనం రెండు సమయాలలోనూ చేయాలని ఆయన చెప్పారు. సంధ్యావందన ప్రారంభం, స్థలం, సమయంకూడ ఆయన బోధించినవే. ఆయన చెప్పిన మాటలు ఎల్లప్పుడూ జ్ఞాపకం ఉండేవి. కొన్ని నెలల అభ్యాసంతో, అవి స్వభావంలో అంతర్భాగాలు అయినాయి. పుణ్యక్షేత్రం, నదీ తీరం, పవిత్ర జలాశయం, పర్వత గుహ, పర్వత శిఖరం, ఏకాంతమైన తోట, దేవాలయం, తన ఇల్లు సంధ్యావందనం చేయడానికి అనువైన స్థలాలని శాస్త్రాలు చెపుతున్నాయి. శ్రీరామ్ మొదట్లో ఊరిబయట ఉన్న దేవాలయంలో కూర్చొని సంధ్యావందనం చేసేవారు. తండ్రిగారు స్వర్గస్థులు అయిన తర్వాత ఆయన ఇంటిలోనే సంధ్యావందనం చేస్తూవచ్చారు. విశాలమైన ఆ భవంతిలోని ఒక గదిలో పూజా స్థలం ఏర్పాటయింది. ఆ గది ద్వారం తూర్పున తెరచి ఉంది. ద్వారం ఎదురుగా తులసి మొక్క ఉంది. సంధ్యావందనం కోసం కూర్చున్నప్పుడు ముఖం తూర్పువైపు ఉంటుంది. అర్ఘ్యం ఇచ్చేందుకై ఆయన బయటికి వస్తారు. తులసిమొక్క దగ్గర నిలబడి సూర్యనమస్కారం చేసి, తులసి ఆకులమీద పడేవిధంగా నీళ్ళు వదులుతారు.



దేవాలయంలో సంధ్యావందనం చేసేటప్పుడు అర్ఘ్యం కోసం లేచి బయటికి వెళ్ళవలసి వచ్చేది కాదు. కూర్చున్న చోటనే ఎదురుగా ఒక పాత్ర ఉంచేవారు. నిలబడి నీళ్లు వదిలేవారు. తల్లిగారు చెప్పిన మీదట ఇంటిలోనే ఉపాసన ప్రారంభించారు. ఇక్కడ అర్ఘ్యం కోసం బయటికి వెళ్లడం అవసరం అయింది. ఆయన స్థలాన్ని ఎంత మెలకువతో ఎంపిక చేశారో, సమయ నిర్ణయంకూడ అంతే మెలకువతో చేశారు. ఆ సమయాన్ని అక్షరాలా పాటించడానికి ప్రయత్నించారు. ప్రాతః సంధ్య సూర్యోదయానికి ముందు ప్రారంభం కావాలి. సాయం సంధ్య సూర్యాస్తమయానికి ముందు ప్రారంభం కావాలి.

శ్రీరామ్ తెల్లవారుజామున 4 గంటలకు నిద్ర మేల్కొనేవారు. స్నానాదులు ముగించుకుని సంధ్యావందనం కోసం కూర్చోవడానికి గంట పట్టేది. భవంతి ప్రాంగణంలో ఉన్న బావినుండి ఆయన స్వయంగా నీళ్లు తోడుకునేవారు. ప్రాంగణంలో లాంతరు వెలుగు వ్యాపించి ఉండేది. కనుక నీళ్లు తోడడానికి ఇబ్బంది ఉండేది కాదు. భవంతిలోనివారు అప్పటికి నిద్రలేచేవారు. అయినా, నీళ్లు తోడేటప్పుడూ, నింపేటప్పుడూ శబ్దం రాకుండా శ్రీరామ్ జాగ్రత్తపడేవారు. నిశ్శబ్దంగా స్నానం ముగించేవారు. ఎవ్వరికీ అలికిడి తెలిసేది కాదు.

సంధ్యావందనం తర్వాత శ్రీరామ్ జప, ధ్యానాలలో పూర్తిగా తన్మయులు అయ్యేవారు. సంధ్యావందనం 40 నిమిషాలలో పూర్తయ్యేది. ఈ సమయంలో కూడా ఆయన పూర్తిగా తన్మయులుగా ఉండేవారు. గాయత్రీ మంత్రం ఒక

**బలహీనునికి అడ్డుపడిన రాయి బలవంతునికి సోపానం అవుతుంది.**

మాల, సూర్యోదయపు బంగారు వెలుగును ధ్యానించడం 6 నిమిషాలలో పూర్తయ్యేవి. అలవాటయిన తర్వాత 4 నిమిషాలే పట్టేది. ఈ స్థితిలో లెక్క కొద్దిగా తప్పే అవకాశం ఉంది. గాయత్రీ దీక్ష తీసుకున్న తర్వాత శ్రీరామ్ ఉదయం 5 మాలలు, సాయంత్రం 2 మాలలు జపం చేసేవారు. తన్మయత్వం ఎంతగా ఉండేదంటే - పొరపాటుకు అవకాశమే ఉండేది కాదు. ప్రాతః సంధ్యకూ, సాయం సంధ్యకూ మొత్తం గంట సమయం పట్టేది. జపం తర్వాత ధ్యాన - ధారణలు కూడ సమయం ప్రకారం జరిగేవి.

## చరిత్రాత్మకమైన ఘడియ

ఆరోజు విక్రమశకం 1983 వసంత పంచమి. ఆంగ్ల కాలగణన ప్రకారం 1926 ఫిబ్రవరి 18వ తేదీ. శ్రీరామ్ వయస్సు సుమారు 15 సంవత్సరాలు. ఆయన సంధ్యావందనం చేస్తున్నారు. గాయత్రీ జపం చేస్తూ తన్మయావస్థలో ఉన్నారు. సుఖాసనంలో కూర్చొన్న శ్రీరామ్ పెదిమలు కదులుతున్నాయి. నోటినుండి ధ్వని మాత్రం రావడం లేదు. అది ఉపాంశు జపం. ఆ జపంలో పెదిమలు కదులుతాయి. నోటిలోపల స్వర యంత్రాలలో కూడ స్ఫురణ జరుగుతూ ఉంటుంది. కాని ధ్వని రాదు. నోరు మూసిఉంచి మానస జపం చేయడానికి హెచ్చు సమయం పడుతుంది. మరచిపోయే అవకాశమూ ఉంది. కనుకనే, మాలవ్యాజీ ఉపాంశు జపానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ జపంతోపాటు తూర్పున ఉదయించే సవితా దేవత ధ్యానం. మూసిన కళ్లతో భృకుటిలో కానవస్తున్న క్షితిజమే ఉదయాచలం. భ్రూ మధ్యం ఆకృతి ఇలా ఉంటుంది - పర్వతాల గోళార్ధములు రెండూ కలుసు కుంటున్నట్లు, వాటి సంధి స్థలంపై కొత్త వెలుగు ఉదయిస్తున్నట్లు.

వెలుగు ఉదయిస్తున్న సమయంలో చేతనా జగత్తులో బంగారు శోభ వ్యాపించసాగింది. వెలుగు దుప్పటి పరచుకుంటోంది. నిసర్గం యొక్క ఈ విస్తరణతో తన అస్తిత్వం నిండిపోతుంది. శరీరం, మనస్సు, బుద్ధి, చిత్తం, దానికి అతీతమైన సత్తా - వీటి లోకములన్నింటిలో ఆ వెలుగుద్వారా జీవన-చేతన వ్యాప్తి అవుతోంది. తెల్లవారగానే రాత్రి నిద్ర తనకు తానుగా వైదొలగసాగుతుంది. అలాగే, చేతనను ఆవరించిన అలసట తొలగిపోతోంది. నవోత్సాహం ఉదయిస్తోంది. ఉదయపు తాజాతనం అస్తిత్వపు కణ కణంలో వ్యాపిస్తోంది. బంగారు వెలుగును ధ్యానం చేస్తూ ఉండగా, ఈ అనుభూతి ప్రగాఢం అవుతోంది.

ఏ క్షణంలో జరిగిన సంఘటన తర్వాతి వాక్యాలలో వర్ణించబడుతూన్నదో, ఆ క్షణంలో జప, ధ్యానముల స్థితి ఎలా ఉన్నదో చెప్పడం కష్టం. అది మనోమయ స్థితి అని లభించిన సమాచారాన్నిబట్టి చెప్పవచ్చు. ఈ స్థితిలో చిత్తం సంకల్ప-వికల్పముల నుండి విముక్తి పొందుతుంది. 'నిర్వాత నిష్కంప దీపశిఖ' అని యోగ శాస్త్రాలు అలాంటి చిత్రాన్ని వర్ణించాయి. గాలిలేని స్థలంలో వెలుగుతూన్న దీపపు జ్వాల చలించదు, కంపించదు. అలాగే, ఎప్పుడూ చలిస్తూ, ఊగుతూ ఉండే చిత్తంసైతం సంకల్ప-వికల్పముల వేగములు లోపించడంతో స్థిరంగా ఉంటుంది. ధ్యానంలో లోతుకు పోయి సమాధిని సమీపించే స్థితి ఇదేనని కొందరు యోగులు చెపుతారు.

## కాంతి శరీర అవతరణ

శ్రీరామ్ తన ఆసనంపై కూర్చొని ఉన్నారు. మనోలయ స్థితిలో లేక సమాధి భూమికలో ఉన్నారు. ఆ భూమిక నుండి పయనించి జపంయొక్క అంతిమ దశకు చేరుకున్నారు. జపం పూర్తయింది. సవితా దేవత చరణాలకు జప- నివేదన చేస్తూ చేతులు జోడించి కూర్చొని ఉండగా - అకస్మాత్తుగా గదిలో మెరుపు మెరిసింది. కళ్లను మిరుమిట్లు గొలిపే కాంతితో గది నిండిపోయింది. మెరుపు మెరిసి క్షణంలో మాయ మవుతుంది. అయితే, గదిలో ఆ వెలుగు స్థిరంగా నిలచింది. వెలుగు మెరుస్తోంది. అయితే దాని

**జ్ఞానులు నివసించే చోటు తీర్థం. అది నగరం కావచ్చు, అరణ్యం కావచ్చు.**

తీక్షణత శాంతించింది. చల్లబడింది. సూర్యుని బంగారు శోభ; చందమామ వెన్నెలవలె ప్రశాంతంగా, చల్లగా.

ఆ వెలుగు మెరిసిన సమయంలో - గదిలో వేయి సూర్యులు ఒకేసారి ప్రకాశిస్తున్నట్లు అనిపించింది. ఆ సమయంలో కలిగిన మిరుమిట్లు క్రమక్రమంగా స్థిరపడ్డాయి. గదిలో ఒక సౌమ్య ఆకృతి ఆవిర్భవించింది. పొడుగాటి జడలు. శరీరం బాగా కృశించిపోయింది. అయితే దేదీప్యమానంగా ఉంది. ఆ ఆకారం అస్పష్టంగా ఉంది. అయితే ఆ స్వరూపంలో తేజస్సు, బలం ప్రస్ఫుటంగా ఉన్నాయి. కృశించిన ఆ శరీరం ఉక్కుతో తయారైనట్లు తోచింది. ఆ ఆకారం దిగంబరం. చుట్టూ శోభా మండలం ఆవరించి ఉంది. శరీరం అక్కడక్కడ మంచు దుప్పటి కప్పుకున్నట్లు అనిపించింది. సాధకుడు శ్రీరామ్ ఆ సౌమ్య ఆకృతిని చూచి ఆనందించారు. మనస్సులో సంతృప్తి, ధైర్యం కలిగాయి. క్షణం క్రితం వ్యాపించిన భయం అదృశ్యం అయింది. ఆ అకృతిని చూచినప్పుడు మనస్సులో ఉల్లాసం ఉప్పొంగింది. లేచి ప్రణామం చేయాలనే కోరిక కలిగింది. సంధ్యావందనంలో ప్రదక్షిణ కర్మ ఇంకా మిగిలి ఉంది. ఆ దివ్య మూర్తి శ్రీరామ్ మనస్సులోని భావాలను చదివారు. కూర్చొని ఉండవలసిందిగా సైగ చేశారు. శ్రీరామ్ కూర్చొని ఆ ఆకృతిని పరికించి చూస్తూ ఉండిపోయారు. సవిత దేవఋషి రూపంలో ప్రత్యక్షం అయినట్లు ఆయనకు అనిపించింది.

ఆ ఆకృతి సమీపించింది. ఆ ఆకృతి అడుగు ముందుకు వేసి వచ్చినట్లు అనిపించలేదు. మధ్య దూరం దానికదిగా తగ్గినట్లు తోచింది. కూర్చున్న చోటినుంచే చేతులు చాచి పాదాలను తాకగలిగేటంత దగ్గరగా వచ్చింది ఆ ఆకృతి. పాదాలను తాకే అవసరం రాలేదు. తల తనకు తానుగా వంగి, పాదాలను తాకింది.

ఆ దివ్య ఆకృతి తన చేతిని శ్రీరామ్ తలపై ఉంచింది. ఆ స్పర్శ వ్యక్తిత్వంలో మేలుకొలిపిన మహానాదం మాటలకు అందనిది. ఇలాంటి అనుభూతులను వర్ణించడానికి మనీషులు వేయి విధాలుగా ప్రయత్నించారు. ప్రయత్నించిన తర్వాత అలసిపోయి మౌనం వహించారు. ఉపనిషత్తులు ఆ అనుభూతిని ఇలా వ్యక్తపరచాయి - వినేది (చెవి) మాట్లాడదు; మాట్లాడేది (నోరు) వినదు. కబీరు దీనిని 'గూంగె కెరీ సరసరా' అని గానం చేశారు. రుచి తెలుస్తుంది; కాని దాన్ని వర్ణించి చెప్పడం కష్టం.

### కాలం స్తంభించినట్లు

ఆ దివ్య స్పర్శ శ్రీరామ్ ఎదుట ఒక విలక్షణ ప్రపంచాన్ని ఆవిష్కరించింది. ఆ ప్రపంచంలో వాణియొక్క అవసరం రాలేదు. కాలమే ఆగిపోయింది. స్థలం తన సరిహద్దులను మరిచిపోయింది. దేశ కాలాలకు అతీతమైన ఆ అనుభూతిలో మార్గదర్శక సత్తా గత అనేక జన్మల యాత్ర చేయించింది. ఆ యాత్ర స్మృతులను వెలికితెచ్చుకుని జరగలేదు. శుద్ధ చేతనా జగత్తులో ప్రవేశించి జరిగింది.

ఆ జగత్తులో ప్రవేశించగానే, శ్రీరామ్ తాను వారణాసిలో ఉన్నట్లు అనుభూతి పొందారు. ఆ క్షణాన్ని అనుభూతి అని చెప్పడం పొరపాటేమో. ఆయన వారణాసిలోనే ఉన్నారు. పూజ గదిలో ఉన్న తన రూపం, వయస్సు, వేషం వేరు. ఆయన తనను తాను తనకు తెలియని రూపంలో చూచారు. అయితే, ఏదో ఆశ్చర్య లోకంలో ఉన్నట్లు అనిపించలేదు. అపరిచితం అయినప్పటికీ, ఆ సమయం, స్థితి, స్వరూపం, సహజం అనిపించింది. తన చేతనలోనే జరుగుతున్నట్లు. తాను ఆ స్థితికి నాయకుడు అయినట్లు.

ఒక దృశ్యంలో - స్వామి రామానంద కాశీలో స్నాన ఘట్టంలో స్నానం చేయడానికి వెళుతున్నారు. మెట్లమీద ఎవరో పడుకుని ఉన్నారు. రామానంద నుండి రామనామ దీక్ష పొందాలనే ఆశతో, అంతకు ముందు ఒక ప్రయత్నం చేసి చూచాడు. కానీ, గురువుగారి సహచరులు

**పగలు రాత్రి కలియవు. భగవంతుడు, వాసనలు కలియవు.**

అంగీకరించలేదు. అంత్యకులం వారికి రామనామ దీక్ష ఇవ్వడం సాధ్యపడదని వారు చెప్పారు. కావాలనుకుంటే వారు స్వయంగా రామనామం జపించవచ్చు. కానీ, గురువు నోటినుండి రామనామాన్ని వినే యోగ్యత వారికి లేదు - అని వారు వివరించారు. అలా పరుండిన వ్యక్తి సంత్ కబీర్; అతడే పూజ గదిలో తన తలమీద చేయి స్పర్శ పొంది ఇదంతా అనుభవం పొందుతూన్న శ్రీరామ్. అతడు తాను మెట్లమీద పరుండి ఉన్నట్లుకూడ చూస్తున్నాడు. బ్రహ్మ ముహూర్తంలో స్వామి రామానంద గంగా స్నానానికి వెళ్లారు. కబీరు మెట్లమీద కానరాని విధంగా ముడుచుకుని పడుకున్నారు. మెట్లు దిగుతూనే రామానంద కుడి కాలు కబీరు శరీరంపై పడింది. ఎవరికో దెబ్బ తగిలిందని ఆయనకు తెలిసింది. ఇలా తెలియగానే, స్వామీజీ నోటినుండి 'రామ్ రామ్' ధ్వని వెలువడింది. కబీరు తక్షణమే లేచి స్వామీజీ కాళ్ళు పట్టుకున్నారు. "గురువర్యా! నేను ధన్యుడను. నాకు గురుమంత్రం లభించింది"- అన్నారు.

ఈ సంఘటన తర్వాత స్వామి రామానంద కబీరును విధి విధానం ప్రకారం తమ శిష్యునిగా స్వీకరించారు. కాశీలోని విద్వాంసులూ, ఆచార్యులూ, సాధువులూ, మహామండలేశ్వరులూ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయనను ధర్మద్రోహిగా ప్రకటించారు. ఆచారంపట్ల, పరంపరలపట్ల అపరిమితమైన విశ్వాసం కలిగిన స్వామి రామానంద ఇందుకు ఏమాత్రం చలించలేదు.

కబీరు బట్టలు నేసి బ్రతుకు దెరువు సాగించేవారు. పని చేస్తూనే ఆయన సాధకులకూ, జిజ్ఞాసువులకూ ధర్మోపదేశం చేసేవారు. చాలామంది ఆయన చుట్టూ ఉన్నట్లు కానవస్తోంది. చర్చించే విషయం ఆధ్యాత్మికానికే పరిమితం కాలేదు. ఇల్లు, కుటుంబం, సమాజం, సమకాలీన సంఘటనలు - అన్నింటిపై సంభాషణ సాగుతోంది. బ్రతుకు దెరువుకు సరిపడే బట్ట తయారు కాగానే కబీరు దాన్ని అమ్మడానికి బయలుదేరారు. ఇంత ధర అనేది లేదు. ఎవరు ఎంత ధర కట్టితే, ఎంత ఇవ్వదలచితే - దాన్నే తీసుకున్నారు. ఆ తర్వాత ఇంటికి వచ్చారు. ఇలాంటి బేరంలో ఎన్నడూ నష్టం రాలేదు.

ఒక సత్సంగంలో ఎవరో అడిగారు - "కబీరు సాహబ్, మీ కుటుంబం ఎంతో సంతోషంగా ఉంది. సుఖమయమైన దాంపత్యంలోని రహస్యం ఏమిటి?" ఆ ప్రశ్న విని కబీరు కొద్ది క్షణాలు మౌనం వహించారు. ఆతర్వాత భార్యను పిలిచారు - "లోఈ! బాగా చీకటిగా ఉంది. దీపం వెలిగించి తీసుకురా" (లోఈ ఆయన భార్యపేరు). ఆ మాట విన్నవాళ్లకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. మిట్ట మధ్యాహ్న సమయం అది. ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. కబీరు సత్సంగంలో కూర్చున్న చోట బాగా వెలుగుగానే ఉంది. లోఈ దీపం వెలిగించి తెచ్చింది. కబీరు ప్రక్కన ఉన్న ఒక బల్లమీద పెట్టి వెళ్లిపోయింది. సత్సంగంలో పాల్గొంటూన్న వ్యక్తుల ఆశ్చర్యానికి అవధులు లేవు. కబీరు ఇలా అన్నారు - "భార్యా భర్తలమధ్య ఇలాంటి విశ్వాసం ఉంటే, దాంపత్యం ఎంతో హాయిగా సాగిపోతుంది. మిట్ట మధ్యాహ్నమనీ, దీపం అవసరం లేదనీ లోఈకి తెలుసు. అయినా నేను చెపితే ఆమె సందేహించలేదు. చెప్పిన ప్రకారం ఆమె మౌనంగా తన పని చేసుకుని వెళ్లిపోయింది."

కుటుంబానికి వచ్చే ఆదాయం పరిమితం. వచ్చిపోయే వారు వరుసలు కట్టి ఉంటున్నారు. వచ్చేవారికి స్వాగత సత్కారాలు కూడ జరుగుతున్నాయి. ఇంటిలో ఎప్పుడూ ఇబ్బందే. కొడుకు కమాల్ పెద్దవాడు అయ్యాడు. కుటుంబంలో ఉన్న ఇబ్బందులను పూర్తిగా తెలుసుకున్నాడు. అతడు వ్యాపారంమీద తన దృష్టిని లగ్నం చేశాడు. అందులో కూడ పవిత్రంగా, న్యాయంగా సంపాదించాలని కబీరు నొక్కిచెప్పేవారు. కుమారునికి ఆచరణాత్మక ఆధ్యాత్మికతలో దీక్ష ఇచ్చారు. అలాంటి సంస్కారాలనే అందజేశారు.

H H H

**లోక కళ్యాణం కోరని మనిషి ఓ బండరాయి.**

నావారితో నా మాట : మహోద్యమం సాగిస్తున్న విరాట్ యాత్ర - 3

# స్వరాజ్య ఉద్యమం కన్న మహత్తర ఉద్యమం

*అక్టోబరు 2004, నవంబరు 2004 సంచికలలో "నావారితో నామాట : మహోద్యమం సాగిస్తున్న విరాట్ యాత్ర" వ్యాసం 1,2 భాగాలు ప్రచురించబడ్డాయి. మూడవ భాగం ఇది. - సం.*

## అతివాదం తగదు

పరిజనులు ఏదైనా పనిని చేపట్టితే, వారు దానిలో పూర్తిగా మునిగిపోతారు. ఇదొక మంచి గుణమే.

అయితే - ఈ పనికి కేంద్ర బిందువు ఏది? దీని మూల స్రోతస్సు ఏది? ఈ విషయాలు తెలుసుకోకుండా ఏ పనిలో అయినా మునిగిపోవడం వ్యవస్థా - బుద్ధియొక్కలోపాన్ని తెలియజేస్తుంది.

మన మౌలిక లక్ష్యం యుగాన్ని నవనిర్మాణం చేయడం. విశ్వం మొత్తాన్ని మార్చడం ఇది యుగ నిర్మాణ యోజన. మనమంతా ఇందులో భాగస్వాములం. ఇందుకోసం మనం అనేక ఉద్యమాలను చేపట్టాలి. అధ్యాత్మ చేబితనను వ్యక్తి వ్యక్తికీ అందించాలి. యువతరానికి దారి చూపే దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం ప్రాజెక్టును వేగవంతం చేయాలి. ఎన్నెన్నో సమూహాలద్వారా సంస్కరణాత్మకములూ, సంఘర్షణాత్మకములూ, నిర్మాణాత్మకములూ అయిన కార్యములను ఒకేసారి నిర్వహించాలి. గాయత్రీ శక్తిపీఠాలు, ప్రజ్ఞా సంస్థాన్‌లు, నిర్మాణాత్మక కేంద్రాలు, జోనల్ కేంద్రాలు మన కార్యకలాపాలకు మాధ్యమాలు.

ప్రతి పరిస్థితిలోనూ మన మూలం ఒక్కటే. అది జీవన సాధన. సాధన కేంద్ర బిందువుగా యుగ నిర్మాణం. మన ప్రతి శ్వాసలో సాధన పలకాలి. మనం శ్రేష్ఠ సాధకులం కావాలి. మన లక్ష్యం ఇదే కావాలి. ఇందులో అతివాదం చూపుతున్నామా అని మనమంతా పరిశీలించుకోవాలి.

ఒక అతివాదం ఇది: మనం మనల్ని పూజ, అర్చన, ఆరతి- వీటికి పరిమితం చేసుకుంటాం. సంవత్సరంలో రెండు గాయత్రీ అనుష్ఠానాలు జరుపుతాం. మహాఅయితే, వారానికొక యజ్ఞం చేస్తాం. అయితే ఇదే సర్వస్వం కాదు. గాయత్రీ మంత్రం మన ప్రతి అవయవంనుండీ తీవ్రంగా వెలికిరావాలి. యజ్ఞమయ జీవనం మన మౌలిక లక్ష్యం కావాలి.

మరో అతివాదం ఉంది. మనం వీటన్నింటినీ ప్రక్కనపెడతాం. సామాజిక ఉద్యమాలను చేపట్టుతాం. ఒక సమాజ సేవకుడుగా తయారవుతాం. ప్రతి చోటికీ మనల్ని పిలుస్తూ ఉంటారు. పెక్కు ఎన్.జి.ఓలలో (ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలలో) మన సంస్థనుకూడ ఒకటిగా పరిగణిస్తారు. మనం సంస్కృతి జ్ఞాన పరీక్ష నిర్వహించే వాళ్లమనీ, వ్యసన విముక్తి ఉద్యమాన్ని నడిపేవాళ్లమనీ, యోగంద్వారా మూలికా వైద్యం ద్వారా ఆరోగ్య ఉద్యమాన్ని నిర్వహించే వాళ్లమనీ, స్వావలంబన రంగంలో గోసేవ జరిపేవాళ్లమనీ అందరూ అనుకుంటారు. ఇది చెడ్డ పనేమీ కాదు. అయితే దీనికే పరిమితం కావడం సరి కాదు.

మనం ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. **మనం ఒక సామాజిక ఉద్యమంతో కాక - సాక్షాత్తు భగవానునితో, అవతార చేతనతో ముడిపడి ఉన్నాం.** కనుక మనం విశిష్ట వ్యక్తులం. మన లక్ష్యం స్పష్టమే. అందుకు అనుగుణంగా మనకార్య ప్రణాళిక కూడ సమగ్రంగా ఉండాలి.

## ఈశ్వరీయ చేతన కలిగిన వ్యక్తుల కోసం అన్వేషణ

మనం అవతార చేతనతో ముడిపడి ఉంటే - మన పాత్ర ఏమిటి? పరమపూజనీయ గురుదేవులు "యుగ కీ మాంగ్ ప్రతిభా పరిష్కార్" అనే గ్రంథం ఒకటవ భాగం 9వ పుటలో ఇలా వ్రాశారు-

"పరమేశ్వరుడు ధర్మ రక్షణ, అధర్మ నాశనం అనే పని చేస్తాడు. అయితే, ఆ అదృశ్య ప్రేరణకు శరీరధారులైన మహామానవులే రూపం ఇస్తారు. నేడీ మహామానవుల కోసమే అన్వేషణ జరుగుతోంది. ఆతురతతో వారికోసమే గాలింపు జరుగుతోంది." చాలా స్పష్టమైన ఆలోచన ఇది. ఆ ఆలోచనకు చాలా స్పష్టమైన వ్యక్తీకరణ ఇది.

"సంభవామి యుగే యుగే" - అన్నది పరమాత్మ చేసిన వాగ్దానం. ఆ వాగ్దానాన్ని నెరవేర్చడానికై, యుగ పరివర్తన కోసమై ఆయన దిగివస్తారు కూడా. అయితే, పరమేశ్వర చేతనను ధారణ చేసిన, శరీరధారులైన, ఉన్నత స్థాయి ప్రతిభ కలిగిన మహామానవులే ఈ పని చేయగలుగుతారు. కొద్దిమంది మాత్రమే అందుకు ఎంపిక

**సమయాన్ని సద్వినియోగపరచితే, సాఫల్యం తథ్యం.**

చేయబడతారు. అయితే, అవతార అంశతో దిగివచ్చిన ఋషిసత్తాలు వారిని వెదకి పట్టుకుంటారు.

వాస్తవం ఏమంటే - దేవాత్మ హిమాలయం సాధనలో లీనమైన ఋషుల తపోభూమి. సూక్ష్మ శరీరాలు కలిగిన ఋషిగణాలు పరమాత్మ చేతన యొక్క ప్రకటీకరణకై మాధ్యమాలను వెదకే ప్రయత్నం చేస్తూ ఉంటారు. తాము స్వయంగా జన్మ ఎత్తడం వారికి ఇష్టం ఉండదు. వారు శ్రేష్ఠ ఆత్మల కోసం అన్వేషిస్తారు. ఆదర్శవాదం, ఉత్కృష్టతల అంశ ఎక్కడ కనిపించినా, వారు అది మాధ్యమంగా ధర్మ రక్షణ, అధర్మ వినాశనం అనే పని చేస్తారు.

నేడీ అన్వేషణయే జరుగుతోంది. మనం మన పాత్రతను రుజువు చేసుకుంటే, మనల్ని మనం సంస్కరించుకుంటే - ఈశ్వరీయ చేతన మనల్ని మాధ్యమాలుగా చేసుకుంటుంది; ప్రతిభామూర్తుల అగ్రశ్రేణిలో మనం చేర్చబడతాం. పరమాత్మ ఆతురతతో వెదుకుతూ ఉండడం, మనం లోభ మోహముల జాలంలో చిక్కుకుని ఉండడం - ఇది మనకు శోభ ఇచ్చే విషయం కాదు. సమయపు పిలుపును అందుకునే సామర్థ్యాన్ని మనం వికసింపజేసుకోవాలి.

మనం శ్రేయస్సుకు అధికారులమయ్యే తరుణం ఇదే. యుగ పరివర్తన వంటి సృజన కార్యాన్ని ప్రాణవంతులే పూర్తి చేయగలుగుతారు. గురుదేవులు ఇలా చెపుతున్నారు - సూక్ష్మ శరీరాలతో ఉన్న ఋషి గణాలు ఈ ఉప్పు సముద్రంలో మునకలు వేసి మణులను వెదకుతున్నారు; వారు ఎంతో వ్యాకులత చెందుతున్నారు; ఎందుకంటే ఈ పని సులువు కాదు; పరివర్తన వేగంగా జరుగవలసి ఉంది.

## విశిష్టమైన ఉద్యమం ఇది

యుగనిర్మాణ కార్యం ఒక భగీరథ ప్రయత్నం. మనం గత 2500 సంవత్సరాలలో పెద్ద పెద్ద ఉద్యమాలను చూచాం. బుద్ధ భగవానుని ఉద్యమం వచ్చింది. మహావీరుని ఉద్యమం వచ్చింది. ఈ ఉద్యమాలు ప్రపంచానికి కొత్త దారి చూపాయి. బౌద్ధమతం ప్రపంచమంతటా వ్యాపించింది. క్రీస్తుశకం ప్రారంభానికి ముందు (రెండువేల సంవత్సరాల పూర్వం) సముద్రగుప్తుని, పుష్యమిత్రుని శకం మనం చూచాం. స్వర్ణయుగాన్ని చూచాం. గురు గోరఖ్‌నాథ్, శంకరాచార్యులు, భక్తియుగంలో సంత్‌ల ఆవిర్భావం, కబీరువంటి ఫకీరును, సమర్థ రామదాసు వంటి, స్వామి వివేకానందుని వంటి వీర సన్యాసులను చూచాం. రామకృష్ణ పరమహంస ప్రారంభించిన యుగాన్ని అరవింద మహర్షి, రమణ మహర్షి ముందుకు తీసుకువెళ్లారు.

ఈరోజుల్లోనే భారత్‌కు స్వరాజ్యం వచ్చింది. అయితే అది రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే. పరిపాలన ఆంగ్లేయుల చేతుల్లోనుండి భారతీయుల చేతుల్లోకి వచ్చింది. అయినా, సాంస్కృతిక దాస్యం కొనసాగుతూనే ఉంది. అవినీతి పరులు, అసమర్థులు, పుత్రవ్యామోహపరులు, దురాశాపరులు అయిన రాజకీయ నాయకులు అధికారంలోకి వచ్చారు. జాతిని దోలిచివేశారు. ఎన్నో అద్భుత అవకాశాలు కలిగిన జాతి, అత్యధిక జనశక్తి కలిగిన జాతి మేడిపండులా తయారైంది. ధనికులకూ, పేదలకూ మధ్య అంతరం బాగా పెరిగిపోయింది. నగరీకరణ పెరిగిపోయింది. గ్రామాలు క్రమంగా నాశనం అవుతున్నాయి.

స్వరాజ్య ఉద్యమంలో జరిగిన పనికన్న మహత్తరమైన కార్యం ఒకరి భుజస్కంధాల మీద పడింది. స్వయంగా భగవానుడే ఆపని ఆయనకు అప్పగించాడు. జాతికి తిరిగి స్వాతంత్ర్యం తేవడమే ఆ పని.

## 15 సంవత్సరాలలో యుగ పరివర్తన

మనం నిర్వహిస్తూన్న ఈ యుగనిర్మాణ ఉద్యమం, వ్యక్తి వ్యక్తిలో దేవత్వాన్ని మేలుకొలపడం, ధరిత్రిపై స్వర్గ అవతరణ- ఇది స్వరాజ్య ఉద్యమంకన్న వేయిరెట్లు మహత్తరమైన ఉద్యమం. ఈ వాస్తవాన్ని మనం గుర్తించాలి. ఈ ఉద్యమం ద్వారానే మనం భారతవర్షాన్ని తిరిగి జగద్గురువును, విశ్వ సమ్రాట్టును చేయగలుగుతాం. భవిష్యత్తులోని అవకాశాలన్నీ ఇందులో ఇమిడి ఉన్నాయి. ఆధ్యాత్మిక ఆలోచనా ప్రవాహాన్ని విశ్వమంతటా విస్తరింపజేయడంద్వారా మాత్రమే, గాయత్రీ మహాశక్తిని వ్యక్తి వ్యక్తికీ అందించడం ద్వారా మాత్రమే యుగ పరివర్తన సాధ్యపడుతుంది.

వచ్చే 15 సంవత్సరాలలో దీన్ని వాస్తవం చేస్తాం. ఇది నిశ్చయం. పరమపూజ్య గురుదేవులు ఇలా వ్రాశారు -

"రాత్రిపూట ఉన్న చీకటి ఎల్లకాలం నిలిచిపోదు. పగలు వచ్చి తీరుతుంది. అప్పుడు చిన్నచిన్న పక్షులే కాక - గజరాజు తన ఘీంకారంతో, వనరాజు తన గర్జనతో దిక్కులను పిక్కటిల్లజేస్తాయి." (యుగకీ మాంగ్ ప్రతిభా పరిష్కార్-1, పుట-21).

## గజరాజు ఘీంకారం, వనరాజు గర్జన

అసురత్వం వ్యాప్తి చేసిన అంధకారం మనందరినీ

**తల్లి అజ్ఞాని అయితే బిడ్డ దొడ్డవాడు ఎలా అవుతాడు?**

భయపెడుతోంది. సూర్యోదయం జరగదని అనిపిస్తోంది. దేవత్వం జయించదని అనిపిస్తోంది. కానీ, ఇది వాస్తవం కాదు. అంధకారం తొలగిపోవడం ఖాయం. సూర్యుడు ఉదయించడం ఖాయం. తూర్పు దిక్కు ఎరుపెక్కడం ఖాయం. ఇలా వ్యాపించిన అసురత్వం అంతంకావడం ఖాయం. ప్రాతఃకాలంలో సూర్యోదయ సమయం సమీపించగానే, చిన్నచిన్న పక్షులు కిలకిలరావాలు చేస్తాయి. ఆ సమయంలో గజరాజు (పెద్ద పెద్ద శక్తులు), వనరాజు (గొప్ప గొప్ప ప్రతిభలు) తమ ఘీంకారాలతో, గర్జనలతో ఉదయించే సూర్యునికి స్వాగతం పలకడం కనిపిస్తుంది. నక్కలు, గుంటనక్కల వంటి క్షుద్ర ఆలోచనలు కలిగిన జీవులు పారిపోవడం కనిపిస్తుంది. రాత్రిపూట చెలరేగే అసుర శక్తులు పలాయనం కావడం కనిపిస్తుంది. ఇదే గురుదేవులు చెపుతున్న మాట.

ఇలాంటి అదృష్టం ఈ రోజులలో వస్తున్నదని ఆయన నొక్కి చెపుతున్నారు. దివ్యదృష్టి కలిగిన, భవిష్యత్తులోని దృశ్యాలను చూపగలిగిన, అవతార శక్తిని చేపట్టి అవతరించిన ఈ మహాశక్తి వాక్కులను మనం విశ్వసించాలి. వ్యతిరేకాత్మకమైన ఆలోచనను వదిలిపెట్టి, భావాత్మకంగా ఆలోచించాలి. దేవమానవులకు శోభ నిచ్చే పద్ధతి ఇది.

## సృజనకూ, సంతులనానికీ క్రాంతి

ప్రస్తుత సమయం మహా విప్లవాల ఆగమన సమయమని పరమపూజ్య గురుదేవులు చెప్పారు. "మహా విప్లవాలు సృజనకు, సంతులనానికీ మాత్రమే వస్తాయి'' - అని ఆయన వివరించారు. ఒక విధంగా - మహా విప్లవాలు అవతార ప్రకటీకరణను తెలుపుతాయి. మహా విప్లవాలు ఒక దాని తర్వాత మరొకటి వస్తూ ఉంటే, యుగ పరివర్తన తరుణం వచ్చిందని భావించాలి. కలియుగం అంతమై కృతయుగం వచ్చిందని భావించాలి.

గత చరిత్రను సమీక్షిస్తే మనకు కొన్ని వాస్తవాలు తెలుస్తాయి. ఒక విప్లవం రాజకీయ రంగంలో వచ్చింది. పారిశ్రామిక విప్లవం మొత్తం ప్రపంచపు చిత్రపటాన్ని మార్చివేసింది. ఆర్థిక విప్లవంకూడా ఇలాగే యావత్తు ప్రపంచాన్నీ పరివర్తన చేసింది. కమ్యూనికేషన్ విప్లవం ప్రపంచమంతనూ ఒక చిన్న గ్రామంగా (గ్లోబల్ విలేజ్) మార్చివేసింది. నేడు విశ్వమంతా ఒకే గొడుగు క్రిందకు వచ్చింది. 60 సంవత్సరాల క్రితం ఇది ఊహ కందని విషయం. పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం జరుగుతోంది. "**వసుధైవ కుటుంబకమ్**'' సిద్ధాంతం కార్యరూపం ధరిస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఆధ్యాత్మిక - సంస్కృతిక మహావిప్లవం ద్వారా మాత్రమే ఇది జరుగుతుంది. వైజ్ఞానిక అధ్యాత్మవాదం విశ్వవ్యాప్తి అవుతుంది. ఆధ్యాత్మిక మానవతావాదం విశ్వమతంగా రూపొందుతుంది. ఉగ్రవాదాలు సమాప్తం అవుతాయి. మనిషిలో దేవత్వం ఉప్పొంగడం కానవస్తుంది.

ఈ విషయంపై పరమపూజ్య గురుదేవులు ఇలా వ్రాశారు-

"శ్రేష్ఠమైన విలువలను స్థాపించడం కోసం విప్లవాలు రైలు పెట్టెలవలె ఒకదాని వెనుక మరొకటి పరుగు పరుగున వస్తున్నాయి. అవి వేగంగా పట్టాలమీద పరుగులు తీయడాన్ని కళ్ళున్న ప్రతి వ్యక్తీ ప్రత్యక్షంగా చూడగలుగుతాడు.''

ఉన్నత విలువల సంస్థాపనకే విప్లవాలు వస్తాయి. అవి ఆదర్శాలను ప్రతిష్ఠ చేస్తాయి. వ్యక్తి వ్యక్తిలో ఆదర్శాలపట్ల, శ్రేష్ఠత్వం పట్ల గౌరవం పెరుగుతుంది. అయితే ఈ విప్లవాలు శరవేగంతో వస్తాయి. గతంలో ఒక భౌతిక విప్లవానికి మరొక భౌతిక విప్లవానికి మధ్య వ్యవధి ఉంటూవచ్చింది. అయితే నేడు వస్తున్న ఆధ్యాత్మిక విప్లవాలు రైలు పెట్టెలు ఒకదాని తర్వాత ఒకటి వెంట వెంటనే పరుగున వస్తున్నట్లు వస్తున్నాయి. ఒక వ్యక్తి ఎస్.7 కంపార్ట్‌మెంట్‌లో ఎక్కి వెళ్లవలసి ఉన్నదని అనుకుందాం. అతడు ఆ కంపార్ట్‌మెంట్ ఆగే నిర్ణీత స్థలంలో నిలబడ్డాడని అనుకుందాం. ఇంజన్ తర్వాత ఒక్కొకటిగా ఆ కంపార్ట్‌మెంట్‌లు తనముందు వేగంగా వెళ్లడాన్ని అతడు చూస్తాడు. ఆతర్వాత అతడి కంపార్ట్‌మెంట్ అతని ముందుకు వస్తుంది.

ఇకముందు వచ్చే మహా విప్లవాలు ఇంత వేగంగా వస్తాయన్నది పూజ్య వరుల అభిప్రాయం. రాజకీయ రంగంనుండి అవినీతి ఎప్పుడు మాయమయిందో, కళారంగం ఎప్పుడు పూర్తిగా సంస్కరించబడిందో, మహిళా జాగరణ ఎప్పుడు జరిగిందో, సమాజమంతా వ్యసనాలనుండి ఎప్పుడు విముక్తి పొందిందో - కంటికి కనపడదు. ఇది అసాధ్యంగా కనిపిస్తుంది. అయినా ఖచ్చితంగా జరుగుతుంది. కళ్ళు ఉన్నవారు మాత్రమే దీన్ని చూడగలుగుతారు. అనగా - వివేక చక్షువు కలిగినవారు, జ్ఞాన నేత్రం కలిగినవారు దీన్ని చూడగలుగుతారు. దూరదృష్టి కలిగిన వివేకవంతులు మాత్రమే ఈ విప్లవాలు శరవేగంతో దూసుకురావడాన్ని చూడగలుగుతారు.

H H H

**వ్యక్తి గొప్పతనం రూపంలోకాక - గుణ కర్మ స్వభావాల శ్రేష్ఠతలో ఉంటుంది.**

తత్వ చింతన

# భగవత్‌శక్తిలో ఇమిడి ఉన్నాయి రహస్యాలన్నీ

ప్రపంచంలో మనం ఎన్నింటినో చూస్తూఉంటాం. ఎన్నింటినో తెలుసుకుంటూ ఉంటాం. వాటిలో విచిత్రమైన విషయాలు అనేకం ఉంటాయి. వాటిని మనం ఉపేక్షించలేం. వాటిని తెలుసుకోవాలనే ప్రయత్నం, వాటిని అవగాహన చేసుకోవాలనే ప్రయత్నం నిరంతరం జరుగుతూ ఉంటుంది. అయినా, వాటిలో చాలా కొద్ది భాగాన్ని మాత్రమే మనం తెలుసుకోగలుగుతున్నాం. చాలా హెచ్చు భాగం అర్థంకాకుండానే ఉండిపోతోంది. తిరుగులేని వాస్తవం ఇది.

## తనను తాను తెలుసుకోలేని మనిషి

ఈ విచిత్ర ప్రపంచంలో అన్నిటికన్న విచిత్రమైన విషయం ఒకటి ఉంది. మనిషి ఇంతవరకు తనను తాను తెలుసుకోలేక పోయాడు. తనను తాను తెలుసుకోవడం ప్రపంచంలో అన్నిటికన్నా అపురూపమైన విషయం. దీన్ని తెలుసుకోనిదే మనం విశ్వాన్ని తెలుసుకోలేము. మనిషి తనను తాను తెలుసుకోవాలని కోరుకుంటున్నాడు. కాని అందుకు తగ్గ స్థాయిలో ప్రయత్నం చేయలేకపోతున్నాడు. జ్ఞానానికి సంబంధించి - సిగ్గుపడవలసిన విషయం ఇది. పైపై ప్రయత్నాలు ఆ పరిణతిని, ఆ పరిపక్వతను ఇవ్వవు. ఇందుకోసం లోతయిన, గంభీరమైన ప్రయత్నం కావాలి. మనం ఎవరం? ఇది తెలుసుకుంటే, సృష్టి మొత్తాన్ని మనం తెలుసుకున్నట్లే, సృష్టి రహస్యాలను ఛేదించినట్లే.

విచిత్రాలతో నిండిన ఈ ప్రపంచం ఎలా తెలుసుకో బడుతుంది అనేది తెల్చి చెప్పడం కష్టం. కారణం ఏమంటే - తెలుసుకోవలసింది చాలా కఠినమైనది. అది అంతులేనిది. ఇక్కడ తెలుసుకోవలసింది పరమేశ్వరుణ్ణి మాత్రమే. ఆ పరమేశ్వరుని జ్ఞానం పొందడంవల్ల, అతడిని తెలుసుకోడంవల్ల కష్టాలన్నీ తీరిపోతాయి. మనకు ఆ జ్ఞానం అందనంతవరకు విచిత్రాలు, విలక్షణతల రహస్యం మనల్ని ఇబ్బంది పెడుతూనే ఉంటుంది. అయితే, భగవత్ దర్శనం లభించగానే, మనం ఆ రహస్యాల ముడులను విప్పగలుగుతాం.

## సృష్టికర్త భగవానుడే

ఈ సృష్టి భగవానుడు సృష్టించినది. ఇక్కడి రహస్యాలు కూడా ఆయన నియమించినవే. విచిత్రతలు కూడ ఆయనతో ముడిపడి ఉన్నాయి. ఈ జగత్తులోని కణ కణం రహస్యంతో నిండి ఉంది. ఇక్కడ కనిపించే దానిలో వాస్తవం ఉన్నది. కనిపించే ఈ జగత్తు యొక్క ఉనికి సరళమూ, జటిలమూ కూడ. కనుక దానిని వ్యాఖ్యానించడం సులభం కాదు.

ఈ జగత్తు సరళమైనది. ఎందుకంటే - ఇక్కడ కనిపించేది తనకు తానుగా తన అర్థాన్ని ప్రకటిస్తూ ఉంటోంది. ఈ జగత్తు జటిలమైనది. ఎందుకంటే - ఇక్కడ కార్య కారణ సంబంధాన్ని వివరించి చెప్పలేనివి ఎన్నెన్నో ఉన్నాయి. అనగా - ఫలానా పనికి ఫలానా ఫలితం వస్తుందని మనం చెప్పలేము.

కనుక - ఈ సృష్టి తెలియని రహస్యాల, తెలిసిన కారణాల కలగలుపు.

ఒక సంఘటనను వర్ణిస్తే ఈ సంగతి మరింతగా స్పష్టం అవుతుంది.

## భర్తృహరి ప్రక్కన కూర్చున్న సింహం

అరణ్యంలో పులులూ, సింహాలూ, చిరతపులులూ, నక్కలూ అన్నీ ఉంటాయి. ఇవన్నీ క్రూర జంతువులని అందరికీ తెలుసు. అయినా పెక్కు సందర్భాలలో అవి సాధు జంతువులుగా మారిపోతాయి. పెంపుడు జంతువులు అయిపోతాయి. భర్తృహరి ఒకరోజున నేపాల్ అడవులలో ఒక గుహ బయట ధ్యానంలో కూర్చున్నాడు. ఒక సింహం పరుగులు పెడుతూ గర్జిస్తూ అక్కడికి వచ్చింది. భర్తృహరి ప్రక్కన కూర్చున్నది. ఆ సింహాన్ని తరుముతూ నేపాలు రాజు అక్కడికి వచ్చాడు. సింహం ఆయనను చూడగానే గర్జించింది. ఆ ధ్వనికి భర్తృహరి సమాధి భంగమయింది. ఆయన కళ్లు తెరచాడు. సింహాన్ని బుజ్జగించాడు. ఇక మీదట వేట జరపవద్దని రాజుకు సలహా ఇచ్చాడు. రాజు అందుకు అంగీకరించాడు. తిరిగి వెళ్లిపోయాడు.

ఈ సంఘటన ఒక విషయాన్ని బోధిస్తోంది - ఈ జగత్తులో ఒక శక్తి ఇమిడి ఉంది. అది రహస్యాలలోని రహస్యం. దానిలో రహస్యాలన్నీ ఇమిడిపోయి ఒకటవుతాయి. ఆ శక్తి ఏమిటి?

తత్వవేత్తలు ఈ విషయమై ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. ఆ శక్తి మరేదీ కాదు - భగవత్ శక్తి. రహస్యాలకూ, విచిత్రాలకూ ఒకే ఒక పరిష్కారం ఆ భగవత్ శక్తి, దాన్ని తెలుసుకోవడం తెలియనివాటిని అన్నింటినీ తెలుసుకోవడమే.

ఆ భగవత్ శక్తిని పొందడానికి మనం ప్రయత్నించాలి.

H H H

**మహిళను భోగ వస్తువుగా చూడడం పశువు లక్షణం.**

## ఆచరణలో అధ్యాత్మ
# సేవలోనే శాశ్వత సుఖం

ప్రతి మనిషీ సుఖాన్ని కోరుకుంటాడు. సుఖం పొందడానికి వాడే సాధనాలు మాత్రం వేర్వేరుగా ఉంటాయి. అయితే ఆ సాధనాలు అశాశ్వతమైనవి. వాటివల్ల శాశ్వత సుఖాన్ని ఎలా పొందగలం. శాశ్వత సుఖాన్ని పొందాలంటే, మనం సరైన దృష్టిని వికసింపజేసుకోవాలి. నిజమైన సుఖం దేనిలో ఉంది, దానిని మనం ఎలా పొందగలం - అని ఆలోచించాలి.

### సుఖం వస్తువులలో లేదు

సుఖాన్ని బయటి వస్తువులలో పొందలేము. ఇప్పుడు ఒక వస్తువు లభించడంవల్ల మనకు ఎంతో సంతోషం కలుగుతుందని అనుకుందాం. కొంత సమయం తర్వాత ఆ సంతోషం నిలువదు. అది క్రమంగా తగ్గుతూ ఉంటుంది. మనసు మరో సుఖాన్ని వెదకడానికీ, దాన్ని పొందడానికీ వెంపరలాడుతుంది. ఏదైనా వస్తువును పొందాలనే కోరిక మన మనస్సులో పుడుతుంది. ఆ వస్తువు లభించిన తర్వాత మనస్సు అక్కడ నిలువదు. ఈవిధంగా జీవితంలో కృత్రిమత్వం, ఆడంబరం, భోగ విలాసాలు, పరిగ్రహం (తీసుకునే గుణం), బలం - వీటికోసం మనిషి పరుగులు తీస్తాడు. ఫలితంగా కష్ట నష్టాలను అనుభవిస్తాడు.

బయట తిరగడంవల్ల శాశ్వత సుఖం లభించదు. మన జీవితాన్నీ, పరమేశ్వరుడు ప్రసాదించిన శక్తియుక్తులనూ సద్వినియోగపరచడం నేర్చుకున్నపుడే సుఖం లభిస్తుంది. కర్మ చేయనిదే, కార్యశూరత చూపనిదే ఏ సిద్ధీ లభించదు. కష్టాలను సాకుగా చూపి చేతులు ముడుచుకుని కూర్చునే వ్యక్తులకు సుఖం లభించదు. కాకతాళీయంగా సుఖం లభించినా, అది స్థిరంగా ఉండదు. దృఢ సంకల్పంతో లక్ష్య సాధనకోసం ఏకాగ్రంగా పనిలో నిమగ్నమయ్యే వ్యక్తి లక్ష్యాన్ని చేరుకుంటాడు.

### మానసిక వికృతులవల్ల దుఃఖం

జీవితంలో అవమానం, హాని, రోగం, మరణముల భయంకూడ మనిషిని సుఖంగా ఉండనివ్వదు. మన జీవితమంతా ఈ చెడు ఊహల భయంలో గడచిపోతుంది. భయం మనిషిని మాటిమాటికీ కదిపివేస్తుంది. కుదిపివేస్తుంది. కనుక, ఆ భయాన్ని దరిచేరనివ్వకూడదు. నిరాశ స్థానంలో ఉత్సాహాన్ని మేలుకొలపాలి. మనల్ని మనం కించపరచుకో కూడదు. మన స్థితిని దయనీయం చేసుకోకూడదు. జీవం, జవం కలిగిన వ్యక్తిత్వాన్ని మనం నిర్మాణం చేసుకోవాలి.

జీవితంపట్ల విశ్వాసం, ఉత్సాహం, పరమాత్మలో నమ్మకం మనిషిని సదా సుఖంగా నిలిపి ఉంచుతాయి. ద్వేషం, క్రోధం, చింత, అసూయ, క్లేశం - ఈ మనో వికారాలన్నీ మనలోపల మానసిక వికృతులను సృష్టిస్తాయి. మనకు దుఃఖాన్ని కలిగిస్తూ ఉంటాయి. ఆత్మగౌరవం పేరిట, స్వాభిమానం పేరిట లేనిపోని అహంకారం మనకే నష్టం కలిగిస్తుంది. సహజమూ, సరళమూ అయిన స్వభావం కలిగిన వ్యక్తి సర్వత్రా గౌరవం పొందుతాడు. సుఖంగా ఉంటాడు.

### సౌశీల్యమే నిజమైన సంపద

జీవితాన్ని సుఖమయం చేసుకోవడంలో శీలానికి మహత్తర ప్రాధాన్యం ఉంది. సౌశీల్యం మానవత్వానికి ప్రతీక. శీల సంపద మనిషికి ఆసరాగా నిలుస్తుంది. సౌశీల్యమే నిజమైన సంపద. శీల సంపదకు కట్టుబడి ఉంటే, మనోబలం పెరుగుతుంది. క్లిష్ట పరిస్థితులలో సైతం ధైర్యాన్ని కోల్పోకుండా ముందడుగువేసే సాహసం నిలచి ఉంటుంది.

మనిషి జీవితం అనేక సంస్కారాలతో అంటిపెట్టుకుని ఉంటుంది. ముడిపడి ఉంటుంది. ఆ సంస్కారాలు మంచివీ కావచ్చు, చెడ్డవీ కావచ్చు. శుభ కర్మలద్వారానే శుభ సంస్కారాలు నిర్మాణం అవుతాయి. చెడు సంస్కారాలు తొలగిపోతాయి. నిరంతర అభ్యాసంద్వారా తన మనస్సును

**నవ్వుతూ నవ్విస్తూ జీవించడంలోనే ఉంది సార్థకత.**

అదుపు చేయడంలో సఫలమైన వ్యక్తి సహజంగానే సుఖంగా ఉంటాడు.

సుఖానికి బద్ధ శత్రువు క్రోధం. క్రోధం మనిషిని ఆలోచనారహితునిగా చేస్తుంది. శక్తిహీనునిగా చేసివేస్తుంది. పెను తుఫాను వేగం తోటలను సర్వనాశనం చేస్తుంది. వాటి అందాన్ని కబళించివేస్తుంది. అలాగే - కోపోద్రేకం వ్యక్తి శరీరంలో, మనస్సులో తుఫానును సృష్టిస్తుంది. అతని చేత ఎన్నెన్నో కూడని పనులు చేయిస్తుంది. కోప స్థితిలో మనిషి లోపల తీవ్రమైన ఆవేశం ఏర్పడుతుంది. కోపపు పొంగు చల్లారగానే- ఆ ఆవేశంలో చేసిన పనులకు పశ్చాత్తాపం చెందవలసి వస్తుంది. చాలాసేపు దుఃఖంలో మునిగిపోవలసి వస్తుంది.

అసంతృప్తి కూడ సుఖానికి పెద్ద ఆటంకం. ఎంత లభించినా, మనిషికి సంతృప్తి ఉండదు. భౌతిక వస్తువులవల్ల ఇంతవరకు ఎవరికీ తృప్తి కలుగలేదు. ఇకముందు కలుగబోదు. మనస్సు తృప్తిగా ఉంటే, దానికి ఏ వస్తువుల కొరతా ఉండదు. అప్పుడు వ్యక్తి నిరంతర సుఖాన్ని అనుభవిస్తాడు. మామూలుగా జనం సాఫల్యంలో సుఖాన్నీ, వైఫల్యంలో దుఃఖాన్నీ పొందుతారు. అయితే నిజమైన సుఖాన్ని పొందాలంటే మనిషి నిజమైన కర్మయోగి కావాలి. ప్రతి పరిస్థితిలో సమభావాన్ని అలవరచుకోవాలి.

సుఖంగా ఉండాలంటే పరిస్థితులను చూచి ఏడుస్తూ కూర్చొనకూడదు. ఉద్యమశీలత, పరాక్రమం, ధైర్య సాహసాలు ఉన్నచోట దుఃఖానికి నిలువ నీడ ఉండదు. ప్రతి రాత్రి తర్వాత ఉదయం వచ్చితీరుతుంది. వేడి గాలులు వీచడం వల్లనే ఆవిరి మేఘంగా మారుతుంది. వర్షంగా కురిసి భూమిని సస్యశ్యామలం చేస్తుంది. జీవితంలో వచ్చే దుఃఖాలు, చింతలు, ఉద్రిక్తతలు, ఇతర సమస్యలు మనిషిని నిరంతరం కర్మశీలునిగా చేస్తాయి. భావాత్మక దృష్టితో చూస్తే - ఆపద సమయంలో సైతం సుఖాన్ని అనుభూతి పొందవచ్చు.

## ఇవ్వడంలో నిజమైన సుఖం

పొందడంలోకాక, ఇవ్వడంలో నిజమైన సుఖం ఉంది. పరస్పర వ్యవహారణలో తనకన్న ఇతరులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇతరులను ఉపేక్షించకూడదు. ఇతరులకు తగు సహకారం అందించడం ద్వారానే మనకు సుఖం లభిస్తుంది. స్వార్థరహితమైన సేవ మనస్సుకు స్థిరమైన సుఖాన్ని ఇస్తుంది. ఇతరుల అంతఃకరణలకు కష్టం కలిగించడంవల్ల, ఇతరులకు చెడు జరగాలని కోరడంవల్ల మన అంతఃకరణ మలినం అవుతుంది. కలుషితం అవుతుంది. కనుక అలాంటివి తగవు.

ప్రేమ, సత్యం, తపస్సు, త్యాగముల పునాదిపై నిర్మించిన సుఖ సౌధం శాశ్వతంగా ఉంటుంది. ఇందువల్ల మన బాహ్య జీవనం సుఖ సంతృప్తులతో నిండుతుంది. అంతే కాదు. మనలోపలకూడ ఎన్నడూ ఎండిపోని ఆనంద ప్రవాహం ఉప్పొంగుతుంది. ఈ భావనలు మనిషిని లోపలనుండి నింపుతాయి. భౌతిక సాధనాలు ఎంతటి బాహ్య సుఖాన్ని అయినా ఇవ్వవచ్చు. కాని లోపల ఖాళీ మిగిలిపోతుంది.

## భోగవాద సంస్కృతి తగదు

కోరికలు పూర్తికావడంవల్ల సుఖం లభించదు. కోరికలు ఒకదాని తర్వాత మరొకటి జీవితమంతా మనిషిని పెనవేసుకుని ఉంటాయి. మరణం తర్వాత కూడ ఈ కోరికలు మనల్ని వదిలిపెట్టవు. సూక్ష్మ సంస్కారాలుగా మారి, ఆత్మను అంటిపెట్టుకుని ఉంటాయి. జీవితమంతా సుఖ సాధనాలను ప్రోగుచేస్తూ పోతూ ఉంటే - వర్తమాన జీవితం వ్యర్థం అయిపోతుంది. వచ్చే జన్మకూడ చీకటి గుయ్యారంగా మారిపోతుంది. సుఖం కావాలని అనుకుంటే మనం భోగవాద సంస్కృతిని విడనాడాలి. మన దేవ సంస్కృతిని అక్షరాలా అనుసరించాలి.

**సర్వే భవంతుః సుఖినః సర్వేసంతు నిరామయా ।**
**సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్॥**

పై శ్లోకంలో ఉన్న భావనయే
నిజమైన సుఖానికి సరైన మార్గం.

H H H

**సువ్యవస్థిత దినచర్య ఆరోగ్యానికి మూలం.**

## వార్తలు

# కొత్తపేటలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం

కరీంనగర్ జిల్లా వెల్లటూరు మండలం కొత్తపేట గ్రామంలో 2004 ఆగస్టు 29న 108 కలశాలతో కలశయాత్ర, నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం, ఆరోజు సాయంత్రం 5000 దీపాలతో దీపయజ్ఞం జరిగాయి. 500 మంది పాల్గొన్నారు.

కొత్తపేటలో జరిగిన ఆశ్వయుజ నవరాత్రి లఘు అనుష్ఠానంలో నలుగురు పాల్గొన్నారు.

### మల్యాలలో సంస్కారాలు

కరీంనగర్ జిల్లా చందుర్తి మండలం మల్యాల గ్రామంలో చి॥వరలక్ష్మికు కేశఖండన సంస్కారం, శ్రీమతి పులి వనజకు పుంసవన సంస్కారం, ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగాయి. ఆశ్వయుజ నవరాత్రి లఘు అనుష్ఠానంలో 9 మంది పాల్గొన్నారు.

### మారుపాకలో నవరాత్రి అనుష్ఠానం

కరీంనగర్ జిల్లా వేములవాడ మండలం మారుపాక గ్రామంలో అక్టోబరు 15 నుండి 23 వరకు ఆశ్వయుజ నవరాత్రి లఘు అనుష్ఠానం జరిగింది. నలుగురు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ 24 వేల గాయత్రీ జపం చేశారు. చివరి రోజు పూర్ణాహుతి, గాయత్రీ మహాయజ్ఞం జరిగాయి.

మారుపాకలో ప్రతి పౌర్ణమి నాడు సామూహిక గాయత్రీ యజ్ఞం జరుగుతోంది.

### అబ్బాపూర్‌లో గాయత్రీ యజ్ఞం

కరీంనగర్ జిల్లా ధర్మారం మండలం అబ్బాపూర్ గ్రామంలో ఆశ్వయుజ నవరాత్రి అనుష్ఠానం, పూర్ణాహుతి, డా॥పులి సత్యనారాయణ ఆధ్వర్యంలో గాయత్రీ యజ్ఞం జరిగాయి.

### సిరిసిల్లలో గాయత్రీ యజ్ఞం

కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో శ్రీయుతులు లక్ష్మన్, దేకొండ నాగభూషణం, పులి లక్ష్మన్, పులి దేవయ్య గృహాలలో గాయత్రీ యజ్ఞాలు, సత్యనారాయణ వ్రతాలు జరిగాయి.

### వేములవాడలో జన్మదిన సంస్కారం

2004 డిసెంబరు 7న కరీంనగర్ జిల్లా వేములవాడలో చి॥చైతన్య జన్మదిన సంస్కారం జరిగింది. డా॥పులి సత్యనారాయణ ఆధ్వర్యం వహించారు. 108 దీపాలతో దీపయజ్ఞం జరిగింది. శ్రీజక్కని భూపతి కార్యక్రమానికి నాయకత్వం వహించారు. 50 మంది పాల్గొన్నారు.

### కరీంనగర్ జిల్లాలో సాప్తాహిక సామూహిక సాధనలు

2004 ఆగస్టు 13 నుండి 19 వరకు మల్యాలలో సాప్తాహిక సామూహిక సాధన జరిగింది. నడిగట్ల కవిత నేతృత్వం వహించారు. చివరి రోజున దీపయజ్ఞం, ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగాయి.

ఇలా మల్యాలలోని 8 గృహాలలో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలలో సాప్తాహిక సామూహిక సాధన జరిగింది.

చివరి రోజున అన్ని గృహాలలో 108 దీపాలతో దీపయజ్ఞాలు, పూర్ణాహుతి జరిగాయి.

డా॥ పులి సత్యనారాయణ అధ్వర్యంలో ఈ సామూహిక సాధన జరిగింది.

### శ్రీకాకుళంలో నవరాత్రి అనుష్ఠానం

శ్రీకాకుళంలో జిల్లాపరిషత్ కార్యాలయం వెనుక గల హౌసింగ్ బోర్డు కాలనీలో 2004 అక్టోబరు 14 నుండి 21 వరకు ఆశ్వయుజ నవరాత్రి లఘు అనుష్ఠానం జరిగింది. 8 మంది పాల్గొన్నారు. 24,000 గాయత్రీ మంత్ర జపం జరిగింది. 22న పూర్ణాహుతి, గాయత్రీ యజ్ఞం జరిగాయి.

సంధ్యశ్రీ ఆధ్వర్యంలో మూడు గృహాలలో గాయత్రీ యజ్ఞాలు, మూడు గృహాలలో దీపయజ్ఞాలు జరిగాయి.

### పులివెందులలో త్రికుండీ యజ్ఞం

కడపజిల్లా పులివెందులలోని శివాలయంలో 2004 నవంబరు 29న కార్తీక సోమవారం సందర్భంగా త్రికుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీయుతులు డి.వి.ఆర్. మూర్తి, ఓ.సిద్దారెడ్డి, ఎ.ఆర్ముగం, గురుమూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పుంసవన సంస్కారం, గోపూజలు నిర్వహించారు.

### నెల్లూరులో గాయత్రీ యజ్ఞం

2004 నవంబరు 26న కార్తీక పూర్ణిమ సందర్భంగా నెల్లూరులో గాయత్రీ యజ్ఞం జరిగింది. డా॥ తుమ్మూరి, ఓ.సిద్దారెడ్డి, ఏ.ఆర్ముగం, గురుమూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు.

H H H

**క్రాంతి మొదట హృదయంలో వెలిగి, తర్వాత సమాజాన్ని వెలిగిస్తుంది.**

# యుగశక్తి గాయత్రీ కేంద్రంలో

## దేవ మానవుల ఆవిర్భావానికి దోహదంచేసే గ్రంథాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | ధైర్యం విడవకండి | 2.00 | 27. | మరణం తర్వాత మన స్థితి ఏమిటి | 5.00 |
| 2. | మానసిక సంతులనము | 2.00 | 28. | ప్రజ్ఞా పురాణ కథలు | 8.00 |
| 3. | మన గౌరవ గరిమ | 2.00 | 29. | గో సంరక్షణయే మన సంరక్షణ | 8.00 |
| 4. | సద్గురు వచనామృతం | 2.00 | 30. | గాయత్రీ హవనవిధి | 8.00 |
| 5. | గాయత్రి ఉపాసన | 3.00 | 31. | ప్రార్థన ప్రత్యక్ష చమత్కారాలు | 8.00 |
| 6. | గాయత్రి రామాయణము | 3.00 | 32. | క్రాంతి శిఖరం | 8.00 |
| 7. | గాయత్రి స్మృతి | 2.00 | 33. | యుగ యజ్ఞ పద్ధతి | 10.00 |
| 8. | ఆరోగ్య జీవన రహస్యం | 3.00 | 34. | నేను ఏమిటి | 10.00 |
| 9. | నిత్యజీవితంలో తులసి | 2.00 | 35. | ఏకాంత సహచరులు | 10.00 |
| 10. | సంస్కారాల పుణ్య పరంపర | 4.00 | 36. | కల్ప సాధన | 12.00 |
| 11. | మార్పు యొక్క మహత్తర క్షణాలు | 4.00 | 37. | ఆత్మకథ | 25.00 |
| 12. | సందేహాలు సమాధానాలు | 5.00 | 38. | నారీ మహత్య ప్రకరణము | 15.00 |
| 13. | గృహలక్ష్మి ప్రతిష్ట | 4.00 | 39. | శ్రీమద్భాగవత కథ | 18.00 |
| 14. | ప్రాణాంతక వ్యసనాలు | 4.00 | 40. | కుండలినీ మహా విజ్ఞానము | 18.00 |
| 15. | పవిత్ర జీవనము | 4.00 | 41. | గాయత్రి మహా విజ్ఞానము మొదటి భాగం | 30.00 |
| 16. | ఋగ్వేద భూమిక | 4.00 | 42. | గాయత్రి మహా విజ్ఞానము రెండవ భాగం | 30.00 |
| 17. | గాయత్రి మంత్ర లేఖనం | 5.00 | 43. | గాయత్రి మహా విజ్ఞానము మూడవ భాగం | 25.00 |
| 18. | గహనో కర్మణో గతిః | 5.00 | 44. | అమృతకలశం | 25.00 |
| 19. | చాలీసా చిత్రావళి | 5.00 | 45. | వేదముల దివ్య సందేశము | 40.00 |
| 20. | ప్రతిభావంతులారా లేవండి ముందుకు రండి | 5.00 | 46. | 24 శక్తి ధారలు | 30.00 |
| 21. | మూలికా చికిత్సా శాస్త్రము | 5.00 | 47. | సూర్య విజ్ఞానము | 18.00 |
| 22. | స్వాతంత్ర్య సంగ్రామ సేనాని | 5.00 | 48. | తల్లి దీవెన (మాతాజీ సూక్తులు) | 2.00 |
| 23. | సమయదానమే యుగధర్మం | 5.00 | 49. | ఉపాసన సాధన | 10.00 |
| 24. | జీవన సాధనకు బంగారు సూత్రాలు | 5.00 | 50. | కర్మఖాండ భాస్కర | 80.00 |
| 25. | యజ్ఞం ఒక సమగ్ర శాస్త్రము | 5.00 | 51. | మాతాజీ దివ్యచరిత్ర | 40.00 |
| 26. | గురుదీక్ష | 5.00 | 52. | వంటింటి వైద్యములు | 5.00 |

**పోస్టేజి, ప్యాకింగ్ అదనం.**